ప్రపంచ సాహిత్యం-35

తూర్పు పడమర

విలియం వర్డ్స్‌వర్త్ శామ్యూల్ టేలర్ కాలరిడ్జ్

డాక్టర్ లంకా శివరామప్రసాద్

ప్రపంచ సాహిత్యం- 35

తూర్పు - పడమర

(విలియం వర్డ్స్‌వర్త్,
శామ్యూల్ టేలర్ కాలరిడ్జ్)

డాక్టర్ లంకా శివరామప్రసాద్

తూర్పు - పడమర

(విలియం వర్డ్స్‌వర్త్, శామ్యూల్ టేలర్ కాలరిడ్జ్)

Translated by

Dr. Lanka Siva Rama Prasad

May 2017

All rights reserved

Copyright @ 2017
by **Dr. Lanka Siva Rama Prasad**
Head of the Department
Cardiothoracic & Vascular Surgery
Prathima Institute of Medical Sciences
Nagunur Road, Karimnagar - 505 417, Telangana.

Published by:

Dr. Lanka Siva Rama Prasad
Srijana Lokam / Writer's Corner
Prasanthi Hospital
Sivanagar, WARANGAL-506 002,
Telangana, INDIA
Mobile : 8897849442
Email: lankasrprasad@gmail.com

Distributed by-
All leading book centers
Visalandhra Publishing House
Navodaya Publishing House

E-book: www.kinige.com

Price : ₹ **200 $ 4**

Cover Design & Post Script : **Prakash Pula**

Printed at :

Vasavi Printers
J.P.N. Road, Warangal. Ph : 0870-2426364

This book is presented to...

ఈ రచనకు ఆధార గ్రంథాలు

Master Poems of the English Language
Edited by Oscar Williams

ప్రస్తావన

వాళ్లిద్దరూ స్నేహితులు. ఇద్దరూ కలిసి కొన్నాళ్లు తిరిగారు, కవిత్వం వ్రాసారు, ప్రచురించారు. విమర్శించుకున్నారు, విడిపోయారు. అయినా ఇద్దరూ ఒక గొప్ప కవిత్వయుగానికి (Romantism) – కాల్పనిక వాదమైన భావవాద యుగానికి తెరతీసినారు.

ఫ్రెంచి విప్లవ కాలమది (1789–1799).

తిరుగుబాటు – నినాదం; మార్పు కావాలి – అదే లక్ష్యం.

"Bliss was it in that down to be alive,
But to be young was very heaven" అన్నాడు విలియం వర్డ్స్‌వర్త్.

హృదయపు ఉద్వేగాలు అతడి కవిత్వపు మూలాలు. అతడికి తోడూ నీడా అతడి సోదరి డోరతి.

కాలరిడ్జి అందగాడు, అయితే కీళ్లనెప్పుల జ్వరం అతడిని తరచుగా మంచాన పడేసేది. స్నేహితులెక్కువ, ఖర్చులెక్కువ. అప్పులు చేసి తీర్చలేక లండన్ పారిపోయాడు. 'I fled to Debauchery'

వర్డ్స్‌వర్త్ ఫ్రాన్సులో Annette Vallon తో కాలం గడిపి Coroline కి తండ్రి అయినాడు. బ్రిటన్–ఫ్రాన్సుల గొడవలు వారి కాపురంలో చిచ్చుపెట్టగా ఇంగ్లండ్ వచ్చి మేరీ హచిన్‌సన్‌ను 1802లో పెండ్లి చేసుకున్నాడు. కాలరిడ్జి తొలిప్రేమ (మేరీ ఇవాన్స్) ఫలించక సారా ఫ్రికర్‌ను వివాహమాడి – Married in haste and repented in leisure - గొడవలు పడుతూ – వర్డ్స్‌వర్త్ భార్య మేరీ హచిన్‌సన్ సోదరి Sara Hutchinson ను ప్రేమించి పెళ్లాడలేక వ్యధ చెందినాడు.

ఇద్దరూ ప్రకృతి ప్రేమికులే. ఒకరి చూపు ఆశ వేపు. ఇకొకరిది నిరాశ చూపు. వర్డ్స్‌వర్త్ తూర్పు, కాలరిడ్జి పడమర. ఈ ఇద్దరి కవుల అద్భుత కవితలను కొన్నింటిని అనువదించి సృజనలోకం తెలుగు సాహితీలోకానికి సవినయంగా సమర్పిస్తున్నది.

– డాక్టర్ లంకా శివరామప్రసాద్

విలియం వర్డ్స్‌వర్త్

1. కావ్యగీతం 8
(Ode)

2. మేఘంలా నేను ఒంటరిగా తిరిగాను 18
(I Wandered lonely as a cloud)

3. టిన్‌టరన్ అబ్బెకు కొద్దిమైళ్ల ఎత్తులో వ్రాసిన వాక్యాలు 20
(Lines composed a few miles above Tintern Abbey)

4. కాయల్ని కొట్టుకు రావడం 27
(Nutting)

5. ల్యూసీ కవితలు 31
(Lucy Poems)

6. వెస్ట్ మినిస్టర్ వంతెనపై (సెప్టెంబర్ 3, 1802) 35
(Upon Westminister Bridge, September 3, 1802)

7. నిర్ణయము – స్వాతంత్ర్యము 36
(Resolution and Independence)

8. ఈ ప్రపంచం మనకు కావాల్సిన దానికన్నా అధికంగా ఉన్నది..... 43
(The World is too much with us)

9. లండన్ – 1802 44
(London - 1802)

10. పంటను కోస్తున్న ఒంటరి యువతి 45
(The Solitary Reaper)

11. తిరగబడిన బల్లలు.. 47
(The Tables Turned)

శామ్యూల్ టేలర్ కాలరిడ్జి

1. కుబ్లాఖాన్ లేదా స్వప్నదర్శనం 50
(Kublakhan or a vision in a dream (A fragment))

2. వృద్ధ నావికుడి గీతం 55
The rime of the Ancient Mariner in Seven Parts

3. నిరుత్సాహం : గేయకావ్యం 82
(Dejection : An Ode)

4. అర్ధరాత్రి మంచు 89
(Frost at Midnight)

5. ఎవొలియన్ వీణ 93
(The Aeolian Harp)

6. లింబో-1, 2 96
(Limbo-1, 2)

7. నిమ్మచెట్టు పొదరిల్లు, నా జైలు 98
(The Lime-Green Bower My Prison)

8. ఆశలేని పని 102
(Work without hope)

9. అట్టర్ నది 103
(The river otter)

10. అస్రాకు 104
(To Asra)

11. నిద్రా బాధలు 105
(The Pains of Sleep)

విలియం వర్డ్స్‌వర్త్

(1770-1850)

1. కావ్యగీతం

(Ode)

(బాల్యపు స్మృతులలో శాశ్వతత్వపు జాడలు)

(Intimations of Immortality from recollections of Early Childhood)

నేటి బాలుడు రేపటి మనిషికి తండ్రి, కనుక
The child is father of the man
నా రోజులన్నీ సహజ భక్తి, విశ్వాసాలతో
ఒకదానికొకటి బంధింపబడి ఉండాలనేదే నా కోరిక.

అప్పుడొక కాలముండేది, మైదానం, వనం, సెలయేరు
నేల, మామూలు దృశ్యం ప్రతీది,
          నాకు కనిపించేది
          దివ్య కాంతిలో పరివేష్ఠితమై
స్వప్నపు తాజాదనం, కాంతులతో నిండి;
అదొకప్పుడున్నట్లు ఇప్పుడు లేదు–
          నేనెక్కడ తిరిగి చూసినా
          రాత్రైనా, పగలైనా
నేనొక్కప్పుడు చూసినవి, ఇప్పుడు కనబడడం లేదు.

హరివిల్లు వచ్చిపోతున్నది
అందాల గులాబీ విచ్చిపోతున్నది
చంద్రిక ఆనందంతో
తన చుట్టూ చూస్తున్నది, ఆకాశం ఆచ్ఛాదన లేకుండా ఉన్నపుడు;
తారలు ప్రకాశిస్తున్న రాత్రిలో
జలాలు అందంగా, నిర్మలంగా ఉన్నాయి.
ఎండ ఒక అద్భుతమైన పుట్టుక

అయినా, నాకు తెలుస్తున్నది, నేనెక్కడికి పోయినా
ఒకప్పటి గొప్పదనం ఈ నేలను విడిచి వెళ్లిపోయిందని.

ఇప్పుడూ, పక్షులు ఆనందగీతాల్ని ఆలపిస్తున్నాయి.
గొర్రెపిల్లలు గుమికూడుతున్నాయి–
–చిన్ని తంబుర, టాబర్–ఢక్క చప్పుడుకు;
నాకొక్కడికే వచ్చిందా ఈ దుఃఖపు ఆలోచనా ప్రవాహం,
తగు సమయపు అభిప్రాయం ఇచ్చింది కాస్త ఉపశమనం.
నేను మరల పుంజుకున్నాను ధైర్యం.
అట్టడుగు లోతులో కొండ ప్రవాహాల శబ్దం.
నా దుఃఖమిక ఋతువును తప్పుగా గణించదు.
నేను వింటున్నాను కొండల గుంపులోంచీ ప్రతిధ్వనులను
నిద్రా పొలాల్నుంచి వస్తున్నాయి గాలులు నావేపు.
ఉల్లాసంగా ఉన్నది భూమి,
నేల, మైదానం కూడా,
ఆనందోత్సాహాలలో మునిగినాయవి.
మే మాసపు ఆనందం
ప్రతి జీవి హృదయాన్ని నింపుతున్నది,
ఆనందపు పుత్రుడా,
నా చుట్టూ కేకలు వేయి, నన్ను నీ కేకలను విననివ్వు,
ఓ ఉల్లాసపు గొర్రెల కాపరి పిల్లవాడా!

ఓ దివ్య జీవులారా, మీ పిలుపును విన్నాను
ఒకరినొకరు మీరు పిలిచే పిలుపులను, నేను
చూస్తున్నాను స్వర్గపు చిరునవ్వును మీ ఆనందాన్ని చూసి,
నా హృదయమున్నది మీ వేడుకలో
నా శిరసుకున్నది కిరీటం, కాంతిలో.
మీ ఆనందపు సంపూర్ణతను, స్పృశిస్తున్నాను నేను

ఓహ్, దుష్ట దినమా! నాకు వ్యాకులమేల!
ఈ భువి ఆరాధిస్తున్నది
ఈ మధుర మే మాసపు ఉదయాన్ని;
చిన్నపిల్లలు ఎత్తుకోబడ్తున్నారు,
అన్నిపక్కలా;
దూర తీరాల్లోని వేలాది లోయలలో
తాజా పుష్పాలు, నీరెండ వెచ్చదనంలో;
పసిబాలుడు తన తల్లి చేతుల్లోకి దూకుతున్నాడు
నేను వింటున్నాను, వింటున్నాను ఆనందంతో,
–అయితే, అక్కడ ఓ వృక్షం, చాలావాటిలో, ఒకటి;
ఓ ఒంటరి పొలం నా చూపు ప్రసరించిన వేపులో;
ఆ రెండూ చెబుతున్నాయి ఏదో వెళ్లిపోయినవాటిని గురించి,
నా పాదాల వద్ద ఉన్న పాన్సీపూలమొక్క
అదే కథను మరల మరల చెబుతున్నది.
ఎక్కడికి పోయింది ఆ మిథ్యా క్షణిక దీప్తి?
ఎక్కడుందిప్పుడు, ఆ స్వప్నం, ఆ ఘనకీర్తి?
Whither is fled the visionary gleam?
Whre is it now, the glory and the dream?

మన జననం ఏమిటి? ఒక నిద్ర, ఒక మతిమరుపు
'Our Birth is but a sleep and a forgetting'
మన ఆత్మ మన జన్మనక్షత్రంలా పైకెగుస్తుంది.
ఎక్కడో నింగిలో దాని అమరిక.
ఏ సుదూరం నుంచో ఇటు వస్తుంది.
పూర్తి మరపులో కాదు
పూర్తి నగ్నత్వంలోనూ కాదు
కీర్తి మేఘాలపై తేలియాడుతూ, మనం వస్తాము

దేవుడి దగ్గర్నుంచీ, అతడే మన గృహము.
పసిప్రాయంలో స్వర్గం మన చుట్టూరా ఉంటుంది.
నెమ్మదిగా దగ్గరకు వస్తాయి కారాగారపు నీడలు,
        పెరుగుతున్న బాలుడిపై;
కాని, అతడు చూస్తాడు వెలుగును, అది ప్రవహించినప్పుడు
        అతడు దానిని తన ఆనందంలో చూస్తాడు
యువకుడిగా, ఇప్పుడతడు తూర్పుకు దూరంగా ప్రతిరోజూ
        ప్రయాణం చేయాలి, ప్రకృతి పూజారిగా, ఇంకా
        అద్భుతమైన దివ్యదర్శనం
        అతడికి లభ్యమవుతుంది దారిలో.
చివరకు మనిషి గమనిస్తాడు అది మాసిపోవడాన్ని.
అది మామూలు దినపు కాంతుల్లో కలిసిపోవడాన్ని.

భూమి నింపుతుంది తన ఒడిని తన స్వంత ఆనందాలతో
తన స్వతఃసిద్ధమైన వేదనలు తనకున్నాయి స్వంతంగా
మాతృ హృదయపు మనస్సుతో కూడా ఆమెకు
        విలువలేని లక్ష్యముండదు
        ఇంటిదాయిగా చేయవలసిందంతా చేస్తుంది.
తన పెంపుడు శిశువును, మనిషిగా తీర్చిదిద్దుతుంది.
        అతడికి తెలిసిన కీర్తి సంపదలను, మరచిపోతుంది,
        అతడు దిగివచ్చిన చక్రవర్తి సౌధాన్ని;
కొత్త ఆనందాల మధ్య కేరింతలు కొడ్తున్న శిశువును చూడు
పిగ్మీ-మరుగుజ్జులా ఆరేళ్ల ఆ పాలబుగ్గల పసివాడు
చేసిన పనుల మధ్య పరున్న అతడిని చూడు
తల్లి ముద్దూ మురిపాలతో మురిసిపోతున్నాడతగాడు.
తన తండ్రి కనుల నుంచి ప్రవహిస్తున్న వెలుగులో
చూడు, అతడి పాదాల వద్ద, ఏదో చిన్ని ప్రణాళిక
మానవ జీవితంపై అతడు గాంచిన స్వప్న శకలం,
స్వయంగా రూపుదిద్దినది, కొత్తగా నేర్చుకున్న కళాకృతి.

వివాహమైనా, వేడుకైనా
విలాపమైనా, కాటికైనా
అతడి హృదయం నిమగ్నమై ఉంటుంది
అంతవరకు అతడు తన పాటను ప్రకటిస్తాడు.
అప్పుడు, తన నాలుకను
వ్యాపారం, ప్రేమ, కష్టాల సంభాషణకు మళ్లిస్తాడు.
అయితే, అదెంతో కాలం ఉండబోదు
ఇక్కడ అది పక్కకు నెట్టబడుతుంది.
కొత్త ఆనందాలు, గర్వమూ, వీటితో
చిన్ని నటుడి నూతన పాత్రాభినయం,
తడవ తడవకూ తన చతురతను ప్రయోగిస్తూ,
అందరినీ, పక్షవాతపు వృద్ధులనూ;
జీవితం తన వాహనంలో తీసుకువచ్చిన వారిని
తన జీవన వ్యాసంగమంతా
ఒక అంతులేని అనుకరణగా అనిపించేట్లు,
నీవు, నీ బాహ్య పోలిక భ్రమింపచేస్తుంది
ఆత్మయొక్క విస్తారాన్ని,
నీ గొప్ప వేదాంతి, నీతో ఉండేవాడు,
నీ పిత్రార్జితము, అంధులలో నీ నేత్రము
అది, మూగగా మౌనంగా, శాశ్వత అగాధాన్ని చదువుతుంది
శాశ్వత మనస్సుతో ఎప్పటికీ వెంటాడబడుతుంది.
మహాప్రవక్తా! దివ్యమునీ!
మీలో సత్యాలు నిలిచి ఉన్నాయి.
మేం మా జీవితకాలమంతా కనుగొనడానికి కష్టపడినది
చీకటిలో పోగొట్టుకున్నాం, స్మశానపు చీకటిలో,
నీకు, ఎవరిపైనైతే నీ అమరత్వం
పగలులా అమరి ఉంటుందో, బానిసపై యజమానిలా,
తీసివేయలేని సామీప్య సమక్షమది.

నీవు, చిన్నిబాలుడా, గొప్పగా ప్రకాశిస్తున్నావు, స్వర్గము
నీకిచ్చిన స్వేచ్ఛాయుత జీవనంలో ఉన్నతంగా.
మరి ఎందుకు అత్యవసర నెప్పులతో నీవు
తప్పక వచ్చే నాగలి కాడిని ఇప్పుడెందుకు ప్రేరేపిస్తున్నావు?
కష్టాలపై నీకున్న గుడ్డి ప్రేమతో అలా చేస్తున్నావా?
అతి త్వరలోనే నీ ఆత్మ అనుభవిస్తుంది నేల కష్టాలను
ఆచారాలు మోపుతాయి నీపై అనంత భారాన్ని.
మంచు అంత బరువుగా, జీవితమంత లోతుగా దాదాపుగా!
Heavy as frost, and deep almost as life !

ఓ ఆనందమా! మన అంగారాల్లో
ఏదో ఇంకా జీవించే ఉన్నది,
ఆ స్వభావం గుర్తుంచుకుంటుంది
ఏమిటా పారిపోయినదని!

గత సంవత్సరాల జ్ఞాపకాల ఆలోచన నాలో
పొదుగుతుంది శాశ్వతమైన ఏకాగ్రతను, ధ్యానాన్ని.
ఏదో విలువైన, దివ్యమైన దాని గురించి కాదు.
ఆనందం, స్వేచ్ఛ, పసిప్రాయపు సహజ గుణాలు
తీరికగా ఉన్నా, విశ్రాంతి లేకున్నా,
కొత్తగా ఆవిర్భవించిన ఆశ అతడి రొమ్ములో కొట్టుకుంటుంది.
వీటికోసం కాదు, నేను పాడుతున్నది
కృతజ్ఞతల, పొగడ్తల గీతం;
ఆ మొండి ప్రశ్నల కొరకు
ఇంద్రియానుభూతులు, బాహ్య విషయాల గురించి,
మన నుండి పడిపోతున్న వాటి గురించి, అదృశ్యాల గురించి,
జీవియొక్క సందేహాలు, సంకోచాలు, అనుమానాల గురించి.

ఇంకా తెలుసుకోబడని ప్రపంచాల్లో తిరుగుతూ
మన మర్త్య స్వభావం, ఆశ్చర్యపడిన ధూర్త విషయంలా
ఉన్నతమైన సహజ గుణాల ముందు ఎలా వణికిపోతుందో
          ఆ తొలి ఆప్యాయతలు, ప్రేమలు,
          ఆ జ్ఞాపకాల వల్లరుల నీడలు, మినహా-
అవి, అవి ఏవైనా, ఎటువంటివైనా
అవి మనకు కాంతి దీపాలు మన రోజుల్లో,
మనం చూసిన వాటికవి ప్రధాన దీపాలు;
మనల్ని పైకెత్తి, పోషించి, నిర్మిస్తాయి
మన గొడవల ఏళ్లన్నీ శాశ్వత నిశ్శబ్దంలో
అల్ప క్షణాల్లా అనిపిస్తాయి, సత్యాలు
మేల్కొంటాయి, ఎప్పటికీ నశించవిక.

వాటిని జడత్వం కాని, ఉన్మతయాత్రలు కాని
          మనిషి కాని, బాలుడు కాని
సంతోషానికి వ్యతిరేకమైనదేదైనా కానీ
దానిని పూర్తిగా రద్దు చేయలేవు, నశింపజేయలేవు.
          ప్రశాంత వాతావరణపు ఋతువులో
          మనమెంత దూరంలో ఉన్నా సరే,
మన ఆత్మలకు ఆ శాశ్వత సముద్రం కనిపిస్తుంది,
          మనలను ఇక్కడకు తెచ్చినదది,
          ఒక్కక్షణంలో ఎంత దూరమైనా పోగలిగినది.
పిల్లలు తీరంలో ఆడుకోవడాన్ని చూస్తుంది
మరింత ఉధృతమైన మహోన్నత జలాల హోరును వింటుంది.

అప్పుడు, పక్షులారా, పాడండి, పాడండి, పాడండి ఆనంద గీతాన్ని.
          గొర్రెపిల్లలను గంతులేయనివ్వండి,
          చిన్ని తంబూర, టాబర్-ఢక్క చప్పుడుకు.

మేము ఆలోచనలతో కలుస్తాము మీ గుంపులో
వేణువు ఊదండి, ఆటలు ఆడండి
హృదయాల నిండుగా ఆడి పాడండి.
మే మాసపు ఆనందాన్ని స్పృశించండి.
ఒకప్పటి గొప్ప ప్రకాశవంతమైన వెలుగు
నా దృష్టి నుంచి శాశ్వతంగా తీసివేయబడినది.

ఆ గడచిన ఘడియలను ఇంకేదీ తీసుకురాలేదు
పచ్చికలోని వైభవం, పూలలోని ప్రకాశం
మనం దుఃఖించబోము, కాని కనుగొంటాము–
మిగిలిన వాటిలో ఉన్న శక్తి సామర్థ్యాలను
ప్రాథమిక సానుభూతిలో
ఎప్పుడూ నిలిచి ఉండే దానిలో
ఉపశమనం కలిగించే ఆలోచనలు
మానవుల కష్టాల నుంచి ఉబికిన వాటిలో
మృత్యువు గుండా చూసే విశ్వాసంలో
వేదాంతపు మనసును తెచ్చే రేపటి సంవత్సరాలలో–

మరి, ఓ నీటి ఊటలు, మైదానాలు, కొండలు, వనాల్లారా!
మీ ప్రేమలను ఎవరైనా తెంచడాన్ని నిషేధించండి.
నా హృదయాంతరాళాల్లో మీ మహోన్నత శక్తిని స్పర్శిస్తున్నాను.
నేనొకే ఆనందాన్ని త్యజించినాను.
మీ సహజమైన ప్రదేశాల్లో ఉండే అదృష్టాన్ని,
గలగల పారే సెలయేటి ప్రవాహాల ఉద్రేకాన్ని,
వాటిలా నేను తేలికగా జారిపడినప్పుడు మరింతగానూ;
నూతన ఉదయపు స్వచ్ఛమైన వెలుగు
అదింకా అందంగానే ఉన్నది,
అస్తమయ సూర్యుడి చుట్టూ గుమికూడిన మేఘమాలికలవిగో!

మానవుని మృత్యువుపై కాపలా ఉంచిన నేత్రం నుంచి
తీసుకున్న గంభీరమైన వర్ణచిత్రపు సొబగులవిగో!
ఇప్పుడు మరో పరుగుపందెం, అనేక బహుమతులు గెలుచుకోవడం,
మనం జీవించే మానవ హృదయానికి కృతజ్ఞతలతో,
దాని కోమలత్వానికి, ఆనందాలు, భయాలకు కృతజ్ఞతలతో,
అప్పుడు విరిసిన అత్యల్ప పుష్పమైనా నాకు ఇవ్వగలుగుతుంది
కన్నీటికి అందకుండా లోతుగా దాగి ఉండే ఆలోచనలను.

To me the meanest flower that blows can give
Thoughts that do often lie too deep for tears

✧✧✧✧✧

Ode: Intimations of immortality (శాశ్వతత్వపు జాడలు) : ఈ గీతాన్ని విమర్శకులు రెండు భాగాలుగా విడదీసి చూసినారు. మొదటి భాగంలో నాలుగు పద్యాలు – దృశ్య చిత్రణ, దాని చివర్లో ఒక ప్రశ్న ఉంటాయి; రెండవ భాగంలో ఏడు పద్యాలు– తొలిభాగం నిరాశను, రెండవభాగం ఆశను ప్రకటిస్తూ ప్రశ్నకు సమాధానమిస్తాయి. రెండు భాగాలకు మధ్య రెండు సంవత్సరాల కాలవ్యవధి ఉందని ప్రొఫెసర్ డి. సెలెన్‌కోర్ట్ అభిప్రాయం. ఇంతకీ ప్రశ్న ఏమిటి?

Whither is fled the visionary gleam?
Where is it now, the glory and the dream?
ఎక్కడికి పోయిందా మిధ్యాక్షణికదీప్తి?
ఎక్కడుందిప్పుడు, ఆ స్వప్నం, ఆ ఘనకీర్తి?
ఆ ఆనందక్షణాలు, బాల్యావస్థ క్షణికమేనా?

ఈ మొదటి భాగం వ్రాస్తున్నపుడు వర్డ్స్‌వర్త్ వయసు 32 సంవత్సరాలు. కొంతమంది విమర్శకులు ఈ 'Ode' వ్రాస్తున్నప్పటికి అతడిలో కవిత్వపు పస తగ్గిందంటారు. (The 'Ode' is Wordsworth's conscious farewell to his art, a dirge sung over his departing powers. - Dean Sperry) నాకామాట నమ్మబుద్ధికాదు. ఎనభై ఏళ్లు జీవించిన అతడికి అప్పుడే వృద్ధాప్యమా కవిత్వంలోనైనా?

A timely utterance gave that thought relief And I again am strong.

వర్డ్స్‌వర్త్ దృష్టిలో Fancy - ఊహ అనేది చపలులైన యువకులకు ప్రత్యేకించబడినది.

మరి ఈ స్వప్నాలన్నీ భ్రాంతులేనా?

27 మార్చి 1802లో మొదలుపెట్టి వ్రాసిన మొదటి భాగాన్ని కాలరిడ్జికి ఇస్తే ఏప్రిల్‌లో కాలరిడ్జి Dejection-an ode వ్రాసాడంటారు. రెండేళ్ల తరువాత వర్డ్స్‌వర్త్ తన కవితను పూర్తిచేయగా (1804) 'Ode' పేరున 1807లో ప్రచురింపబడింది.

Irregular pindaric ode గా భావించబడిన ఈ కవితలో మొదటి నాలుగు పద్యాలు– మృత్యువును, యవ్వనాన్ని, అమాయకత్వాన్ని కోల్పోవడాన్ని సూచించగా, తరువాతి నాలుగు పద్యాలు (Stanzas) మానవుడు కోల్పోయిన దివ్యకాంతిని, ఆఖరి మూడు పద్యాలు ఆశను సూచిస్తాయి.

ఈ కవిత Pre existence సిద్ధాంతాన్ని, శరీరంకన్నా ఆత్మ ఉనికి ముందే ఉన్నదని, బాల్యంలోని అమాయకత్వం దానిని దర్శించగలదని చెబుతుంది.

కాలరిడ్జి రూపొందించిన Conversation Poems – సంభాషణా కవితల్లా– ఈ కవిత కూడ ప్రశ్నను లేవనెత్తుతుంది. జవాబు వస్తుందని ఆశించినా అది రాకపోవడం– దీనిని a type of proso popoeia - అని పిలుస్తారు.

ఈ కవితలానే Tintern Abbey కవిత కూడా Conversational Poem గా అభివర్ణించబడింది.

వర్డ్స్‌వర్త్ వ్రాసిన–

'Our Birth is but a sleep and a forgetting'

'The child is father of the man'

'Heavy as frost and deep almost as life'

'Thoughts that do die often too deep for tears'

అనే కవితా వాక్యాలు ఎప్పటికీ శాశ్వతాలే!

✣✣✣✣✣

2. మేఘంలా నేను ఒంటరిగా తిరిగాను

(I Wandered lonely as a cloud)

నేను ఒంటరిగా దేశదిమ్మరిలా తిరిగాను
కొండలపై, లోయలపైన తేలియాడే మేఘంలా.
అకస్మాత్తుగా చూసానప్పుడు నేనొక పుష్ప సముదాయాన్ని
బంగరు పసుపు రంగు 'డఫాడిల్' పుష్ప సంచయాన్ని;
సరస్సు పక్కనే, చెట్ల కింద
మలయమారుతంలో రెపరెపలాడుతూ నాట్యం చేస్తున్నవాటిని.

ఎడతెగని తారలు తళతళ మెరుస్తూ
పాలపుంతలో ప్రకాశిస్తున్న విధంగా,
అవి అనంత దూరం వ్యాపించి ఉన్నాయి తోరణంలా
అఖాతపు అంచు పొడుగునా;
ఒక్క చూపులోనే చూసాను పదివేల పుష్పాల్ని
ఉల్లాసపు నృత్యంలో తలలూపుతున్న వాటిని.

ఆ పూల పక్కనే నర్తిస్తున్నాయి నీటి అలలు
ఆ నీటి తరంగాల తళుకులను తరిమికొట్టాయి ఈ పూల కాంతులు.
అది చూసి ఆనందించకుండా కవి ఉండలేడు.
అటువంటి వేడుక గుంపులో ఉండి,
నేను చూసాను, రెప్పవేయకుండా చూసాను, ఏ ఆలోచనా లేకుండా;
ఆ ప్రదర్శన నాకెంతటి భాగ్యాన్నో ప్రసాదించినది కదా!

తరచుగా, నేను నా మంచం మీద పడుకుని
శూన్య స్థితిలోనో, వ్యాకులమైన మనస్సుతోనో ఉన్నపుడు
నా అంతర్నేత్రంలో తళుక్కున మెరుస్తాయా పసిడిపూలు.
అవి ఏకాంతపు ఆనంద నిధులు.
అప్పుడు నా హృదయం సంతోషంతో నిండిపోతుంది.
స్వర్ణవర్ణ డఫొడిల్స్ పుష్పాలతో కలిసి చక్కగా నృత్యం చేస్తుంది.

✧✧✧✧✧

Daffodils గా ప్రసిద్ధికెక్కిన ఈ కవిత పేరు చెప్పగానే వర్డ్స్‌వర్త్‌ను, వర్డ్స్‌వర్త్ అనగానే Daffodils ను గుర్తుకుతెచ్చే అద్భుత కవిత ఇది. ఇలా ఎవరూ వ్రాయలేరు అనేంత గొప్ప ప్రకృతి కవిత ఇది.

15 ఏప్రిల్ 1802 నాడు వర్డ్స్‌వర్త్ తన సోదరి డొరతి (Dorothy) కలిసి చూసిన ఈ దృశ్యాన్ని 1804లో కవితగా రూపొందించినాడు. 1995లో BBC Radio 4 Bookworms జరిపిన పోటీలో అందరికీ నచ్చిన కవితలలో అయిదవ స్థానాన్ని దక్కించుకున్నది. అనేక సంకలనాలలో చోటుచేసుకున్న ఈ కవిత ఇంగ్లీషు భావవాద కవితలలో Classic గా పేరు తెచ్చుకున్నది.

Narcissus pseudo Narcissus అనే శాస్త్రీయ నామం గల పసుపుపచ్చని Daffodil పూలు Lake district లో తరచుగా కానవస్తాయి.

3. టిన్‌టరన్ అబ్బెకు కొద్దిమైళ్ల ఎత్తులో వ్రాసిన వాక్యాలు

(Lines composed a few miles above Tintern Abbey)

(ఒక యాత్రలో 'వై' నదీ తీరాల్ని మరల సందర్శించినపుడు)

(On revisiting the banks of the Wye during a tour)

అయిదేళ్లు గడిచాయి, అయిదు వేసవులు, అయిదు
దీర్ఘ శిశిరాలు! మరల నేను వింటున్నాను.
పర్వతపు నీటి ఊటల్నుంచి జాలువారుతున్న జలపాత శబ్దాల్ని
సుతిమెత్తని మైదానంపై గుసగుసలు పోతున్నవాటిని- మరొక్కసారి
నేను ఈ నిట్టనిలువుగా ఉన్న ఉన్నత శిఖరాల్ని చూస్తున్నపుడు
ఒంటరి అదుపులేని దృశ్యం అలరిస్తుంది నన్ను;
మరింత లోతైన ఏకాంతపు ఆలోచనలు, కలుపుతాయి,
ఆకాశపు ప్రశాంతతతో ఈ నేలపైన దృశ్యాల్ని.

నేను విశ్రాంతి తీసుకుంటున్నపుడు, ఆరోజు మరల ప్రత్యక్షమైనది
చీకటి సైకామోర్ చెట్ల కింద, ఇక్కడ, చూస్తున్నాను.
కుటీరపు నేలలున్న స్థలాలను, పండ్ల తోటల శిఖలను
ఈ ఋతువులో, ఇంకా పక్వానికి రాని కాయలతో
ఆకుపచ్చని వన్నెతో కప్పబడి, తమని తాము కోల్పోతాయి.
వనాలలో, పటాలాలలో; మరొక్కసారి నేను చూసాను
కంచెల వరుసలు, కంచెలలా ఉండనివి, చిన్నిచిన్ని గీతల్లా
ఆటలాడుతూ అడవులు అటూయిటూ పరిగెత్తుతున్నట్లు,
ఈ పచ్చికమైదానాలు, ఇంటి తలుపు వరకూ విస్తరించి,

పూలగుత్తుల్లా పొగను పైకి పంపుతూ, మౌనంగా, చెట్ల మధ్యన,
కొంత నిశ్చయం కాని సమాచారం, ఇళ్లులేని అడవుల్లో
తిరిగే దేశదిమ్మరుల్లా, లేక, ఏదో ముని గుహలో,
నెగడు పక్కన ఒంటరిగా కూర్చున్న సాధువులా,
ఈ అందమైన రూపాలు,
చానాళ్లు కనిపించక,
గుడ్డివాడి కంటికి కనిపించే దృశ్యంలా కాక, తరచుగా,
ఒంటరి గదుల్లో, పట్టణాల, నగరాల రణగొణ ధ్వనుల మధ్య
కనిపిస్తాయి. నేను వాటికి ఋణపడి ఉన్నాను.
అలిసిన ఘడియలలో ఇవి ఇచ్చే మధురమైన అనుభూతులకు,
అవి నా రక్తంలో స్పృశించబడి, హృదయంలో తాకబడి
నా స్వచ్ఛమైన మనసులోకి ప్రవహిస్తాయి,
ప్రశాంతతను మళ్లీ స్థాపిస్తాయి, గుర్తుకురాని సంతోషాల
అనుభూతుల్ని కూడా! అటువంటివి బహుశా,
కొద్దిగానైనా, లేశమాత్రమైనా చూపించకపోవచ్చు,
మంచివాడి జీవితంలోని ఎక్కువ భాగంపై ప్రభావాన్ని.

గుర్తుండవు అతడి స్వల్పమైన, నామరహిత,
దయాపూరితమైన, ప్రేమకార్యాలు. అయినప్పటికీ
నేను నమ్ముతాను, వాటికి కూడా నేనో కానుక బాకీ ఉన్నాను.
ఘనమైన రూపం గలదానిని; దివ్యమైన
మానసిక భావాలలో రహస్యపు భారాన్ని, అర్థం కాని ప్రపంచపు
అలసట తెచ్చే బరువుల్ని–తగ్గిస్తాయవి.
ఆ ప్రశాంతమైన దివ్యమైన మానసిక భావంతో
ఆప్యాయతలు మనల్ని సున్నితంగా ముందుకు తీసుకువెళ్తాయి,
ఈ దేహంలోని ఊపిరి,

మానవ రక్తపు ప్రవాహ కదలిక
దాదాపు స్తంభించేంతవరకూ, మనం నిద్రపోతుంటాము
శరీరంలో, అలా, బతికి ఉన్న ఆత్మలమౌతాము.
సమతుల్యతతో నిండిన శక్తి ఒక కంటిని ఉంచుతుంది.
నిశ్శబ్దంగా, ఆనందపు లోతైన శక్తిని
చూస్తాం మనం పదార్థాల జీవశక్తిలో, జీవితంలో!
ఇది గనుక ఒక వృధా నమ్మకమైతే, సరే, ఓహ్!
ఎంత తరచుగా చీకటిలో, అనేక రూపాల మధ్య
ఆనందంలేని పగటి కాంతిలో, ఆగ్రహపు కలతలో,
ఏ లాభమూలేని ఈ ప్రపంచపు జ్వరపు పోకడ
నా హృదయస్పందనపై చూపుతుంది ప్రభావం.
ఎంత తరచుగా, ఉత్సాహపు ఊపిరితో తిరిగాను నీవేపు.
ఓ సిల్విన్ వైయీనదీ! నీవు ప్రవహిస్తావు అడవులలో
ఎంత తరచుగా నా ఆత్మ నీవేపు తిరిగింది!

మరి ఇప్పుడు, సగం ఆర్పబడిన ఆలోచనల మెరుపులతో
మసకగా, పలుచగా ఉండే గుర్తింపులతో
ఒకరకపు విచారపు చిక్కులతో
మనోచిత్రం మరల పోసుకుంటుంది ప్రాణం.
ఇక్కడ నేను నిలబడి, ఇప్పటి ఆనందపు అనుభూతితోనే గాక
సంతోషాన్నొసగే ఆలోచనలతో, ఈ క్షణంలోనే
భవిష్యత్ దినాల జీవితమూ ఆహారమూ నిబిడి ఉందని గ్రహించాను.
అందుచేత, నేను ధైర్యంగా ఆశిస్తున్నాను.
మారినా, సందేహం లేదు, నేనెలా ఉన్నానో అప్పుడు
ఈ కొండల మధ్యకు వచ్చినప్పుడు, ఓ ఆడజింకలా,
పర్వతాల మధ్య బంధింపబడి, లోతైన నదులు

హద్దులు కాగా, ఒంటరి సెలయేర్లు ప్రకృతి
ఎటుపోనిస్తే అటు పోయినట్లు – ఒక మనిషి
ఏదో భయపెడుతున్న దానినుంచీ ఎగిరిపోతున్నట్లు,
తాను ప్రేమించిన దానిని వెదికి చూడడం కన్నా తొందరగా–
ప్రకృతి అప్పుడు (నా బాల్యపు ముతక ఆనందాలు
సంతోషపు జంతు సహజ కదలికలు నిష్క్రమించగా)
నాకు అన్నీటిలో అన్నీ ఉండగా, నన్ను నేను చిత్రించలేను
నేనప్పుడు ఎలా ఉన్నానో. లోయలోని నీటి ప్రవాహపు
ధ్వనులు ఒక తీవ్ర ఉద్వేగంలా నన్ను వెంటాడుతున్నాయి.
ఆ ఎత్తైన కొండరాయి, ఆ పర్వతం, ఆ చక్కటి విషాదపు అరణ్యం
వాటి రంగులు, రూపాలు, అవే నాకు ఆకలి అప్పుడు,
ఒక అనుభూతి, ఒక ప్రేమ, ఏ దూరపు ఆకర్షణా అక్కరలేనివి.
ఆలోచనలిచ్చిన అందాలు, కనుల నుండి అప్పు తెచ్చుకోని ఇష్టాలు
–కాలం గడిచింది. బాధ కలిగించే ఆనందాలిప్పుడు లేవు.
కళ్లు తిరిగే పారవశ్యత లేదు. దుర్బలుడైన నాకు,
సంతాపాలు లేవు, గుసగుసలు లేవు; అటువంటివే కానుకలు.
అంత తక్కువ నష్టానికి చాలా ఎక్కువ పరిహారం.
నేను నేర్చుకున్నాను ప్రకృతిని చూడడం, ప్రేమించడం
ఆలోచనలు లేని యవ్వనంలోలా కాక, తరచుగా వినడం
మానవత్వపు నిస్తబ్ద విషాద సంగీతాన్ని.
మొరటుగా, పరపరలాడేది కాదు, దానికి
దండించి, లొంగదీసుకునేందుకు సరిపడిన శక్తి ఉన్నా!

నేను అనుభూతి చెందుతున్నాను
ఉన్నతీకరణ చెందిన ఆలోచనల సన్నిహితత్వమిచ్చే
ఆనందం నన్ను కలవరపరచడాన్ని.

ఏదో ఘనమైన భావం నాలోలోపల్లోకి ప్రవహించడాన్ని
దేని నివాసగృహం అస్తమయ సూర్యకాంతుల స్థానమో
వలయాకార సముద్రమో, జీవమున్న వాయు ప్రవాహమో,
నీలాకాశమో, ఆ మానవ మనస్సుల్లోకి
ఒక కదలిక, ఒక ప్రాణం, ఏదైతే ప్రేరేపిస్తుందో
అన్ని ఆలోచించే విషయాలను, ఆలోచనల లక్ష్యాలను,
ప్రవహిస్తుంది వాటన్నిటిలోకి. అందుచేత
నేనిప్పటికీ ప్రేమికుడినే, మైదానాలకు, అరణ్యాలకూ,
పర్వతాలకూ, ఈ ఆకుపచ్చని నేలపై కనిపించే ప్రతిదానికీ!
కనులు, చెవులు, స్పందించే గొప్ప ప్రపంచానికి,
సగం ఆ రెండూ సృష్టిస్తాయి, సగం తెలుసుకుంటాయి
గుర్తించినందుకు సంతోషిస్తాయి. ప్రకృతిలోనూ
ఇంద్రియ భాషలోనూ, నా స్వచ్ఛమైన ఆలోచనల లంగరు
నా దాయి, నా మార్గదర్శకుడు, నా హృదయ సంరక్షకుడు,
నా ఆత్మ, నా నైతిక ప్రవర్తనా నిర్దేశకుడు, అన్నీ అవే!

బహుశాః అలా నేర్పి ఉండకపోతే నాకు,
నా సరసమైన ప్రాణాలు శిథిలమవడాన్ని, బాధపడేవాడిని కాదా!
నీవు నాతో ఈ నది ఒడ్డుపైన
ఈ చక్కని నది దగ్గర, నా ప్రియమైన స్నేహితురాలా!
నా, నా ప్రియమైన స్నేహితురాలా, నీ గొంతులో నేను
నేను పట్టుకుంటున్నాను నా వెనకటి హృదయ భాషను.
నా గతకాలపు ఆనందాన్ని, నీ విశృంఖల నేత్రాల
విసిరే కాంతుల్లో చదువుకుంటున్నాను. ఓహ్! అయినా
నన్ను కాసేపు చూడనీ, నేనిదివరకు ఎలా ఉండేవాడినో!
నా ప్రియమైన ప్రియాతి ప్రియమైన సోదరీ! ఈ ప్రార్థన మన్నించు.

ప్రకృతి తనను ప్రేమించిన హృదయాన్ని ఎన్నటికీ ప్రేమించదని,
అది ఆమె ధర్మము, అధికారం; మన జీవితకాలంలో
మనల్ని ఆనందం నుంచి ఆనందానికి నడిపిస్తుంది.
మనలోని మనసుకు ఎరుక చేస్తుంది.
ప్రశాంతతో, అందంతో మెప్పిస్తుంది.
ఉన్నతమైన ఆలోచనలనిచ్చి పోషిస్తుంది.
దుష్ట నాలుకలను, తొందరపాటు నిర్ణయాలను
స్వార్థపరుల ఎగతాళిని, కరుణలేని అభినందనల్ని
దైనందిన జీవితంలోని భయపెట్టే సహవాసపు సంఘటనల్ని
మనకు వ్యతిరేకంగా నిలబడినవాటిని తొలగిస్తుంది.
మన చిరునవ్వుల విశ్వాసాన్ని, ఆశీస్సులతో మనం చూసేవాటిని
ఆటంకపరచనీయదు. అందుచేత, చంద్రుడు
నీ ఒంటరి నడకపై వెన్నెల కాంతులను ప్రసరించును గాక!
పర్వతాల పొగమంచు గాలులు స్వేచ్ఛగా నిన్ను తాకునుగాక!
తరువాత సంవత్సరాలలో, ఈ విశృంఖల పరవశతలు
ఒక గంభీరమైన ఆనందం కాగా, నీ మనసు
అన్ని ఆనంద రూపాలకూ నివాస భవనమగును గాక!
నీ జ్ఞాపకాలు అన్ని శ్రావ్యమైన ధ్వనులకు, సంగీతాలకు
నిలయమగును గాక! ఓహ్, అప్పుడు, ఏకాంతం
లేదా భయం, లేదా ఆనందం, లేదా బాధ, లేదా విచారం
నీలో భాగమైనపుడు, మృదువైన ఆనందాలు
నయం చేసే ఆలోచనలు కాగా నీవు నన్ను గుర్తు తెచ్చుకుంటావు

ఇవినా బోధనలు! లేక, బహుశా–
నేను గనుక నీ స్వరం వినలేని చోటున ఉంటే,
గత ఉనికిని దాచుకున్న నీ విశృంఖల నేత్రాల మెరుపు కాంతుల్ని

అందుకునే స్థితిలో లేకుంటే,– నీవు మరచిపోతావు
ఈ అందమైన స్థితిలో లేకుంటే, – నీవు మరచిపోతావు
ఈ అందమైన సెలయేటి ఒడ్డున
మనమిద్దరం కలిసి నిలబడ్డామని! నేను
దీర్ఘకాలంగా ప్రకృతి ప్రేమికుడిని, అదే పని మీద
అలసిపోకుండా వచ్చానని, మరల చెప్పాలంటే,
వెచ్చటి ప్రేమతో, ఓహ్! నేను వచ్చానని,
పవిత్ర ప్రేమకు చెందిన మరింత లోతైన ఉత్సాహంతో
నీవు మరచిపోలేవు, ఆ తరువాత ఎన్నో దేశాలు తిరిగి
ఎన్నో ఏళ్లు, ఎన్నో ఏళ్లు ఇక్కడ లేకపోయినా
ఈ చిక్కటి అడవులు, ఈ ఉన్నతమైన శిఖరాలు
ఈ ఆకుపచ్చని వనాల దృశ్యాలు, నాకు కావాలి
ప్రియతమా, వాటి కోసమూ, నీ కోసమూ!

✧✧✧✧✧

---

13 జులై 1798లో వర్డ్స్‌వర్త్ వ్రాసిన ఈ కవిత పేరు 'టిన్‌టర్న్ అబ్బె'గా సంక్షిప్తీకరించ బడిన దీనిలో భవనం గురించిన వర్ణన లేదు. వర్డ్స్‌వర్త్ ఆగష్టు 1793లో తన సోదరి డొరతి (Dorothy) తో కలిసి తనకు ఇరవై మూడేళ్ల వయసున్నపుడు ఈ ప్రాంతాన్ని సందర్శించినాడు. తరువాత అతడికి కాలరిడ్జితో పరిచయం ఏర్పడింది. కొంత మానసిక స్థిరత్వమూ లభించింది.

ఈ కవిత కొంత కవిత్వంలా, కొంత గీతంలా, కొంత నాటకీయ సంభాషణ – Dramatic monologue లా ఉంటుంది. మొదట్లో దీనిని Landscape కవితగా భావించినా ఇప్పుడు దీనిని Conversation - సంభాషణ–Poem లో చేర్చినారు. ఈ కవితను నిశ్శబ్దంగా వింటున్నది కవి సోదరి Dorothy.

1–49 పంక్తులు –దృశ్యాన్ని, 49–111 పంక్తులు –దృశ్యపు ప్రభావాన్ని, 111–159 పంక్తులు ప్రకృతితో, సోదరితో తన అనుబంధాన్ని వివరిస్తాయి. ఈ కవిత మానవునికి, నేలకు ఉన్న, ఉండాల్సిన సంబంధాల్ని వివరిస్తుంది. మానవత్వం పరిఢవిల్లాల్సిన ఆవశ్యకతను ప్రబోధిస్తుంది.

4. కాయల్ని కొట్టుకు రావడం

(Nutting)

అది ఒక ప్రత్యేకమైన రోజు
స్వర్ణాక్షరాలతో లిఖించదగిందీ, స్వర్గాన్నించి దిగి వచ్చినదీ
బాల్య సహజపు ఆశల రెక్కలు విచ్చుకోగా
నేను మా ఇంటి గుమ్మం వదలి అటే నడిచాను.

భుజాన పెద్ద సంచి
చేతిలో కాయలు రాల్చడానికి కొంకి కర్ర
అదుగో, దూరంగా కనిపిస్తున్న అడవి
ఆ సుందర రూపాన్ని మాయచేయడానికా అన్నట్లు
పొదుపైన దుస్తులు, పనికి తగ్గట్టుగా.

కాస్త జాగ్రత్త...
ముళ్ల పొదల్ని, ఎండిన మోడులను,
పల్లేరు కాయల్ని చూసి చిరునవ్వు నవ్వేందుకు
రక్షణగా...

నిజం చెప్పాలంటే-
అవసరం కన్నా అధికమైన మొరటుగా...

దారి కానరాని బండరాళ్ల మీదుగా
నాచు పట్టిన గులకరాళ్లపై నడుస్తూ
కాళ్లకడ్డం పడ్తున్న పిచ్చి తీగెల్ని వదిలించుకుంటూ
నానా యాతనా పడి ఆ మూలకు చేరుకున్నాను.

ఇంతవరకూ ఎవరూ వెళ్లని ఆ చోటున
ఒక్క విరిగిన కొమ్మాలేదు.
వాడిన ఆకులతో తలవంచి చూస్తున్నట్లు
దయలేని దారుణ దృశ్యమది!
హాజెల్ చెట్లు నిటారుగా, ఠీవిగా నిలబడి ఉన్నట్లు
కాయలు గుత్తులు గుత్తులుగా
నిగనిగలాడుతూ... ఆకర్షిస్తూ...
ఎవరూ తాకని అనూహ్య దృశ్య వేదిక.
గుండెను నొక్కిపట్టుకుని, భారంగా ఊపిరి పీలుస్తూ
కాసేపు అలానే నిలబడ్డాను.
ఆనందం వరదలా ఉప్పొంగుతోంది.
కాస్త తమాయించుకుని, సమ్మోహనంగా–
పోటీ దారులెవ్వరూ లేరు కదా!
విందు భోజనాన్ని కళ్లారా వీక్షించాను
చెట్ల క్రింద విశ్రాంతిగా కూర్చుని
వికసించిన పూల మధ్య
విజయోత్సాహంతో
ఆడుకున్నాను అందాల పుష్పాలతో–
ఆ ఆనందం ఎటువంటిదంటే
ఎన్నాళ్లుగానో వేచి తపించిన భాగ్యం
చేతికందినంత సంతోషం.
దొరక్క దొరక్క దొరికిన పెన్నిధి
నిరాశ పేరుకున్నాక చేతికందిన నిధి.
బహుశా అదొక పొదరిల్లు.
దాని ఆకుల దిగువన అయిదు ఋతువుల
వయొలెట్ – ఊదా పుష్పాలు

ప్రత్యక్షమై అదృశ్యమౌతుంటాయి,
ఏ మానవుడి కంటా పడకుండానే!
అక్కడే దివ్యలోకపు జలాలు గలగలలాడ్తాయి.
నా కళ్లముందు మెరుస్తున్న నీటి నురగ...
నేను నా చెక్కిలిని ఆ ఆకుపచ్చ
శిలలపై ఉంచి, మెత్తటి పట్టులాంటి నాచుపై,
–చిక్కటి చెట్లనీడలు గొర్రెలమందలా నా చుట్టూరా–
నేను విన్నాను మంద్రమైన గుసగుసల్ని...
గుసగుసల సంగీతాన్ని...
అటువంటి మధురక్షణాలలో
బాధారహిత సమయానికి
ఆనందం చెల్లించే సుంకంలా
ఆ హాయి నా స్వంతం... కదా!
హృదయమిప్పుడు నిరాసక్త విషయాలతో
రాళ్లతో, చెట్ల చిగుళ్లతో
ఖాళీ వాయు వీచికలతో దోబూచులాడ్తున్నది.
సంతోషం మనసు పాత్రను నింపి
పొంగి పొర్లగా నేను లేచి నిలబడ్డాను.
కొంకికర్రతో కొమ్మలను వంచి ఏమాత్రం
దయాదాక్షిణ్యాలు లేకుండా
కాయల గుత్తుల్ని విరగలాగాను...
అంతటా విధ్వంసమే!
పొదరిల్లు, ఆకుపచ్చని నాచుకమ్మిన రాళ్లు
హాజెల్స్ కాయల భారంతో వంగి
గాయపడి, తమ ప్రశాంతతను
నెమ్మదిగా కోల్పోయాయి.

నేనిప్పుడు ప్రస్తుత భావాల్ని
నా పాత జీవితంలోకి తెచ్చుకో సాహసిస్తే-

ధ్వంసం కాబడిన పొదరింటి గూడు ఈనాడు
మహా చక్రవర్తుల ఖజానా కన్నా గొప్పదైన
సంపదలతో నిండి ఉన్నది...
నిశ్శబ్దంగా నిలబడిన చెట్లను చూసినపుడు
నాలో ఏదో బాధ కలిగి, నేను
మా మధ్య తలదూర్చిన ఆకాశం వేపు చూసాను.

అప్పుడు, ఓ నెచ్చెలీ, ఈ నీడల వెంబడే నడువు సుమా!
హృదయపు మృదు స్పందనతో,
అతి మృదువైన కరస్పర్శతో...
ఎందుకంటే, ఈ అడవులందు దివ్యాత్మ సంచరించుచున్నది.

✧✧✧✧✧

Nutting (కాయలు లేదా గింజలు ఏరుకోవడం) : జర్మనీలో (1798–99) ఉన్నపుడు విలియం వర్డ్స్‌వర్త్ – The 'Lucy' Poems, The Prelude వ్రాసినప్పుడు వ్రాసినదీ కవిత. ప్రాచీన శాండీ కుటుంబానికి చెందిన Earthwaite Lake నుంచి Graythwaite వరకు ఉన్న అడవులలో తాను తిరుగాడినప్పటి బాల్య అనుభవాలను విలియం వర్డ్స్‌వర్త్ ఎంతో అద్భుతంగా వర్ణించినాడు. (చిన్నప్పుడు రేగుపళ్లు, సీమచింతకాయలు, బాదంకాయల కోసం అడవుల్లోకి పోయి మనం పొందిన అనుభూతులు ఇంచుమించు ఇలాగే ఉండేవి కదూ)

5. ల్యూసీ కవితలు

(Lucy Poems)

వింత ఉద్వేగపు ఉద్విగ్నతలు నాకు తెలియును
ప్రేమికుల వీనులకు మాత్రమే అవి ప్రత్యేకం!

అవి నాపై ఎలా విరుచుకుపడ్డాయో
వాటిని ధైర్యంగా వివరిస్తాను.
జూన్ నెలలోని గులాబి పుష్పంలా
నా ప్రేమికురాలు స్వచ్ఛంగా, తాజాగా ఉండేది.
సాయంకాలపు చంద్రుడి నీడలో
నేనామె ఇంటివేపు నడక మరలించేవాడిని.

నా దృష్టంతా ఆ ఆకాశదీపం వేపే
విశాలమైన మైదానంలో విస్తరిస్తున్న వెన్నెల కాంతి
నాకెంతో ఇష్టమైన ఆ దారుల గుండా
నా గుర్రం వడివడిగా పరుగులు తీస్తున్నది.

ఇప్పుడు మేము ఫలపుష్ప వనాన్ని చేరుకున్నాము.
కొండ ఎక్కుతున్న కొద్దీ
ల్యూసీ ఇల్లు, అస్తమిస్తున్న చంద్రుడు
దగ్గరగా, ఇంకా దగ్గరగా కానవస్తున్నాయి.

అటువంటి మధుర స్వప్నాలలో నేను నిదురించాను.
ప్రకృతి దయతో ప్రసాదించిన గొప్ప వరమది.
అంతసేపూ నా నయనాలు
అస్తమిస్తున్న చంద్రుడిని అంటిపెట్టుకునే ఉన్నాయి.

నా అశ్వమలా పోతూనే ఉన్నది... గిట్టల చప్పుడుతో...
తలపైకెత్తింది కాని, ఆగకుండా పరిగెత్తుతున్నది.
ఆమె గృహపు పైకప్పు వెనక
అకస్మాత్తుగా, అందాల చంద్రుడు అదృశ్యమైనాడు.

ప్రేమికుడి తలలోకి ఎటువంటి వింత ఆలోచనలు
ప్రియ భావనలు చొరబడ్డాయో ఎవరికి తెలుసు?
'ఓ దయగల దేవుడా! కరుణించు!' –అరిచాను.
'ల్యూసీ చనిపోలేదు కదా! కాపాడు'

*   *   *   *   *

ఎవరూ తిరుగాడని ప్రదేశాలలో ఆమె నివసించింది.
డోవ్ నదీ జలధారల పక్కన...
అక్కడ ఆమెను ప్రశంసించే వారెవరూ లేరు.
ప్రేమించేవారూ బహు స్వల్పమే!

నాచుబట్టిన రాయి పక్కన ఓ వయొలెట్ పుష్పం
కంటికి సగం కనిపించీ కనిపించకుండా ఉన్నది.
నింగిలో నక్షత్రంలా మిణుకు మిణుకుమంటూ
ఒక్కతే ఒంటరిగా ప్రకాశిస్తున్నది.

ఆమె ఎవరికీ తెలియదు.
తెలిసిన కొద్దిమందికీ ల్యూసీ పోయిందెప్పుడో తెలియదు.
ఆమె తన సమాధిలో నిదురించుచున్నది.
అదే నాలో మార్పును తెచ్చినది.

*   *   *   *   *

ఎందరో అపరిచితుల మధ్య ప్రయాణం చేసాను.
దూరతీరాలలో, సముద్రాల కావల...
కాని, ఓ ఇంగ్లాండ్ దేశమా! అప్పటివరకు
తెలియలేదు నీపై నాకెంత ప్రేమ ఉన్నదో!

ఈ విషాధ భరిత స్వప్నమేనాడో గతించినది
అయినా నేను నీ తీరాన్ని విడవబోను.
రెండోసారైనా, మరెన్ని సార్లైనా
నిన్ను నేను మరింతగా ప్రేమిస్తాను.

నీ కొండల మధ్య నా కోరికల
ఆనందం మరింత ప్రస్ఫుటిస్తుంది.
నేను కోరుకున్న యువతి తన చక్రాన్ని
ఇంగ్లీషు అగ్నివేపు మరలించింది.

ఉదయాలు చూపించాయి, రాత్రుళ్లు దాచాయి,
ల్యూసీ ఆడుకున్న పొదరిళ్లను-
ఈ ఆకుపచ్చని మైదానమే ఆఖరిది,
ల్యూసీ కనులు పర్యవేక్షించినది.

*   *   *   *   *

ఒక దీర్ఘ నిద్రపై నా ఆత్మ సీలు వేసింది
నాకు మానవ భీతి లేదు
ఈ మనుష్య గణిత సంవత్సరాలు స్పృశించలేని
విషయంగా ఆమె నాకు అనిపించింది.

ఆమెలో ఇప్పుడు చలనం లేదు, శక్తి లేదు;
ఆమె వినలేదు, చూడలేదు;
ఈ భూగోళపు రాత్రింబవళ్ల ప్రయాణంలో
శిలలలో, రాళ్లలో, చెట్లలో ఆమె తిరుగుతున్నది.

✧✧✧✧✧

The Lucy Poems : ఇంగ్లీషు భావవాద కవి విలియం వర్డ్స్‌వర్త్ 1798-1801 మధ్యకాలంలో వ్రాసిన The Lucy poems - ఇంగ్లీషు Romantic Movement (భావవాదం) తొలిదశలో వచ్చాయి. సౌందర్యం, ప్రకృతి, ప్రేమ, నిరీక్షణ, మృత్యువు వీటి Abstract (సంగ్రహ) రూపాల్ని భావవాదంలో చూస్తాము.

1) 'Strange fits of Passion have I known
2) She dwelt among the Untrodden ways.
3) I travelled among unknown men.
4) Three years she grew in sun and shower
5) A slumber did my spirit seal

ఇవన్నీ విడివిడిగా వ్రాసినప్పటికీ వర్డ్స్‌వర్త్ మరణానంతరం ప్రచురణకర్తలు వాటిని ఒక fixed group of poems గా ప్రచురించారు.

1798లో William wordsworth, Samuel Taylor coleridge ఇద్దరూ సంయుక్తంగా Lyrical Ballads with a few other poems పేరిట ప్రచురించారు. ఆంగ్ల సాహిత్యంలో Romantic Movement కు ఇదే ప్రారంభం. 'సాధారణ, దైనందిన సంఘటనలకు కొంత ఊహా వర్ణాలను జోడించి వ్యావహారిక భాషలో, కొత్త కోణంలో పాఠకులకందించడం ఉద్దేశం'గా ఈ Romantic movement మొదలయ్యింది.

ఈ ఇద్దరు కవులూ Somerset లో కూతవేటు దూరంలోనే ఉండడం, Coleridge స్నేహం, కవిత్వం Wordsworthలో బద్ధకాన్ని వదిలించగా కవిత్వసృష్టి ధారాళంగా జరిగిందని వర్డ్స్‌వర్త్ సోదరి Dorothy వ్రాసింది. Coleridge, Wordsworth కలిసి జర్మనీ వెళ్లినా ఆర్థిక అసమానతలు వారిని విడదీసాయి.

ల్యూసీ (Lucy) సజీవరూపమా, ఊహావ్యక్తియా లేక సోదరి డొరొతి గురించా అనేదానిపై ఎన్నో తర్జనభర్జనలు జరిగినా, ఏనాడూ వర్డ్‌వర్త్ ఆ విషయంపై నోరు మెదపక పోవడం ఆ విషయాన్ని మరింత మార్మికంగా ఉంచింది.

6. వెస్ట్ మినిస్టర్ వంతెనపై (సెప్టెంబర్ 3, 1802)

(Upon Westminister Bridge, September 3, 1802)

ఇంత అందమైనది ఈ భూ ప్రపంచంలో లేదు;
ఇటుగా వెళ్లిన వాడు ధన్యుడు.
రాజసముట్టి పడుతున్న అద్భుత దృశ్యం ఇది;
ఈ నగరం ప్రభాత సౌందర్యాన్ని నగ్నంగా, నిశ్శబ్దంగా, వస్త్రాన్ని ధరించినట్లు కప్పుకున్నది.
నౌకలు, బురుజులు, గోపురాలు, ప్రదర్శన శాలలు, ఆలయాలు,
విశాలమైన మైదానాల నుంచి ఆకాశంలోకి విస్తరిస్తున్నవి.
నిర్ధూమ వాయు వీచికలలో నిబిడీకృతమై నిర్దుష్టమై ప్రకాశవంతమై మెరుస్తున్నవి.
ఇంతకు ముందేనాడూ సూర్యుడు తన తొలి వేకువ
మహాద్భుతాగమనాన్ని లోయలపై, శిలలపై,
గుట్టలపై ఇంత అపురూపంగా కనిపింపజేయలేదు.

ఇంత చక్కటి ప్రశాంతతను నేను కనీవినీ ఎరిగి ఉండలేదు.
నది తన ఇష్టాన్ననుసరించి నెమ్మదిగా ప్రవహిస్తున్నది.
ఓ దేవా! ఈ భువన గృహములన్నీ నిదురించుచున్నట్లున్నవి,
అత్యంత శక్తివంతమైన హృదయం అలా నిశ్చలంగా ఉండిపోయింది.

✧✧✧✧✧

Upon West Minister Bridge : తెల్లవారుజామున లండన్ నగరాన్ని, థేమ్స్ నదిని 'వెస్ట్‌మినిస్టర్ బ్రిడ్జి' పైనుంచి తాను తన (Dorothy) సోదరితో కలిసి జులై 31, 1802లో చూసిన దృశ్యాన్ని వర్ణించే ఈ పధ్నాలుగు పంక్తుల Sonnet చిరస్మరణీయమైనది.

7. నిర్ణయము - స్వాతంత్ర్యము

(Resolution and Independence)

1

రాత్రంతా గాలి గర్జిస్తూనే ఉన్నది.
కుండపోతగా కురిసిన వర్షం వరదలై పారుతున్నది.
ఇప్పుడు సూర్యుడు ప్రశాంతంగా, ప్రకాశవంతంగా ఉదయిస్తున్నాడు.
సుదూరపు అడవులలో పక్షులు పాడుతున్నవి
తమ మధుర స్వరాల మధ్య పావురాలు కువకువలాడుతున్నవి.
బొంతకాకి ముచ్చట్లకు 'జే' పక్షి బదులిస్తున్నది.
గాలి నిండా జలతరంగిణి మధురనాదాలు వ్యాపించినాయి.

2

భానుడిని ప్రేమించే ప్రతిదీ ప్రకృతి ఒడిలో తారట్లాడుతున్నది.
ప్రభాత ప్రసవాన ఆకాశం ఆనందంతో ప్రజ్వరిల్లుతున్నది.
మైదానాలలో పచ్చగడ్డి వర్షపు నీటిబిందువులతో హర్షాన్ని తెలుపుతున్నది.
పట్టలేని ఆనందంతో శశాదమొకటి పరుగులిడ్తున్నది.
మెత్తటి నేలపై గంతులేస్తూ ఆ కుందేలు సూర్యకాంతిలో
మెరసిపడే మంచుతెరను లేవనెత్తుతున్నది
తనతోపాటు ఆ యవనికను తరలించుకుపోతున్నది.

3

ఆ మైదానంలో ఆనాడు నేనొక బాటసారిని;
హాయిగా గంతులిడ్తున్న ఆ చెవుల పిల్లిని చూసాను నేను.
సుదూరపు నీటి శబ్దాలను, అరణ్య ఘోషను విన్నాను.
విన్నానో లేదో కాని, ఒక బాలుడిలా విస్మయమందాను.
నా హృదయాన్ని ఆ చక్కటి దృశ్యం కట్టిపడేసింది.
ఆ పాత జ్ఞాపకాలు నన్ను పూర్తిగా విడిచిపోయాయి.
మనుష్యుల నడకలన్నీ స్వార్థపూరితమై, విషాదభరితమైనవి.

4

ఒక్కోసారి అనిపిస్తుంది, ఈ మానసిక
అతిశయానందం నుంచి ఇంకా ముందుకు పోలేనని
ఈ సంతోష శిఖరాల్ని ఎంత పైకెక్కితే
నిరాశలో అంత దిగువకు జారిపోతామని...
నాకానాటి ఉదయాన అలా అనిపించింది.
భయాలూ ఊహలు భారంగా చుట్టుముట్టాయి.
మసక మసక విచారం, గుడ్డి ఆలోచనలు నాకు తెలియనివి, పేరు చెప్పలేనివి...

5

నింగిలో ఎగుర్తూ, భరతపక్షి పాడ్తున్న పాటను విన్నాను.
నన్ను నేను గంతులేస్తున్న కుందేలుగా తలపోసాను.
ఈ నేలపై తిరుగాడే ఆనందపు శిశువుగా అభివర్ణించుకున్నాను.
నేను వర్ణించిన ఈ సంతోష జీవనమూర్తులు
నేను నడిచే ప్రపంచానికి సుదూరంగా, ఏ వెరపూ లేకుండా ఉన్నాయి కదా!
ఏమో, ఎప్పుడైనా రావచ్చు ఆరోజు...
ఒంటరితనం, హృదయగాయం, దుఃఖం, పేదరికం ముంచెత్తే రోజు!

6

నా జీవితమంతా గాఢమైన ఆలోచనలలో గడిపాను
జీవన వ్యాపారాన్ని వసంత వేసవి శోభగా తలపోసాను.
నాకవసరమైనవన్నీ ఆశించకుండానే వస్తాయని
అచంచల విశ్వాసం, మంచితనంపై నమ్మకం;
కాని, తన కోసం ఏ కృషీ చేయనివాడు
ఇతరుల నుంచి ఎందుకాశించాలి, వారు తనకై
కష్టించి, విత్తి పండించి, పిలవంగానే ప్రేమించాలని?

7

ఛాటరాన్, అద్భుతమైన కుఱ్ఱవాడు, గుర్తుకు వచ్చాడు.
ఆ నిద్రించని ఆత్మ అతడి గర్వంలో నశించిపోయింది.
అంతులేని కీర్తిప్రతిష్ఠలు, ఆనందంతో నడిచాడు కొద్దికాలం
కవిత్వపు నాగటి చాళ్లలో, కొండల పక్కన నడుస్తూ...
మన ఆత్మల ప్రాభవంతోనే మనం దివ్యరూపులమౌతాము.
యవ్వన వనంలో మనం, కవులం ఆనందంగా గడుపుతాము
ఆ తరువాత మనల్ని ఆవహిస్తుంది నియంతృత్వ పోకడ, ఉన్మాదం.

8

ఏదో దివ్యశక్తి, ఇప్పుడు, మనపై వింత కరుణను చూపుతుంది.
ఒక సూచన, ఏదో అనిర్వచనీయమైనది, ఇవ్వబడ్తుంది.
ఈ ఒంటరి ప్రదేశంలో అది హఠాత్తుగా మీద పడుతుంది.
ఇటువంటి వ్యర్థపుటాలోచనలన్నీ సమసిపోయాక
స్వర్గనేత్రపు పరిధిలోని సరస్సు పక్కన
నాకు తెలియకుండానే ఓ మనిషిని చూసాను
వెండి శిరోజాలతో ఉన్న అతడు వృద్ధులలో కల్లా వృద్ధుడు

9

ఒక విశాలమైన బోడిగుట్ట శిఖరాగ్రాన
బ్రహ్మాండమైన శిల ఒకటి పేర్చబడి ఉంటుంది.
ఈ నిర్మాణం ఎవరు చేసారో ఎవరికీ అంతుపట్టదు.
అక్కడకు ఎలా, ఎప్పుడు వచ్చిందో ఎన్నటికీ తేలదు.
కాని దానిలో క్రమపద్ధతి, నిగూఢత నిక్షిప్తమై ఉన్నది.
సముద్రంలోంచి ఈదుకు వచ్చి బండరాళ్లపైననో
ఇసుక తిన్నెలపైనో వళ్లారబెట్టుకుంటున్న సముద్రమృగంలా–

10

అలా అనిపించాడీ మానవుడు; సజీవుడో కాదో తెలీదు
నిద్రపోతున్నట్లూ లేదు – వృద్ధాప్యపు అంతిమ దినాలు...
పూర్తిగా వంగిన నడుము; తల, పాదాలు దగ్గర దగ్గరగా
జీవన తీర్థయాత్రలో చివరిఘట్టం దగ్గర కలుసుకుంటున్నట్లు
ఏదో బాధ, ఆగ్రహం, ఎన్నాళ్ల నుంచో అతడిని
వేధిస్తున్న రుగ్మత తాలూకు ఆనవాళ్లు, బంధాలు
అతడి కంకాళంపై మానవాధికమైన భారాన్ని మోపినట్లు...

11

తనకు తానే ఆధారమైనట్లు, కాళ్లూ చేతులు, శరీరం
పాలిపోయిన మొహం, బెరడు తీసిన బూడిద రంగు కర్ర చేతిలో
మెల్లమెల్లగా నడుస్తూ అతడిని సమీపించాను.
మైదానాన్ని తాకిన వరద అంచు వద్ద
నిశ్చల మేఘంలా నిలబడి ఉన్నాడా వృద్ధుడు.
భీకర వాయు పవనాల పిలుపు వినబడడంలేదేమో!
కదిలితే సమూహమై కదుల్తాయి, లేకుంటే లేదు.

12

చాలాసేపటి తరువాత, కాస్త కదిలి, చేతిలోని కర్రతో
కదిలించాడు సరస్సులోని నీటిని, అలాగే
కదుల్తున్న బురద నీటివైపు తీక్షణంగా చూస్తూ
ఏదో పుస్తకాన్ని చదువుతున్న భ్రమను కలిగించాడు.
ఊరివాడికుండే హక్కులతో ముందుకు అడుగువేసాను నేను.
అతడి పక్కనే నిలబడి ఇలా పలకరించాను–
'ఈ ఉదయం మనకు శుభదినాన్ని వాగ్దానం చేస్తున్నది'–

13

ఆ వృద్ధుడు మృదువుగా సమాధానమిచ్చాడు.
ఎంతో మర్యాదగా వినయపూర్వకంగా నావేపు తిరిగాడు.
నేను మంచిమాటలను పేర్చుకుని సంభాషించానతడితో
'మీరేం చేస్తున్నారిక్కడ ఒంటరిగా?
తమలాంటి వారుండతగిన ప్రదేశం కాదు గదా ఇది'.
నా కాశ్చర్యం కలిగేలా అతడు బదులు పలికాడు
నల్లబడినా మెరుపు తగ్గని కళ్లు ప్రకాశిస్తుండగా.

14

బలహీనమైన రొమ్ము నుంచి వెలువడినాయి అతని మాటలు
మరింత బలహీనంగా, అయినా, ఒక క్రమపద్ధతిలో
ఆ పలుకులలో ఎంతో ఠీవి, గంభీరత ఉన్నాయి
సాదాసీదా మనుషులు మాట్లాడలేని తీరు,
పద గుంభనం, అక్షర రమ్యత, రాజ భాష
మానవులకు, దేవుడికి పూజారులు సమర్పించే స్తోత్రపాఠంలా.

15

అతడన్నాడు- నేనీ సరస్సు దగ్గరకు వచ్చినది
జలగలను పోగు చేసుకోడానికి, నేను నిరుపేదను,
పైపెచ్చు వృద్ధుడిని, కాయకష్టం చేసే శక్తిలేదు.
ఎన్నో కష్టాలను భరించాను, భరిస్తున్నాను.
చెరువు నుంచి చెరువుకు, మైదానం నుంచి మైదానానికి-
దేవుడి దయవలన, గృహమున్నది, నా ఎన్నికో, లేక అదృష్టమో,
ఈ పని వలన నాకు రోజు గడుస్తున్నది, ఎవరినీ దేబిరించకుండా.

16

నాతో మాట్లాడుతూ అతడు నిశ్చలంగా నిలబడినాడు.
ఇప్పుడాతని స్వరం ఒక నిరాటంక ప్రవాహం
ఆగని జలధార; పదాలుగా విడదీయలేని అక్షర జలపాతం.
అతడి యావత్ శరీరం నేను కలలో చూసిన,
కలిసిన వ్యక్తిదిగా అనిపించి నన్ను ఆలోచింపచేసింది.
బహుశా, సుదూరం నుంచి ఇక్కడకు వచ్చి, నన్ను మందలించి,
నాలో కొత్త ధైర్యాన్ని పాదుకొల్పడానికి వచ్చిన వ్యక్తి కావచ్చు...

17

నా వెనకటి ఆలోచనలు తిరిగి వచ్చాయి.
భయం చంపుతుంది. ఆశ తిననంటున్నది.
చలి, బాధ, శ్రమ ఇవన్నీ దైహిక రుగ్మతలు
గొప్ప గొప్ప కవులు దారిద్ర్యంలో మరణించారు.
కలవరంలో, ప్రేమను, అనునయాన్ని ఆకాంక్షిస్తూ–
నా ప్రశ్నను మరల అడిగాను ఉద్వేగంతో,
'ఎలా జీవిస్తున్నావు, ఏం చేస్తున్నావు?'

18

చిరునవ్వుతో అతడు అదే సమాధానమిచ్చాడు.
దూరతీరాలకు పోయి జలగలను పోగుచేస్తాను.
ఎన్నో దేశాలు తిరిగాను, ఎక్కడ సరస్సు కనబడితే
అక్కడ ఆగిపోతాను. ఆ చెరువులోని నీటిని కదిలిస్తాను.
ఇది వరకు నేనెటుపోయినా నాకవి కనిపించేవి
క్రమేపీ నశించి నేడవి కనుమరుగవుతున్నవి
నేను వాటిని సంరక్షిస్తాను. వెదకి పట్టుకుంటాను.

19

అతడలా మాట్లాడుతున్నపుడే, ఆ ఒంటరి ప్రదేశం
ఆ వృద్ధుడి రూపం, అతడి మాట, నన్ను కలవరబెట్టాయి.
నా మనోనేత్రంలో నిరంతరాయంగా అతడు
మైదానాలను దాటిపోతుండడం గమనించాను.
ఒంటరిగా, నిశ్శబ్దంగా అతడు వెళ్లిపోతూనే ఉన్నాడు.
నాలో నేను ఈ ఆలోచనలలోను సమీక్షిస్తున్నపుడు
అతడు ఓ క్షణం ఆగి, మరల తన సంభాషణను కొనసాగించాడు.

20

ఈ విషయాలతో పాటు మిగతా మాటలూ కలిపాడు
సరస సంభాషణ, దయాపూరిత ప్రవర్తన
ఠీవిని కోల్పోని మాటలు – అవి పూర్తికాగానే
తిరస్కారంగా, నాలో నేను నవ్వుకుందామనుకున్నాను.
వయసు మీరినా, దృఢ చిత్తంతో ఉన్న ఆ మానవుడిని చూసి...
"దేవుడా!' ప్రార్థించాను నేను– 'నన్ను రక్షించు' ఒంటరి మైదానంలో
జలగలు పోగు చేస్తున్నవాడిని నేనెప్పటికీ గుర్తుంచుకుంటాను.'

✧✧✧✧✧

Resolution and Independence : అక్టోబరు 3, 1800 నాడు తన ఇంటికి దగ్గర్లో (Dove Cottage Grasmere) వర్డ్స్‌వర్త్, జలగలను పోగుచేసే వ్యక్తితో (Leech gatherer) పరిచయమేర్పర్చు కున్నాడు. మే 1802 లో 'The Leech-gatherer' (3–9 తేదీల మధ్య) వ్రాసిన ఈ కవితను అనేకమార్లు సరిదిద్దినాడు.

ఏడు పంక్తులున్న ఇరవై పద్యాలను Modified rhyme royal (a-b-a-b-b-c-c) Geoffrey Chaucer తొలిసారిగా ఈ Rhyme ను వాడినాడు) లో వర్డ్స్‌వర్త్ వ్రాయగా అతడి వధువు Mary Huchinson, ఆమె సోదరి Sara ఈ కవిత్వాన్ని సమీక్షించినారు.

ఏడవ పద్యంలో– 43వ పంక్తి–లో పదిహేడేళ్ల వయసులో ఆత్మహత్య చేసుకున్న Thomas Chatterton (20-7-1752 to 24-8-1770) గురించి, 49వ పంక్తిలో తన 37వ ఏట Manic Depression వ్యాధితో మృత్యువు పాలైన Robert Burns (25-1-1759 to 21-7-1796) గురించి వర్ణిస్తాడు.

8. ఈ ప్రపంచం మనకు కావాల్సిన దానికన్నా అధికంగా ఉన్నది

(The World is too much with us)

ఈ ప్రపంచం మనకు కావాల్సిన దానికన్నా అధికంగా ఉన్నది,
ఆలస్యంగానైనా ముందుగానైనా సంపాదించడంలో, ఖర్చుపెట్టడంలో
వృధా చేస్తున్నాం మనం మన శక్తులన్నీ
మనదైన ప్రకృతిని మనం చూడడం లేదు ఏమాత్రం
మన హృదయాలను మనం ఇచ్చివేస్తున్నాం ఆవలకు, తుచ్ఛమైన వరంగా!
చంద్రుడికై తన రొమ్మును నగ్నంగా చేసిన సముద్రాన్ని
అన్ని ఘడియల్లోనూ ఊళలు వేసే అద్భుత గాలుల్ని
ఇప్పుడు ఏరుకుంటున్నాం నిద్రిస్తున్న పుష్పాల్లా
దీనికోసం, ప్రతిదానికోసం, మనం అపశృతులమైనాం.

మనల్నేదీ కదిలించడం లేదు – ఓ భగవాన్! నేను దీనికన్నా
ఒక ప్రకృతి ఆరాధకుడిగా వెలుపలి తెగలో పాలు గుడిచినా బాగుండేది.
అలా అయినా, ఈ ఆహ్లాదకరమైన మైదానంలో ఉండేవాడిని నిలబడి
చక్కటి దృశ్యాలను చూసేవాడిని, ఒంటరితనాన్ని తక్కువగా అనుభవిస్తూ
చూసేవాడిని, సముద్రం నుంచీ ప్రొటియస్ పైకెగయడం
లేదా వినేవాడిని ట్రిటాన్ పూలు అలంకరించిన తన కొమ్ముబూరను ఊదడం.

✧✧✧✧✧

ప్రజల్లో భౌతిక సంపదల పట్ల పెరుగుతున్న వ్యామోహం, ప్రకృతిని నిర్లక్ష్యం చేస్తూండడం గమనించిన వర్డ్స్‌వర్త్ – ప్రకృతి కవి – తన అభిప్రాయాలను సూటిగా చెప్పిన కవిత ఇది. ప్రొటియస్– ఏ రూపానికైనా మారగల సముద్ర దేవత; ట్రిటాన్– సముద్రపు వార్తాహరుడు.

9. లండన్ - 1802

(London - 1802)

మిల్టన్! నీవు ఈ ఘడియలో ఇక్కడ జీవిస్తూ ఉండి ఉంటే,
ఇంగ్లాండుకు నీ అవసరమున్నదిప్పుడు; ఇప్పుడది
నీరు నిలిచిన చిత్తడి నేల; దైవపీఠం, కత్తి, కలం
నెగడు పక్కన, వీరోచితంగా సంపాదించిన ధనపు ఆవరణ, నివాసం!
అది వదులుకున్నది తన ప్రాచీన ఇంగ్లీషు వరకట్నమనే
అంతర్గత ఆనందాన్ని; మేము స్వార్థపరులం!
ఓ మేలుకో! తిరిగి రా మా దగ్గరకు!
మాకివ్వు మంచి ప్రవర్తన, శీలం, స్వేచ్ఛ, అధికారపు శక్తి!
ఆత్మ అనేది ఒక నక్షత్రం, విడిగా గడుపుతుంది కాలం
నీకున్నది సముద్రంలా ధ్వనించే స్వరం
స్వచ్ఛమైనది, నగ్న అంతరిక్షంలా, రాజసంగా, స్వేచ్ఛగా!
నీవు పయనించలేదా జీవితపు మామూలు దారిపై,
చైతన్యవంతమైన దైవత్వంతో, అయినా నీ హృదయం,
అత్యల్పమైన విధులను నిర్వహించలేదా తానంతట తాను!

✧✧✧✧✧

The World is too much with us, London - 1802 ఈ కవితలు మారుతున్న కాలంపై వర్డ్స్‌వర్త్ (1770–1850) అభిప్రాయాల్ని వెల్లడిస్తాయి. London-1802 - Poems in Two volumes (1807)లో ప్రచురింపబడింది.

10. పంటను కోస్తున్న ఒంటరి యువతి

(The Solitary Reaper)

ఆమెను చూడు, పొలంలో ఒంటరిగా
ఒంటరి కొండ ప్రాంతపు యువతి!
పంటను కోస్తూ, పాట పాడుతూ తనకు తాను;
ఆగిక్కడ! లేదా నెమ్మదిగా వెళ్లు,
ఒంటరిగా కోస్తూ, కడుతున్నది పనలను,
పాడుతున్నదొక విషాద స్వరాన్ని
ఓ విను! ఆ నిగూఢమైన లోయ
ఆ పాట శబ్దంతో పొంగి ప్రవహిస్తున్నది.

ఏ నైటింగేలు పక్షీ అంత మధురంగా పాడలేదు,
అలసిపోయిన బాటసారులకు అలాంటి స్వాగత స్వరాలను అందించలేదు!
వెంటాడే నీడలాంటి ప్రదేశాల్లో,
అరేబియన్ ఇసుక ఎడారుల్లోనూ.
అటువంటి కంపనం కలిగించే స్వరాన్ని వినలేదు
కోయిల నుంచీ కూడా వసంత ఋతువులో
సముద్రాల నిశ్శబ్దాన్ని భంగపరుస్తూ
సుదూరపు హెబ్రైడ్ మధ్యలో.

ఎవరూ చెప్పవద్దు నాకు ఏమి పాడుతున్నదో ఆమె?–
బహుశా విషాదపు గానాలవి ప్రవహిస్తున్నవి.
వయసు మళ్లిన, ఆనందరహిత సుదూరపు విషయాలను,
ఎప్పుడో జరిగిన గొప్ప యుద్ధాలను,

లేదా ఏదో మామూలు లౌకిక విషయమో,
ఈ రోజుల్లో అందరికీ పరిచితమున్న వ్యవహారమో?
ఏదో సహజ దుఃఖం, నష్టం, బాధ ఏదో అది
గడచినదో, లేదా మరలా వచ్చినదో?

ఏ అంశమైనా కావచ్చు, ఆ కన్య పాడినది
తన పాటకు ముగింపు లేనట్లు
నేను చూసాను ఆమె పనిచేస్తూ పాడడాన్ని.
వంగి, కొడవలితో కోస్తూ ఉండడాన్ని.

నేను విన్నాను, కదలకుండా నిశ్చలంగా
కొండపైకెక్కుతూ నేను వెళ్తున్నపుడు
నా హృదయంలో దాచుకున్న ఆ సంగీతం
అదిక, వినబడకపోయినా, నిలిచిపోయింది నాలో దీర్ఘకాలం.

✧✧✧✧✧

The Solitary Reaper నవంబరు 5, 1805 నాడు వ్రాయబడి 1807లో ప్రచురింపబడినది. (Poems in Two Volumes). వర్డ్స్‌వర్త్ కవితలలో ఎక్కువ స్వానుభవంతో వ్రాసినవి కాగా, ఈ కవిత తన స్నేహితుడు Thomas Wilkinson వర్ణించిన సంఘటనను కవిత్వీకరించింది.

11. తిరగబడిన బల్లలు

(The Tables Turned)

లే! లే! మిత్రుడా! ఆ పుస్తకాలను అక్కడే వదులు!
లేదా, తప్పకుండా నీవవుతావు రెండింతలు.
లే! లే! స్నేహితుడా, మార్చు నీ చూపులు.
ఎందుకింత శ్రమా, ఈ కష్టాలు?

పర్వత శిఖరంపై అడుగో సూర్యుడు
మెత్తని తాజాకాంతిని నీరెండగా ఇస్తున్నాడు
ఆకుపచ్చని పొలాల్నిండా నింపినాడు
తన తొలి మాధుర్యపు సాయంకాలపు పసుపు!

పుస్తకాలు! అది ఓ అంతులేని, నిరుత్సాహపు కష్టం
రా, విను అడవిపక్షి లిన్నెట్ గానం,
ఎంత మధురమైనదీ సంగీతం, అది నా జీవితం
దానిలో ఉన్నది మరింత విజ్ఞానం, పరిజ్ఞానం!

ఆగు, విను, ఎంత ఆనందంతో థ్రొసిల్ పాడుతున్నది!
అతడేమీ మామూలు మతబోధకుడు కాదు;
ముందుకురా విషయాల వెలుగులోకి
ప్రకృతిని స్వీకరించు నీ ఉపాధ్యాయుడిగా!

ఆమెలో సిద్ధంగా ఉన్నాయి అనంత సంపదలు
మన మనసును, హృదయాన్ని ఆశీర్వదించే దివ్య నిధులు
ఆరోగ్యం నిశ్వసించే స్వయంసిద్ధ వివేచనా జ్ఞానం
సత్యం నిశ్వసించే ఆహ్లాదపు ఆనందం!

వసంతపు అరణ్యాల నుండి ఒక ప్రచోదన
నీకు మనిషి గురించి చెబుతుంది ఎంతైనా
నైతిక విలువల్ని, మంచీ చెడునూ,
అందరు సాధువులు, జ్ఞానులకన్నా!

ప్రకృతి తెచ్చే కథనమెంతో మధురం.
మిడిమిడి జ్ఞానంతో కెలుకుతాం మనం
అందమైన ఆకృతులను చేస్తాం విరూపం
కోసి శోధిస్తూ తెస్తాం మరణం!

చాలు చాలు ఈ శాస్త్రాలూ, కళలూ,
మూసివేయి ఆ ఎండిన పత్రాలు,
రా ముందుకు, నీతో తీసుకునిరా ఓ హృదయాన్ని,
హాయిగా చూసేదాన్ని, ఆనందాన్ని గ్రహించేదాన్ని!

✧✧✧✧✧

"Enough of Science and art
Close up those barren leaves
Comeforth, and bring with you a heart
that watches and receives"

–అంటూ పుస్తకాలలో పడి కొట్టుమిట్టాడుతున్న వాళ్లను ప్రకృతి అందాలలోకి రమ్మని ఆహ్వానించే ఈ కవిత 1798లో వ్రాయగా Lyrical ballads లో ప్రచురింపబడినది. పుస్తకాలనుంచి కన్నా ప్రకృతి నుంచి మనం ఎక్కువ నేర్చుకో గలుగుతామనేది ఈ చక్కని కవితలోని ప్రధానాంశం.

శామ్యూల్ టేలర్ కాలరిడ్జి

(1772-1834)

1. కుబ్లాఖాన్ లేదా స్వప్నదర్శనం

(Kublakhan or a vision in a dream (A fragment)

ఈ కవిత్వపు శకలం ఘనకీర్తిగల లార్డ్‌బైరన్ కోరికపై ప్రచురింప బడుతున్నది, కవిత్వపు విలువలకన్నా, మానసిక జిజ్ఞాసా వైచిత్రిని బహిర్గతపరచిన విశేషంగా ఈ కవితను రచయిత అభిప్రాయపడుతున్నాడు.

1797 వేసవికాలంలో ఆరోగ్యరీత్యా రచయిత పోర్లాక్-లింటన్ మధ్యలో ఉన్న వ్యవసాయక్షేత్రపు ఒంటరి ఇంట్లో విశ్రాంతి తీసుకుంటున్నపుడు, బాధను తగ్గించడానికి (Anodyne) మందులు ఇవ్వబడినవి. వాటి ప్రభావంతో కుర్చీలోనే కునుకు తీస్తూ మధ్యమధ్యన Purcha's Piligrimage ను చదువుతూ - ఇక్కడ కుబ్లాఖాన్ పదిమైళ్ల విస్తీర్ణంలో కోటను, రాజభవనాన్ని, రాచవనాల్ని నిర్మించమని ఆజ్ఞాపించినాడు - అన్న వాక్యాల్ని చదువుతూ దాదాపు మూడుగంటల పాటు గాఢ నిద్రలో ఉండిపోయినాడు. నిద్రలో స్వప్నం, స్వప్నంలోనే అనేక దృశ్యాలు వాస్తవంగా జరుగుతున్నట్లే ఉన్న భావన, ఎటువంటి చేతనా ప్రయత్నం లేకుండానే దృశ్య సమాన భావ ప్రకటనలు, మెలకువ రాగానే ఆ రెండు మూడు వందల పంక్తులు స్పష్టంగా గుర్తుకు వస్తుండగా రచయిత కాగితం, సిరా, కలం తీసుకుని వ్రాస్తూ పోతున్న సమయంలో-

పోర్లాక్ నుంచి ఏదో పనిమీద వచ్చిన వ్యక్తి ఒక గంటసేపు రచయితతో మాట్లాడి వెళ్లినాడు. ఆ తరువాత సారాంశం గుర్తున్నా, రచయితకు ఏడెనిమిది వాక్యాలు మినహా మిగతావి మనసు నుండి అస్పష్టంగా, నిర్మలమైన ప్రవాహపు నీటిపై రాయి పడినట్లు కాగా, అయ్యో, మిగిలిన కవితను పూర్తి చేయలేక పోయినాడు.

1

'అప్పుడు ఆ మంత్రశక్తి, మాయ
విరుగగొట్టబడి, ఇంద్రజాలమంతా అదృశ్యమై
వేయి వలయాలు రూపులు మార్చుకోగా, లేచిచూడు,

యువకుడా! కనురెప్పలు పైకెత్తి చూడలేవు నీవు.
త్వరలో ఏటి ప్రవాహం మరల నిర్మలమవుతుందిలే!
మరల నీకు దర్శనమవుతంది! అలా అనుకుని
అతడు లేచి చూసినాడు, ఆ అందమైన అస్పష్ట రూపాలు
కనిపిస్తూ, కంపిస్తూ మరలివచ్చి ఒక్కటైనాయి. మరల
నీటి మడుగు మారింది అద్దంలా!'–

- (From the Picture)

అనేకసార్లు రచయిత ప్రయత్నించినాడు తొలి దర్శనంలోని దృశ్య భావ ప్రకటనలను గుర్తు తెచ్చుకోవాలని, ఆ వచ్చేరోజు రేపు కావచ్చునని, కాని ఆ రేపు ఇంకా రావాల్సి ఉన్నది.

క్జానాడులో కుబ్లాఖాన్
ఆజ్ఞాపించినాడు ఓ అద్భుత రాజసౌధాన్ని నిర్మించమని;
ఎక్కడైతే ఆల్ఫ్‌నది
మానవునికి అంతుపట్టని లోతున్న గుహల గుండా
సూర్యకిరణాలు సోకని సముద్రంలోకి ప్రవహిస్తుందో, అక్కడ!
పది మైళ్ల విస్తీర్ణమున్న సారవంతమైన భూమి
చుట్టూరా దుర్భేధ్యమైన కోటగోడలు, బురుజులు
మెలికలు తిరిగే సెలయేళ్లతో ప్రకాశిస్తున్న ఫలపుష్పవనాలు
అక్కడ విరిసి ఉన్నాయి అనేక సుగంధ ద్రవ్యపు వృక్ష్యాలు
అలనాటి కొండలంత ప్రాచీనమైన అరణ్యాలు
వాటి మధ్యలో ఎండలో శోభిస్తున్న ఆకుపచ్చని మైదానాలు.

అయితే ఓహ్! తాదాత్మ్యతను కలిగించే ఆ లోతైన అఖాతం
ఆకుపచ్చని కొండ నుండి, దేవదారు వృక్షాల నీడలో
అటునుంచి ఇటు వరకు, ఏటవాలుగా విస్తరించినదదిగో!
అనాగరిక ప్రదేశం! పవిత్రంగా, మంత్రబద్ధమై ఉన్నట్లు,
కృష్ణపక్ష కృశీభూత చంద్రుడి మసకవెన్నెల కింద
తన దయ్యపు ప్రియుడికై బిగ్గరగా విలపిస్తున్న స్త్రీ వెంటాడుతున్నట్లు!
ఈ అఖాతంలో ఎడతెగని కల్లోలమేదో బుసలు కొడ్తున్నట్లు

పుడమి వేగంగా గాఢంగా రొప్పుతూ ఊపిరి తీసుకుంటున్నట్లు
ఓ మహా నీటి ఊట క్షణంలో వెల్లువలా పైకుబికుంది.
ఆగుతూ, పైకి లేస్తూ, విరుచుకుపడుతూ, ఉపశమిస్తూ
పెద్దపెద్ద నీటి శకలాలు, వెనక్కి పడ్తున్న వడగళ్ల సమూహంలా, లేక,
ధాన్యాన్ని నూరుస్తున్నపుడు చేటకింద ఎగుర్తున్న ఊకలా;
ఆ నర్తించే శిలలమధ్య ఒక్కసారిగా దూసుకుపోతుంది
ఈ పవిత్రనది క్షణమాత్రంలో!

అయిదుమైళ్లు గజిబిజి నడకల్తో, వంపుసొంపుల్తో
అడవుల్లో, లోయల్లో ప్రవహిస్తూ, ఈ పవిత్ర నది,
చేరుకున్నది నరుడికి అంతుపట్టని లోతైన గుహల్లోకి,
అల్లకల్లోలం చేస్తూ నిశ్చల సముద్రంలో మునిగిపోయింది.
ఈ సుదూర కల్లోల పరవళ్ల మధ్య నుంచీ విన్నాడు కుబ్లాఖాన్
యుద్ధాన్ని జోస్యం పలుకుతున్న తన పూర్వీకుల ఆత్మల స్వరాల్ని.

ఆనంద నిలయపు భవనపు గోడ
ఆ అలల మధ్యలో తేలియాడింది.
నీటి ఊట నుంచి, గుహల నుంచి
వస్తున్న శబ్దాలు మిశ్రమమై వినవస్తున్నవి.

అదొక అరుదైన వింత అద్భుతం
మంచు గుహల్తో కూడి, నీరెండతో వెచ్చగా ఉండే గోపురం

ఓ అందాల కన్య డల్సిమర్-విపంచిని చేబూని ఉన్నదానిని
ఒకసారి చూసాను స్వప్నంలో
ఆమె అబిస్సినియన్ యువతి
ఆ వీణపై ఆమె ఆలపించింది
అబోరాపర్వతం గురించి అద్భుతంగా!
నాలో మరల చైతన్యవంతమైనవి
ఆ సంగీతమూ, ఆ అద్భుత గీతమూ,
అంత లోతైన ఆనందం నన్ను గెలుచుకున్నది.

ఆ సంగీతంలో పెద్దగా, దీర్ఘంగా
నేను నిర్మిస్తాను ఆ గోపురాన్ని గాలిలో.
ఆ ఎండలో మెరిసే గోపురాన్ని! ఆ మంచు గుహల్ని!
ఆ పాటను విన్నవాళ్లందరూ చూస్తారు తప్పకుండా, అక్కడ,
అందరూ అరుస్తారు ముక్తకంఠంతో, జాగ్రత్త! జాగ్రత్త!
అతడి మెరిసే నయనాలు! అతడి ఎగిరే శిరోజాలు!
సృజిస్తున్నాయి అతడి చుట్టూరా మూడు వలయాలు
పవిత్రమైన భీతితో మీ కళ్లు మూసుకోండి.
అతడు తేనెమంచు తిని పెరిగినవాడు,
స్వర్గ క్షీరాన్ని తాగి ఉద్గమించినవాడు.

✧✧✧✧✧

1797లో కాలరిడ్జి వ్రాసిన ఈ స్వప్న కవిత– Dream Poem- Kubla Khan, or a vision in a dream: Afragment గా 1816లో ప్రచురింపబడినది. అప్పట్లో చిన్నచూపు చూడబడినా విమర్శకులిప్పుడు కాలరిడ్జి ముఖ్యమైన మూడు కవితలలో (The Rime of the Ancient Mariner, Christabel, Kubla Khan) ఒకటిగా పేర్కొంటున్నారు.

సెప్టెంబరు 1797లో అతడు తన మిత్రుడు విలియం వర్డ్స్‌వర్త్, అతడి సోదరి డోరతితో కలిసి క్వాంటాక్ కొండల వద్ద నడుస్తున్నపుడు– (ఇప్పుడా మార్గాన్ని Coleridge Way గా పిలుస్తున్నారు), అతడికి వచ్చిన ఆలోచనలను కవిత్వ వస్తువులుగా ఎన్నుకుని The Brook, Osorio లాంటి కవితలు వ్రాసినాడు. ఆ తరువాత అతడు Lynton వెళ్తున్నపుడు మార్గమధ్యంలో అస్వస్థతకు లోనుకాగా Culbone Church వద్దనున్న Ash farm లో విశ్రాంతి తీసుకున్నపుడు ఈ కవితను వ్రాసినాడు.

1613లో ప్రచురితమైన శామ్యూల్ పర్చాస్ పుస్తకం Purchas, his pilgrims లో క్జానాడు (Xanadu, Ciandu) గురించి కొద్దిపాటి వివరణ ఉన్నది.

మార్కొపోలో 1275లో దర్శించి 1298–99లో వ్రాసిన యాత్రానుభవాల్లో– కంబాలు (పెకింగు–బీజింగు) నగరం నుంచి మూడు రోజులు ప్రయాణం చేసి ఉత్తర ఈశాన్య దిశలో చందు (Xandu, Ciandu) నగరం, కుబ్లాఖాన్‌చే నిర్మితమైనది; దానిలో చలువరాతి భవనం, లోపల అనేక మానవ, జంతు, వృక్ష చిత్రాలు, పూలతో అలంకరించబడి చూపరులను విస్మయానందాలతో ముంచెత్తుతుంది. దాని చుట్టూరా 16 మైళ్ల విస్తీర్ణపు కోటగోడ, దానిలో ఉద్యానవనం, నదులు, సెలయేళ్లు, అడవిజంతువులు – అక్కడ ప్రభువు డేగలతో వేటకు వెళ్లి వినోదిస్తాడు'–అని వర్ణించినాడు.

ఈ వృత్తాంతాన్ని- Purchas సంక్షిప్తంగా వ్రాయగా దానిని కాలరిడ్జి తన కవితలో అద్భుతంగా వర్ణించినాడు.

14 అక్టోబరు 1797లో కాలరిడ్జి జాన్‌థెల్వాల్‌కు వ్రాసిన లేఖలో- నేను ఇండియన్ విష్ణువులా అనంతసాగరం మధ్యన పద్మంలో శయనిస్తూ, మిలియన్ల సంవత్సరాలకో కొద్దినిమిషాలు మేల్కొన్నపుడు ఈ అద్భుతాలన్నీ చిన్నపిల్లాడి ఆటలా అనిపిస్తాయి. ఈ విశ్వమంతా చిన్ని చిన్ని విషయాల గుట్టలా కనిపిస్తుంది -అని వ్రాసినాడు.

కీళ్లనెప్పులు, జ్వరం Rheumatic Fever తో బాధపడుతూ Laudanam (గంజాయి గోలీలు) మింగడం చేత వస్తున్న మత్తు ప్రభావంలో అతడు చూసిన అలౌకిక దృశ్యాల్ని తన కవితలలో నిక్షిప్తం చేయగలిగాడు.

ప్రచురింపబడిన కాలంలో ఎక్కువ విమర్శలకు గురైనదీ కవిత.

కుబ్లాఖాన్ కవిత వెలుగుచూడలేని గుడ్లగూబ. (దీంట్లో ఉన్నది Non Sense or No sense - Charles Lamb); ఇంగ్లాండులో Nonsense verse రాయడంలో కాలరిడ్జిని మించినవారు లేరు (విలియం హాజిట్) అతడి మూడు దయ్యాల కవితలు ప్రసిద్ధికెక్కినవి (హెరాల్డ్ బ్లూమ్)

ప్రకృతిలోని ప్రమాదకరమైన, భయపెట్టే రూపాల్ని

- Deep romantic chasm; Savage Place!

-Woman wailing for her Demon lover;

-Ceaseless turmoil seething; earth
in fast thick pants were breathing,
rebounding hail, threshers fail వంటి
పదబంధాలు అద్భుతంగా కనిపిస్తాయి.

అందుకే ఈ కవిత కాలరిడ్జి కవితలలో మార్మికమైన కవితగా ప్రసిద్ధికెక్కినది.

2. వృద్ధ నావికుడి గీతం

(The rime of the Ancient Mariner in Seven Parts)

సంగ్రహంగా– తుఫానులో చిక్కుకుని దారితప్పిన నౌక దక్షిణ ధృవపు శీతల దేశానికి చేరుకుని అక్కడ నుంచి పసిఫిక్ మహాసముద్రంలోని ఉష్ణ దేశానికి మరలినప్పుడు దారిలో సంభవించిన వింత సంఘటనలను, ఎలా ఆ నావికుడు తన దేశాన్ని చేరుకున్నాడో ఈ దీర్ఘకవిత వివరిస్తుంది.

మొదటిభాగం

అతడో వృద్ధ నావికుడు
అటుగా వెళ్తున్న ముగ్గురిలో ఒకరిని ఆపినాడు
–'పొడుగాటి నెరిసిన గడ్డం, మెరిసే కళ్లూ, ఓయీ!
ఎందుకని నీవు నన్ను ఆపుతున్నావు?'–

తెరచి ఉన్నాయి పెళ్లికొడుకు ఇంటి తలుపులు
నేను అతడికి దగ్గర బంధువును
వచ్చి ఉన్నారు అతిధులు, సిద్ధంగా ఉన్నది విందు.
వినవస్తున్నది సందడి, బాజా భజంత్రీలు' నన్ను వదులు ముందు!

చర్మపు ఎముకల చేత్తో ఆపినాడతడిని,–
–'అక్కడొక నౌక' –అన్నాడతడు నిశ్చయంగా
–ఆగు, నీ చేతులు తీయ్, నెరిసిన గడ్డం పిచ్చోడా!'–
వెంటనే తీసేసాడతడు తన చేతిని.

తన మెరిసే కళ్లతో ఆపాడతడిని–
పెళ్లికెళ్లే అతిధి నిలబడ్డాడు నిశ్చలంగా
మూడేళ్ల పిల్లాడిలా మూగగా వింటున్నాడు.
నావికుడతడిని తన వశం చేసుకున్నాడు.

పెళ్లికెళ్లే అతిథి కూర్చున్నాడో శిలపైన
వినడం తప్ప అతడికి లేదు వేరే దారి
చెప్పడం మొదలెట్టాడా వృద్ధ నావికుడు
మెరిసే కళ్లున్న ముసలి నావికుడు

–"కేరింతల మధ్య కదిలింది మా నౌక,
హార్బరును వదిలింక ఆగాము పలుచోట్ల,
గుడుల క్రింద, గుట్టల కింద,
దీపస్తంభపు శిఖరం కింద,

సూర్యుడిప్పుడున్నాడు మా ఎడమవేపున
సముద్రంలోంచి అతడు వచ్చాడు పైకి
వెలిగాడు కాంతితో, వెళ్లాడు కుడివేపు
సముద్రంలోకి అతడు వెళ్లాడు, లోనికి.

పైపైకి ప్రతిరోజూ పోతున్నాడు పైపైకి
తెరచాప కొయ్యపై మధ్యాహ్నానికి"–
పెళ్లికెళ్లే అతిథి, బాదుకున్నాడు ఛాతి
ఎందుకంటే, అతడు విన్నాడు పెళ్లిబాకా!

వధువు వచ్చింది చక్కగా వసారాలోకి
ఎర్రటి గులాబీలా ఎంత చక్కనిదామె
ఆమె ముందు పోతున్నారు తలలూపుకుంటూ
గలగలలాడ్తున్న వాయిద్యపు గాళ్లు

పెళ్లికెళ్లే అతిథి బాదుకున్నాడు ఛాతి!
వినడం తప్ప అతడికి లేదు వేరే గతి!
చెప్పడం మొదలెట్టాడా వృద్ధ నావికుడు
మెరిసే కళ్లున్న ముసలి నావికుడు.

“అప్పుడు వచ్చాడు ‘తుఫాను’, ప్రళయభీకరుడు,
క్రూరమైనవాడు, అతిబలవంతుడు,
విశాలమైన రెక్కలతో ఈడ్చికొట్టినాడు
దక్షిణం వేపు మమ్మల్ని తరిమికొట్టినాడు.

స్తంభాలను వంచుతూ, ముఖాన్ని ముంచుతూ
కేకలు పెడబొబ్బల్తో దెబ్బలు కొడుతూ
శత్రువు నీడలో ఇంకా నడుస్తూనే
తలవంచుకుని ముందుకు పోతున్నపుడు
వేగంగా పోతున్న నౌకను వెంటాడినాడు
పారిపోయాం మేము దక్షిణ దిక్కుగాను.

అప్పుడు వచ్చాయి పొగమంచూ, మంచుపులి,
ఆశ్చర్యంగా పెరిగింది అంతకంతకూ చలి.
తెరచాప స్తంభమంతెత్తు, ఎగుర్తూ వచ్చింది మంచు
ఎమరాల్డ్–మరకతంలా ఆకుపచ్చని అంచు.

హిమప్రవాహాలు, మంచు గుట్టలు
శూన్యపు కాంతిని పంపాయి మాకు
కానరాలేదు ఒక్క మనిషైనా, జంతువైనా
మంచు మైదానమే ఎక్కడ, ఎటు చూసినా!

ఇక్కడా మంచు, అక్కడా మంచు
చుట్టుపక్కలంతా చూడలేనంత మంచు
చిట్లినట్లు, గుర్రుమన్నట్లు; గర్జనలు, ఊళలు
మూర్ఛలో వినబడే రకరకాల శబ్దాలు!

ఎప్పటికో కానవచ్చింది అల్బట్రాస్ పక్షి ఒకటి
పొగమంచులోంచి పొడుచుకువచ్చింది
ఎవరో క్రైస్తవుడి ఆత్మలా అనిపించి మాకు
దేవుని పేరుతో జేజేలు పలికాము.

ఎప్పుడూ తినని ఆహారమది, చూసింది బాగా రుచి,
మా చుట్టూరా ఎగిరింది, ఎగిరింది గుండ్రంగా!
మంచు బద్దలైంది పిడుగు తగిలినట్లు
కర్ణధారి మమ్మల్ని నడిపించాడు రక్షణలోకి.

మా వెనుక వీచింది మంచి దక్షిణ గాలి
ఆల్బట్రాస్ మమ్మల్ని అనుసరించి వచ్చింది
ప్రతిరోజూ, ఆహారం కొరకు, ఆటలాడుకునేందుకు
నావికుల నౌకను గుహలాగా తలచింది.

మంచులో, మబ్బులో, స్తంభంపై, నిచ్చెనపై
సందెవేళ వరకు చక్కగా కూర్చునేది
రాత్రిపూట, తెలి మంచు పొగలో
వెన్నెలలా ఎంచక్కా మెరిసేది తెల్లగా!

“దేవుడు నిన్ను రక్షించునుగాక! వృద్ధ నావికుడా!
మోసగాళ్లనుంచీ, నిన్ను పీడించే వాళ్ల నుంచీ!
ఎందుకలా చూస్తావు?”– నేను నా విల్లూ బాణాలతో
నేలకూల్చాను ఆ అల్బట్రాస్ పక్షిని.

రెండవభాగం

ఇప్పుడు సూర్యుడు ఉదయించాడు కుడివేపు!
సముద్రంలోంచి వచ్చాడతడు
మంచుతెరల మధ్యనే ఇంకా దాక్కుని ఎడంవేపు
సముద్రంలోకి వెళ్లిపోయాడతడు.

మంచిదైన దక్షిణపు గాలింకా వీస్తూనే ఉండింది
కాని, ఏ పక్షీ మా నౌకను అనుసరించలేదెందుకని?
ఆహారానికైనా, ఆడుకోటానికైనా ఏరోజూ రాలేదు
నావికుల నౌకను గుహలాగా తలచి.

నేను చేసిందో పాపిష్ఠి పని, అని,
అందరినీ కష్టాలపాలు చేస్తుందని
నిశ్చయంగా అన్నారు వాళ్లు, నేను పక్షిని చంపడం,
దక్షిణపు గాలిని తెచ్చిన పక్షిని,
'ఓ క్రూరుడా!' అన్నారు వాళ్లు– 'నీవు చంపావు పక్షిని'–
దక్షిణపు గాలిని తెచ్చిన పక్షిని.

మసకగా కాదు, ఎర్రగా కాదు, దేవుడి హస్తంలా
కీర్తివంతుడైన సూర్యుడు పైకెగసినాడు
నిశ్చయంగా అన్నారు వాళ్లు, నేను పక్షిని చంపడం
పొగమంచును, మంచును తెచ్చినదానిని
అది న్యాయమే అన్నారు వాళ్లు, అటువంటి పక్షిని చంపడం
పొగమంచును, మంచును తెచ్చినదానిని.

చక్కటి గాలి వీచింది, తెల్లటి నురగ ఎగిరిపోయింది.
అడ్డంకులు లేని దారిలో స్వేచ్ఛగా
మేమే తొలిసారి అడుగుపెట్టాము విస్ఫోటనంగా,
ఆ నిశ్శబ్ద సముద్రంలోకి.

స్తంభించింది గాలి, ముడుచుకున్నాయిఇ తెరచాపలు
విచారమెంత ఉండగలదో అంత విచారమది.
మేం మాట్లాడుకునేది కేవలం,
ఆ సముద్రపు నిశ్శబ్దాన్ని భంగపరచేందుకే!

వేడెక్కిన రాగిలా లోహపు ఆకాశం
రక్తవర్ణపు సూర్యుడు, మిట్టమధ్యాహ్నం
తెరచాప స్తంభంపైన ఉగ్రప్రకాశం
చంద్రుడంత ఉన్నది అతగాడి పరిమాణం

దినం తర్వాత దినం, రోజు తర్వాత రోజు
మేం ఆగిపోయాం, ఊపిరాడదు, ఏదీ కదలదు
చిత్రించిన నౌకలా కదలకా మెదలకా
సముద్రపు చిత్రంపై స్తంభించిపోయాం.

ఇక్కడ నీళ్లు, అక్కడా నీళ్లు, ఎక్కడ చూసినా నీళ్లు
కొయ్య చెక్కలు కూడా కుంచించుకుపోయాయి.
నీళ్లు, నీళ్లు, ఎక్కడ చూసినా
తాగడానికి లేదు ఒక్క చుక్కయినా!

Water, water every where
And all the boards did shrink
Water, Water, every where
Not any drop to drink.

లోలోపల అంతా కుళ్లిపోయింది, ఓ క్రీస్తుప్రభువా!
ఎప్పటికీ ఇలానే ఉండేనా
చిన్నిచిన్ని జిగట పురుగులు కాళ్లతో పాకుతున్నాయి
జిగటగా ఉన్న సముద్రంపైన.

ఒళ్లు తిరిగి తూలి పడుతున్నట్లు
రాత్రుళ్లు మృత్యుకీలలు నాట్యమాడుతున్నట్లు
మంత్రగత్తె నూనెల్లా సముద్రపు నీళ్లు
ఆకుపచ్చ, నీలం, తెల్లగా మండుతున్నట్లు-

కొన్ని కలల్లో మాకు కనిపించేది
మమ్మల్ని పీడిస్తున్న మహా పిశాచమొకటి
తొమ్మిది నిలువుల లోతున అనుసరించేది
పొగమంచు, మంచు దేశాన్నుంచి, మమ్మల్ని.

దాహానికి ప్రతి నాలుకా పిడచకట్టుకు పోయింది
దాని మూలం వరకు వాడిపోయింది.
మాటలు పెగలని స్థితి, బొగ్గు మసి,
గొంతులో చేరినట్లు ఉక్కిరిబిక్కిరి.

హే! ప్రతిరోజూ! దుష్టపు చూపులు
చిన్నాపెద్దా నుంచి క్రూరంగా నావేపు;
శిలువకు బదులుగా అల్బట్రాస్ పక్షిని
వేలాడదీసారు నా మెడలో, శిక్షగా అని.
వేలాడదీసారు నా మెడలో చచ్చిన పక్షిని.

మూడవభాగం

అలసిపోయినట్లు కాలం గడచింది, ప్రతి గొంతూ
ఎండిపోయింది, ప్రతికన్నూ మసకబారింది
బడలిక కాలం! అలసట కాలం!
గాజులా ఉంది ప్రతి అలసిన కన్ను,
పడమటి దిక్కుకు చూస్తున్నపుడు,
నేను దేనినో చూసాను ఆకాశంలో!

ముందు కనిపించిందది ఒక మచ్చలా
తరువాత పొగమంచులా
అది కదిలింది, కదిలింది, చివరకు
ఒక ఆకారంగా మారింది, నేనెరిగినదే అది.

ఒక మచ్చ, పొగమంచు, ఆకారం, నేనెరిగినది
అది ఇంకా దగ్గరగా దగ్గరగా వచ్చింది
ఏదో నీటి భూతాన్ని తప్పించుకుంటున్నట్లు
ముందుకు దూకింది, తిరిగింది, వెనక్కి తిరిగింది.

ఎండిన నల్లటి పెదాలను, గొంతుల్ని సవరించుకుని
మేం నవ్వలేము, ఏడ్వలేము

దాహార్తితో మూగగా నిల్చుండి పోయాము.
నేను చేతిని కొరుక్కుని, రక్తాన్ని పీల్చి
అరిచాను. అదుగో పడవ, అదుగో పడవ!

ఎండిన నల్లటి పెదవులు, గొంతులు సవరించుకుని
నేను అరుస్తుంటే వాళ్లు చూసారు నోరు వెళ్లబెట్టి,
అయ్యో, అయ్యో! చిరునవ్వు నవ్వారు సంతోషంతో,
ఒక్కసారి గట్టిగా పీల్చుకున్నారు ఊపిరి.
అందరూ ఆనందంగా తాగుతున్నట్లు మరీమరీ!

చూడు! చూడు! (నేనరిచాను) తిరగడం లేదు ఓడ!
మనల్ని సుఖంగా చేరేందుకు;
గాలి లేదు, అలలూ లేవు
ఆమె ఆగి ఉంది, ఓడ పలక– కీల్, నిటారుగా!

పడమటి అల అంతా ఓ జ్వాల
ఆ రోజల్లా అలానే గడచింది
ఆ పడమటి అలపైనే
విశ్రమించాడు విశాల కాంతిసూర్యుడు.
అకస్మాత్తుగా ఆ వింత నౌక వచ్చింది
మాకూ, సూర్యుడి మధ్యకు

ఊచల మధ్య సూర్యుడు బంధింపబడినట్లు
(స్వర్గపు మాత మాకు కరుణను పంపినట్లు)
కటకటాల మధ్య నుంచి తొంగి చూస్తున్నట్లు
విశాలమైన జ్వలించే వదనంతో ఉన్నట్లు.

అయ్యో! (అనుకున్నాను నేను, బిగ్గరగా కొట్టుకుంది నా హృదయం)
ఎంత వేగంగా అది వస్తున్నది దగ్గరగా, దగ్గరగా
సూర్యకాంతిలో కనిపిస్తున్నవి ఆమె తెరచాపలా?
గాలిలో కొట్టుకుపోతున్న బూరుగు దూదిపింజలా?

అవి ఆమె పక్కటెముకలా, ఆ సూర్యుడు
తొంగి చూస్తున్న ఖైదు కటకటాలా?
ఏరీ ఆమె సిబ్బందీ, నావికులు?
అది మృత్యువా? లేక, అవి రెండా?
లేక, మృత్యువు ఆమె సహచరుడా?
Is that a Death? and are there two?
Is Death that Woman's mate?
ఆమె పెదాలు ఎరుపు, ఆమె చూపుల్లో స్వేచ్ఛామెరుపు
ఆమె శిరోజాలు బంగారు పసుపు
ఆమె చర్మం కుష్ఠులా తెలుపు
పీడకల, మృత్యువులోని జీవనం ఆమె
మనిషి రక్తాన్ని గడ్డకట్టిస్తుంది చలితోటి.

నగ్నంగా ఉన్న బలిష్ఠుడు ఆమె పక్కనున్నవాడు
ఇద్దరూ కలిసి విసిరినారు పాచికలు
'ఆట అయిపోయింది, నేను గెలిచాను, నేను గెలిచాను!'
అన్నదామె, ఈలవేసింది మూడుసార్లు.

సూర్యుడి అంచు మునిగింది, తారలు ప్రత్యక్షమైనాయి
ఒక్క అంగలో వచ్చింది చీకటి
సుదూరం వినబడే గుసగుసల్తో, సముద్రం మీదుగా,
పక్కగా దూసుకుపోయింది పిశాచపు నౌక.

మేం విన్నాం, చూసాం పక్కనా, పైకీ,
నా గుండెలో భయం, కప్పులో ఉన్నట్లు
నా జీవరక్తాన్ని రుచిచూస్తున్నట్లు
మసక మసక తారలు, దట్టంగా చీకటి
నౌకను నడిపేవాడి ముఖం, దీపకాంతిలో, మెరిసింది తెల్లగా!

తెరచాపల్నుంచి మంచు రాలింది చుక్కలుగా,
తూర్పు గడియపైన కొమ్ముల చంద్రుడు
తన శృంగాల మధ్యన,
ప్రకాశిస్తున్న నక్షత్రంతో పైకెక్కేదాకా!
ఒకదాని తరువాత ఒకటి, తారాసహిత చంద్రుడి రాక!
మూల్గడానికే, ముక్కడానికే సమయం చాలక
తమ ముఖాల్ని తిప్పుకున్నారు ఘోరమైన బాధతో
నన్ను తిట్టిపోసినారు అతడి నేత్రంతో.

రెండు వందల మంది బతికున్నవాళ్లు
(నేను వినలేదు ఏ మూల్గులూ ముక్కడాలూ)
పెద్ద శబ్దంతో, జీవం లేని ముద్దగా
ఒకరి తరువాత ఒకరు నేలకూలినారు.

వాళ్ల శరీరాల నుంచి ఆత్మలెగిరిపోయాయి.
ఆనందానికో, దుఃఖానికో అవి పారిపోయాయి
పోతున్న ప్రతి ఆత్మా నన్ను దాటిపోయింది
నా విల్లు మోగే విజ్‌జ్ శబ్దంతో!

నాల్గవభాగం

–"నిన్ను చూసి భయపడ్తున్నాను, వృద్ధ నావికుడా!
నీ ఎముకల చర్మపు చేయి చూసి భయపడ్తున్నాను.
నీవున్నావు పొడుగ్గా, బక్కగా, గోధుమరంగులో!
వరుసలుగా కనిపించే సముద్రపు ఇసుకలా!

నిన్ను చూసి, నీ మెరిసే కళ్లను చూసి భయపడ్తున్నాను
నీ ఎముకల–చర్మపు చేయి – గోధుమ వర్ణాన్ని చూసి"–
భయపడకు, భయపడకు పెళ్లికెళ్లే అతిథీ!
ఈ దేహం రాలిపడిపోదులే ఈ కాసేపటికే!

ఒంటరిగా, ఒంటరిగా, అంతా, అంతా ఒంటరిగా
ఒంటరిగా, ఆ విశాల విశాల సముద్రంలో
ఒక్క సాధువు కూడా దయచూపలేదు
నరకయాతనలో ఉన్న నా ఆత్మపై నాడు.

ఆ మనుషులంతా, ఎంతో అందమైనవాళ్లు
చనిపోయి అలా పడి ఉన్నారు.
వేలవేల జిగట పురుగులు
బతికాయి, అలాగే నేనూనూ.

నేను చూసాను కుళ్లిపోతున్న సముద్రం వేపు,
నా కళ్లను తిప్పుకున్నాను వేరేవేపు;
నేను చూసాను కుళ్లిపోతున్న నౌక వేపు,
చచ్చిన నావికుల శవాలున్న వేపు;

నేను చూసాను స్వర్గం దిక్కుకు, ప్రార్థించడానికి ప్రయత్నించాను
ఒక్క ప్రార్థన కూడా వెలువడలేదు నా గొంతు నుంచి
ఓ జిత్తులమారి గుసగుస వచ్చింది బయటకు,
నా హృదయాన్ని దుమ్ములా పొడిగా చేసింది.

మూసుకున్నాను కనురెప్పలు, మూసి ఉంచాను అలాగే
బంతుల్లా ఎగిసిపడుత్తూ కొట్టుకున్నాయి నాడులు.
నింగి నుంచి సముద్రానికి, సముద్రం నుంచి నింగికి,
నా అలిసిన కనులపై మోపాయి భారాన్ని,
నా కాళ్లవద్ద పడి ఉన్నారు మరణించిన నావికులు.

వారి అంగాల నుంచి కరిగి ప్రవహించింది చల్లటి చెమట
కుళ్లిపోలేదు, తూలిపోలేదు వాళ్లు
వాళ్లు నావేపు చూసిన చూపులు
ఎప్పుడూ తొలగిపోలేదు.

అనాథ శాపం లాక్కెళ్తుంది నరకానికి
ఎంతో ఎత్తునున్న ఆత్మను కూడా
అయితే, ఓహ్! దానికన్నా భయంకరమైనది
చచ్చినవాడి కంటిలోని భీకరశాపం
ఏడు పగళ్లు, ఏడు రాత్రులు, నేను చూసానా శాపాన్ని
అయినా చనిపోలేదు నేను.

కదుల్తున్న చంద్రిక నింగిపైకెక్కినది
ఎక్కడా ఆగకుండా పోతూనే ఉన్నది
నెమ్మదిగా ఆమె పోతూనే ఉన్నది
ఒక్కరో ఇద్దరో తారలతో కూడి.

ఆమె కిరణాలు వెక్కిరిస్తున్నాయి ఉక్కగా ఉండడాన్ని
ఏప్రిల్ నెలలోని బూడిద మంచు విస్తారాన్ని
ఎక్కడైతే ఓడ నీడ విశాలంగా పడి ఉందో
అక్కడ మంత్రజలాలు కాలిపోతాయి,
నిశ్శబ్ద భీకరపు ఎర్రరంగులో.

ఓడ నీడకు దూరంగా
నేను చూసాను నీటిపాముల్ని.
అవి కదుల్తున్నాయి మెరుస్తున్న తెల్లటి దారుల్లో.
అవి నిలబడినప్పుడు, చిన్న దయ్యపు కాంతి
పడిపోతున్నది బూడిదరంగు తునకలుగా.

ఓడ నీడలో నేను చూసాను
వాటి ఖరీదైన, నిండైన ఆహార్యాన్ని
నీలంగా, ఆకుపచ్చ అద్దంలా, వెల్వెట్ నలుపులా
మెలికలు తిరుగుతూ ఈదుతున్నాయి, ప్రతిదారీ
స్వర్ణకాంతి అగ్నుల తళుకులే మరి!

ఓ హాయిగా ఉన్న జీవులారా!
ఏ నాలుకా మీ అందాన్ని వర్ణించలేవు
నా హృదయం నుంచి ఉబికింది ప్రేమ జలధార
నాకు తెలియకుండానే నేను వాటిని ఆశీర్వదించాను.
దయగల సాధువు ఖచ్చితంగా నాపై కరుణించాడు
నాకు తెలియకుండానే నేను వాటిని ఆశీర్వదించాను.

అదే క్షణంలో నేను ప్రార్థించగలిగాను
నా మెడ స్వేచ్ఛగా కదలగలిగింది
ఆల్బ్రట్రాస్ నా మెడ నుంచి ఊడిపోయి
సీసంలా, సముద్రంలో పడి మునిగిపోయింది.

అయిదవ భాగం

ఓ నిదురా! ఇది చాలా సున్నితమైన విషయం
ధృవం నుంచి ధృవం వరకూ ప్రేమించబడుతుంది
మేరీ మహరాణికి పొగడ్త చెందుతుంది
ఆమె పంపింది స్వర్గం నుంచి మృదువైన నిదురను
ఆ నిద్ర ఆవరించినది నా ఆత్మను.

నౌక 'డెక్' పై భాగాన పడి ఉన్న బక్కెట్లు
చాలాకాలంగా అలానే ఉండిపోయాయి.
అవి మంచు బిందువులతో నింపబడినాయని కలగన్నాను.
మెలకువ వచ్చేసరికి వర్షంలో తడుస్తున్నాను.

నా పెదాలు తడిచినాయి, నా గొంతు చల్లబడింది
నా బట్టలన్నీ తడిచి ముద్దైనాయి
నా కలల్లోనే నేను తాగి ఉంటాను ఖచ్చితంగా
అయినా, నా శరీరం తాగింది ఇంకా, ఇంకా!

నేను కదలబోయాను, నాకు తగల్లేదు నా కాళ్లూ చేతులూ
నేను చాలా తేలికగా, – దాదాపుగా
నేననుకున్నాను నేను నిద్రలోనే చనిపోయానని
ఇప్పుడు, ఆశీర్వదించబడిన పిశాచాన్నని.

అంతలో విన్నాను హోరుమనే గాలిని
అదింకా రాలేదు నా దగ్గరకు
కాని దాని శబ్దానికి వణికాయి తెరచాపలు
పలచగా, వన్నెతగ్గిన వస్త్రాల పొరలు.

పైగాలి విస్ఫోటించి పోసుకున్నది ప్రాణం
వంద అగ్ని జెండాల కాంతితో
కిందకూ పైకి కదిలాయవి వేగంగా
కిందకూ, బయటకూ లోనికి
పాలిపోయిన తారలు నాట్యం చేస్తున్నాయి మధ్యలో

వస్తున్న గాలి శబ్దం చేసింది మరింత ఉధృతంగా
తెరచాపలు నిట్టూర్చాయి గడ్డిమొక్కల మడిలా
వర్షం కుండపోతగా కురిసింది ఓ నల్లమబ్బు నుంచి
చంద్రిక నిలబడింది దాని అంచు దగ్గర.

చిక్కటి నల్లని మేఘంలో చీలిక
అయినా, చంద్రిక ఉన్నది దాని ప్రక్కన
ఎత్తైన గుట్టమీద నుంచి పడుతున్న నీళ్లలా
విద్యుల్లత పడింది వంపులు లేకుండా
లోతైన, వెడల్పైన ఓ గొప్ప నదిలా!

హోరుగాలి ఓడను చేరనేలేదు,
అయినా నౌక కదిలింది ముందుకు!
మెరుపులు, చంద్రుడికి దిగువన
మృతుల నుంచి వెలువడిందొక మూలుగు

వాళ్లు మూలిగారు, కదిలారు, తిరగబడినారు
కాని మాట్లాడలేదు, కదిలించలేదు కళ్లను
స్వప్నంలో కూడా అది వింతగానే ఉన్నది
చచ్చిన వాళ్లు లేవడం చూడడమన్నది.

కర్ణధారి నడిపినాడు, కదిలింది నౌక
అయినా గాలి వీచిన జాడలేదు
నావికులందరూ ఎవరి పనిలో వాళ్లు నిమగ్నమైనారు
తాళ్లను లాగుతూ, నౌకను నడుపుతూ
జీవంలేని పనిముట్లు కదిలినట్లు వాళ్ల కాళ్లూ చేతులు
మేమందరం భీకరమైన నావికులం.

నా సోదరుడి కొడుకు దేహం
నా పక్కనే నిలబడింది మోకాలుకు మోకాలుగా
ఆ దేహం, నేనూ లాగాము ఒకే తాడు
కాని ఒక్క మాటకూడా నాతో మాట్లాడలేదు అతడు'–

"నిన్ను చూస్తే భయమేస్తున్నది, వృద్ధ నావికుడా!"–
ప్రశాంతంగా ఉండు పెళ్లికెళ్లే అతిథీ!
"ఆ ఆత్మలు బాధతో పారిపోలేదు
అవి మరల శవాల్లోకి దిగివచ్చాయి.
ఆశీర్వదించబడిన ఆత్మల దళం"

తెల్లవారేసరికి, వాటి పనిముట్లను పడవేసి
తెరచాప స్తంభం చుట్టూ గుమికూడినాయి గుంపుగా
వాటి నోటి నుండి శ్రావ్యమైన శబ్దాలు
వాటి శరీరాల నుండి వెళ్లిపోయాయి బయటకు.

చుట్టూ, చుట్టూరా ఎగిరింది ప్రతి శ్రావ్యమైన ధ్వనీ
తర్వాత దూసుకుపోయాయి సూర్యుడి వేపు

నెమ్మదిగా ఆ శబ్దాలు తిరిగి వచ్చాయి
మిశ్రమ స్వరాలుగా, ఒకదాని వెనక ఒకటి.

ఒక్కోసారి నింగి నుంచి కిందికి జారవిడిచినట్లు
నేను విన్నాను భరతపక్షి-లార్క్ పాట
కొన్నిసార్లు చిన్నిపక్షుల సవ్వడులు
అవి ఎలా నింగినీ, సముద్రాన్ని నింపేవో
వాటి మధురమైన కిలకిలా రావాలతో!

ఇప్పుడు అనేక వాయిద్యాల సమ్మేళనంగా
ఇప్పుడు ఒంటరి వేణు నాదంగా
ఇప్పుడు ఓ దేవదూత గానంగా
స్వర్గాన్ని నిశ్శబ్దపరచే సంగీతంగా!

అది ఆగిపోయింది, అయినా తెరచాపలు
మధ్యాహ్నం వరకూ చేస్తూనే ఉన్నాయి మధుర ధ్వనులను.
ఎక్కడో దాగిఉన్న సెలయేరు శబ్దిస్తూ,
జూన్ నెలలో, ఆకుల గలగలలతో,
రాత్రంతా నిద్రపోయే ఆరణ్యాలకు,
ప్రశాంతమైన స్వరంతో పాడుతున్నట్లు...

మధ్యాహ్నం వరకూ మేం పయనించాము ప్రశాంతంగా
అయినా కాసింత గాలికూడా నిశ్వసించలేదు.
నెమ్మదిగా మృదువుగా నడచింది నౌక
కిందనుంచి ఎవరో నడుపుతున్నట్లు ముందుకు.

ఓడ అడుగు-కీల్‌కు తొమ్మిది నిలువుల లోతైన
పొగమంచు, మంచుల దేశాన్నుంచి
కదిలివచ్చిందొక పెనుభూతం. అదే నడిపింది.

నౌకను ఇంతసేపూ ఇంతదూరం.
మధ్యాహ్నం తెరచాపలు వదిలిపెట్టాయి గాలిని
నౌక ఆగిపోయింది అక్కడే నిశ్చలంగా.

సూర్యుడు నడినెత్తిన స్తంభంపైన
బిగించాడు ఆమెను నడి సంద్రానికి నౌకను.
కాని మరునిముషంలో ఆమె కదిలింది కొద్దిగా
చిన్ని చిన్ని కదలికలతో కదిలింది ఆమె
వెనక్కీ ముందుకూ తన పొడుగులో సగమంత
చిన్నిచిన్ని కదలికలతో కదిలింది ఆమె.

అప్పుడు ఒక్కసారిగా గుర్రంలా ఉరికింది ముందుకు
అకస్మాత్తుగా వేగంగా దాటింది ముందుకు
అది విసిరింది రక్తాన్ని నా శిరసులోకి
నేను పడిపోయాను కిందకు పెద్దశబ్దంతోటి

ఎంతసేపు నేనలానే పడి ఉన్నానో
నాకు తెలియదు కనుక నేను చెప్పలేను.
అయితే, ఇక్కడే నాకు తిరిగివచ్చింది జీవం.
నేను విన్నాను, నా ఆత్మ గ్రహించింది
గాలిలో వినబడిన రెండు స్వరాలను.

'అతడేనా' – ఒక గొంతు అన్నది, 'ఈ మనిషి?'
ఇతడి కోసమే శిలువపై చనిపోయినాడతడు–
–'తన క్రూరమైన విల్లూ బాణంతో నేలకూల్చినవాడు,
అపాయరహితమైన అల్బట్రాస్‌ను?'

ఆ ఆత్మ తనను తాను
పొగమంచు, మంచు దేశాల్లో నిలుపుకున్నది.

మనిషిని ప్రేమించిన, పక్షిని ప్రేమించినాడతడు
ఈ మనిషి విల్లూ బాణంతో కూల్చినాడు పక్షిని'–

రెండవది మృదువైన గొంతు
తేనె బిందువులంత మెత్తనైనది
ఆ గొంతు పలికింది– 'ఇతడు పశ్చాత్తాపపడినాడు.
ఇంకా మరికొంత చేయగలడు, పాప పరిహారం.

ఆరవ భాగం

మొదటి గొంతు–
'అయితే చెప్పు, చెప్పు! మరలా వివరించు.
నీ మృదువైన సమాధానాన్ని కొనసాగించు
ఏది ఆ నౌకను అంత వేగంగా నడిపింది?
ఆ సముద్రం అప్పుడు ఏమి చేస్తున్నది?

రెండవ గొంతు–
"తన ప్రభువు ముందు సేవకుడిలా
సముద్రమప్పుడు చెలరేగలేదు
అతడి ప్రకాశవంతమైన నేత్రం నిశ్శబ్దంగా
చంద్రికవేపు చూస్తూనే ఉన్నది.

ఎటుపోవాలో అతడికి తెలిసేట్లు చేస్తుంది
ఆమె నడిపిస్తుందతడిని మృదువుగా, కర్కశంగా
చూడు, సోదరుడా, చూడు! ఎంత సొగసుగా
అతడి వేపు చూస్తున్నదో ఆమె దిగువకు"

తొలిగొంతు–
"అయితే ఎవరు ఆ నౌకను వేగంగా నడిపింది,
పెద్ద అలా లేదు, కాస్త గాలీ లేదు?"

రెండవ గొంతు–
–'ముందు వేపు గాలి కోసివేయబడినది
వెనుక నుంచీ అది మూసుకు వచ్చింది'–

ఎగిరిపో సోదరుడా, ఎగిరిపో, పైపైకి!
లేకుంటే, మనకు చాలా ఆలస్యమయ్యేను.
నెమ్మదిగా, నెమ్మదిగా వెళ్లిపోయే ఈ నౌక.
ఈ నావికుడి మరపు పోయేంతలోపుగా!

నేను నిద్రలేచాను, చక్కని వాతావరణాన
ప్రయాణిస్తున్నాము మేము ప్రశాంతంగా!
అది రాత్రి, ప్రశాంతమైన రాత్రి, పైన చంద్రిక
చనిపోయినవాళ్లు నిలబడి ఉన్నారు గుంపుగా!

అందరూ నిలబడినారు గుంపుగా 'డెక్' పైన
శవాలను పెట్టే నేలమాళిగ కోసం
వాళ్ల రాతి కళ్లన్నీ స్థిరపడినాయి నామీద
వెన్నెలలో అవి తళుక్కుమంటున్నాయి.

ఆ బాధ, ఆ శాపం దేనితో వాళ్లు మరణించారో
అది వారిని విడిచివెళ్లలేదు ఎప్పటికీ,
వారి కళ్ల నుంచి తిప్పలేకపోయాను నా కళ్లను
వాటిని మళ్లించలేకపోయాను ప్రార్థన వేపు.

ఇప్పుడు తెగిపోయింది ఈ మంత్రశక్తి.
మరొక్కసారి సముద్రం ఆకుపచ్చగా మారింది.
వీలైనంత దూరం చూసాను నేను,
ఇంతకు మించి కనిపించలేదు నాకేమీ.

ఒంటరి దారిలో ఒక్కడినే నడుస్తున్నప్పుడు
భయమో, భయంకరమైనదో మనసులో మెదిల్తే
ఒకసారి వెనక్కి తిరిగి నడవడం మొదలెట్టాక
మరల అటు తిరగాలనిపించదు తలకు!
అతడికి తెలుసు, ఏదో భయంకర పిశాచి
అతడికి దగ్గర్లోనే నడయాడుతుందని.

అయితే, ఇంతలోనే వీచింది కాస్త గాలి!
శబ్దమూ, కదలికా లేని గాలి
సముద్రం మీదకు కాదు దాని దారి
అలలలోకీ కాదు, నీడలోకీ కాదు.

అది నా జుట్టును లేపింది, నా బుగ్గలను తడిమింది.
వసంతకాలంలో మైదానంలో వీసే మరీచికల్లా
అది నా భయాల్తో కలిసిపోయింది వింతగా,
అయినా, అది నాకు స్వాగతం పలుకుతున్నట్లనిపించింది.

వేగంగా, వేగంగా సాగింది నౌక
అయినా, అది నడిచింది మృదువుగా
మధురంగా, మధురంగా వీచింది గాలి
నా ఒక్కడి మీదనే విసిరింది మెల్లగా.

ఓహ్! ఆనందపు స్వప్నమా! ఆ కనిపించేది
దీపస్తంభపు పైభాగమేనా! ఇది కలా, నిజమా!
అది కొండ గుట్టేనా, అది చర్చి-దేవాలయమేనా!
నీ నా స్వంత దేశమేనా?

మేం నెమ్మదిగా చేరుకున్నాము నౌకాశ్రయము
వెక్కిళ్లు పడుతూ ప్రార్థించాను నేను-
నన్ను మెలకువలో ఉంచు, దేవుడా!
లేదా, నన్ను నిద్రలోనైనా ఉంచు ఎల్లప్పుడూ!

ఆ అఖాతం ఉంది అద్దంలా స్పష్టంగా,
ఎంతో మృదువుగా అమర్చబడి అందంగా,
వెన్నెలలో కనిపిస్తున్నదా నౌకాతీరం
చంద్రుడి నీడ కూడా స్పష్టంగా కనిపిస్తున్న వైనం.

రాతిగుట్ట వెలుగుతోంది ప్రకాశవంతంగా, చర్చి కూడా
ప్రకాశిస్తున్నదా రాతిగుట్టపైన
అనేక రకాల రూపాలలో కనిపిస్తున్నాయా నీడలు
రక్తవర్ణంలో కనిపిస్తున్నాయి వాటి జాడలు.

ఓడ ముందు భాగానికి కాస్త దూరంలో
ఉన్నాయి ఈ రక్తవర్ణపు నీడలు.
నేను నా కనులను మరల్చాను డెక్ వేపు
ఓ క్రీస్తుప్రభూ! ఏం చూసాను అక్కడ నేను?

ప్రతి శవమూ అక్కడ జీవరహితంగా పడి ఉన్నది.
వాటి పక్కనే ఉన్నది పవిత్రమైన శిలువ!
అంతా వెలుగున్న ఓ మనిషి, సెరాఫ్–మనిషి
ప్రతి శవం పక్కనే ఉన్నారు నిలబడి.

సెరాఫ్ దళమంతా ఊపుతున్నారు చేతుల్ని.
అదొక స్వర్గతుల్య దృశ్యం.
నేలపై సూచికల్లా నిలబడ్డారు వాళ్లు
ప్రతి ఒక్కరూ ఒక అందమైన దీపం.

సెరాఫ్ దళమంతా ఊపుతున్నారు చేతుల్ని
ఏ గొంతుకూ వారు భాగమివ్వలేదు.
ఏ గొంతూ, ఓహ్! అయినా, నిశ్శబ్దం
నా హృదయంలో మునిగింది సంగీతంలా.

వెంటనే విన్నాను నేను తెడ్లు కదిలిన చప్పుడును
నేను విన్నాను నౌకాశ్రయపు అధికారి చిరునవ్వును
తప్పనిసరిగా నా తలను అటువేపు తిప్పాను.
నేను చూసాను ఒక పడవ అటుగా రావడాన్ని.

ఆ అధికారి, అతడి సేవకుడు
వేగంగా రావడం గమనించాను నేను.
స్వర్గంలో ఉన్న ప్రభువా! ఈ సంతోషాన్ని
చచ్చినవాళ్లు కూడా పగలగొట్టలేరు.

నేను చూసాను మూడవవాడిని– విన్నానతడి గొంతును
అతడు మంచి క్రైస్తవ సన్యాసి.
దేవుడి కీర్తనలనతడు గానం చేస్తాడు బిగ్గరగా
తాను అడవుల్లో తయారుచేసిన వాటిని!
అతడు నా ఆత్మను శుద్ధిచేస్తాడు, కడిగివేస్తాడు
అల్బట్రాస్ రక్తాన్ని.

ఏడవ భాగం

ఆ మంచి క్రైస్తవ సన్యాసి నివసిస్తాడు అడవుల్లో,
సముద్రంలోకవి ఉంటాయి ఏటవాలుగా,
తన మధురమైన గొంతును బిగ్గరగా వినిపిస్తాడు.
అతడు నావికులతో సంభాషణను ఇష్టపడతాడు
సుదూర దేశాల నుంచి వచ్చిన వాళ్లతో–

మోకాళ్లపై నిలబడి ప్రార్థిస్తాడు ఉదయ, మధ్యాహ్న, సాయంకాలాలూ
బొద్దుగా ఉన్న మెత్తపై కూర్చుంటాడు
ఆ తడి పొడి నేలలో పెరిగే మొక్క దాస్తుంది పూర్తిగా
పాడైపోయిన పాత ఓక్ చెట్టు మొదలును.

ఆ చిన్ని పడవ వచ్చింది, వాళ్ల మాటలు నేను విన్నాను.
"ఏమిటి, ఇది వింతగా ఉన్నదే, నేను నమ్మను!
ఆ అందమైన, బోలెడన్ని దీపాలేమైనాయి,
సూచనలిచ్చేవి ఇప్పుడెక్కడ?"-

"వింతగా ఉందే" -అన్నాడు సన్యాసి- "మాకు జవాబు చెప్పలేదవి".
చెక్కలపై ఏదో కప్పబడినట్లు, ఆ తెరచాపల్ని చూడు
ఎంత పలుచగా ఉన్నాయో వన్నె తగ్గి!
అటువంటివి చూసే అవకాశమే నాకెప్పుడూ రాలేదు"-

గోధుమవర్ణపు ఆకుల ఆనవాళ్లు పోతుంటాయి
అస్థిపంజరాల్లా, మా అడవి సెలయేరులందు.
ఇవి పొగ మంచుతో కప్పబడి బరువుగా ఉన్నపుడు
పిల్లగుడ్లగూబ అరుస్తుంది కిందనున్న తోడేలుకు
అది ఆడతోడేలు కూనల్ని తినేందుకు.

దేవుడా! దానికి పిశాచపు రూపున్నది-
అధికారి సమాధానమిచ్చినాడు
'నాకు భయం వేస్తున్నది' -కానీ, కానీయ్
అన్నాడు క్రైస్తవ సన్యాసి ఉత్సాహంగా.

పడవ వచ్చింది నౌకకు దగ్గరగా
అయినా నేను మాట్లాడలేదు, కదలలేదు
పడవ వచ్చింది నౌకకు దిగువగా, దగ్గరగా
వెంటనే వినబడింది పెద్దగా ఒక గొంతు.

నీటి అడుగున అది శబ్దిస్తూ ఉన్నది,
ఇంకా బిగ్గరగా, మరింత భయంకరంగా.
అది ఓడను చేరుకున్నది, అఖాతాన్ని చీల్చింది
నౌక, సీసపు గుండులా మునిగిపోయింది.

ఆ భయంకరమైన భీకర శబ్దానికి
అదిరిపోయాయి ఆకాశమూ, సముద్రాలు.
ఏడురోజులు మునిగిన శవంలా
నా దేహం తేలియాడింది నీటిపై
కలల్లా వేగంగా నన్ను నేను కనుగొన్నాను
అధికారి పడవలో ఉన్నాను పడుకుని.

నౌక మునిగిన చోట, సుడిగుండపు పైన
పడవ తిరిగింది, గుండ్రంగా, గుండ్రంగా.
అంతా స్తంభించింది, ఒక్క ఆ కొండగుట్ట తప్ప
అది చెబుతున్నట్లున్నది ఆ శబ్దం గురించి.

నేను కదిలించగానే పెదాలు, కేకబెట్టి
అధికారి కింకవచ్చి పడిపోయినాడు.
క్రైస్తవ సన్యాసి కళ్లు పైకెత్తి
తన కూర్చున్న చోటునే చేసాడు ప్రార్థనలు.

నేను తెడ్లను పట్టుకునేసరికి, అధికారి సేవకుడు
అడ్డం పడ్డాడు, పిచ్చెక్కినవాడిలా బిగ్గరగా నవ్వాడు
నవ్వినంత సేపూ అటూయిటూ తిరిగాయతగాడి కళ్లు.
'ఆహా!హా!' అన్నాడతడు – నేను చూస్తున్నా స్పష్టంగా,
దయ్యానికి తెలుసు పడవనెట్లా నడపాలో!
'The Devil knows how to row'

అప్పుడు, నా స్వంత దేశంలో
నా గట్టినేలపై నిలబడ్డాను నేను!
సన్యాసి పడవ దిగినాడు, కాని
నిలబడలేకపోయినాడు, కాసేపైనా సరిగా!

“ఓ, పవిత్ర సాధుమూర్తీ, నన్ను కాపాడు, నన్ను కాపాడు”
క్రైస్తవ సన్యాసి చేతుల్తో చేసాడు శిలువ సంజ్ఞను.
“త్వరగా చెప్పు” అన్నాడతడు – ‘ఇది నా ఆజ్ఞ’.
“ఎటువంటి తరహా మనిషివి నీవు?”

అప్పుడు నా ఈ రూపం వంగిపోయింది
అంతులేని మానసిక వ్యధతో
అతడికి చెప్పాను నా కథ యావత్తూ
అప్పుడు నా బాధ వదిలిపోయింది నన్ను.

అప్పటి నుంచి, నిర్దేశితం కాని ఓ ఘడియలో
ఆ వ్యధ మరల నాలోకి వస్తుంది
ఇంకెవరికైనా ఈ కథ చెప్పేవరకూ
నాలోని నా హృదయం కాలిపోతుంది.

రాత్రిలా, వెళ్తుంటాను ఒకచోటు నుంచి ఇంకో చోటుకు,
నాకున్నది మాట్లాడగలిగే అద్భుత వింత శక్తి.
నేనెవరి ముఖంలోకైనా చూస్తే చాలు.
నాకు తెలుసు అతడు నాకథ వినక తప్పదని.

ఎటువంటి ఘోష వెలువడ్తున్నదా తలుపు నుంచి?
వివాహానికి వచ్చిన అతిధులరుగో,
తోటలోని పొదరింటిలో
వధువు, ఆమె చెలులు చేస్తున్నారు గానం.
విను, సాయంకాలపు చిన్ని గంటలచప్పుడును
అవి నన్ను రమ్మంటున్నాయి ప్రార్థనకు.

ఓ పెళ్లికెళ్లే అతిధీ! ఈ ఆత్మ ఉండినది
ఒంటరిగా విశాలమైన, విశాలమైన సముద్రాన
ఎంతో ఒంటరిగా ఉండినది, దేవుడు కూడా
అక్కడ లేనట్లు ఉండేవాడనిపించేలా!

వివాహపు విందుకన్నా మధురమైనది
ఇది ఎంతో మధురమైనది
చర్చికి కలిసి వెళ్లడం
మంచి సహవాసంతో–

కలిసివెళ్లడం చర్చికి,
వెళ్లి సమూహంగా ప్రార్థించడం,
ప్రతి ఒక్కరూ ఘనుడైన తండ్రి ముందు మోకరిల్లడం
వృద్ధులు, పసిపిల్లలు, ప్రేమించే స్నేహితులు,
ఉల్లాసపు యువతీ యువకులు అందరూ కలిసి!

వీడ్కోలు, వీడ్కోలు, ఇది నీకు చెబుతున్నాను
ఓ పెళ్లికెళ్లే అతిథీ, నీకు వీడ్కోలు!
ఎవరైతే ప్రేమిస్తారో, వారే బాగా ప్రార్థిస్తారు.
మనిషినీ, పక్షినీ, జంతువునూ, అందరినీ.

ఎవరైతే బాగా ప్రార్థన చేస్తారో, అతడే బాగా
ప్రేమిస్తాడు చిన్నా పెద్దా అన్నిటినీ, అన్ని విషయాలనూ,
ఆ భగవానుడు మనల్ని ప్రేమిస్తున్నట్లు,
ఆ దేవుడే సృజించినాడు, అందరినీ ప్రేమిస్తున్నాడు"–

ఆ నావికుడు, ఎవరి నేత్రం ప్రకాశవంతంగా ఉన్నదో
ఎవరి గడ్డం వయసుతో నెరిసిందో, అతడు వెళ్లిపోయినాడు.
ఇప్పుడు వివాహానికొచ్చిన ఆ అతిథి
వరుడి తలుపు వేపు నుంచి తిరిగినాడు.

ఏదో మైకం కమ్మిన వాడిలా,
ఏదో దీన స్థితిలో ఉన్నవాడిలా వెళ్లినాడు,
మరింత విచారంగా, మరింత జ్ఞానాన్ని సంపాదించినవాడైనాడు.
అతడు రేపటి దినానికి శుభోదయం పలుకుతాడు.

✧✧✧✧✧

Notes : The Rime of the Ancient Mariner - వృద్ధ నావికుడి గీతం – శామ్యూల్ టేలర్ కాలరిడ్జి (1772–1834) వ్రాసిన ఏడు భాగాల దీర్ఘకవిత. 1797–98 ప్రాంతంలో వ్రాయగా 1798లో Lyrical Ballads పుస్తకంలో ప్రచురింపబడింది. కాల్పనిక కవిత్వం వేపు (భావవాదానికి–Romantic Movement) ఈ కాలంలోనే కవిత్వపు దారి మళ్లించబడినది.

విలియం వర్డ్స్‌వర్త్ కథనం ప్రకారం ఈ కవితకు అంకురార్పణం, తాను, డోరతి, కాలరిడ్జి క్వాంటాక్ గుట్టల్లో (సోమర్‌సెట్)- 1798 వసంతకాలంలో విహారానికి పోయినప్పుడు, తాను చదువుతున్న పుస్తకం– George Shevlocke వ్రాసిన A Voyage round the world by way of the great South sea (1726) – కాలరిడ్జికి ఇవ్వగా దానిని చదివిన కాలరిడ్జి ఈ కవితను వ్రాసాడంటాడు. షెవ్లాక్ పుస్తకంలోనూ Simon Hatley అనే నావికుడు నల్లటి అల్బట్రాస్‌ను చంపుతాడు.

ఈ కవితకు John Newton వాస్తవ జీవితచరిత్ర ఆధారమని, Bernard Martin, Wandering Jew లేదా Flying Dutchman కారణమని కొందరు విమర్శకులు పేర్కొన్నారు.

625 పంక్తులు, ఏడు భాగాలున్న ఈ దీర్ఘకవిత మృత్యువును, పశ్చాత్తాపాన్ని, దేవునికై అన్వేషణను అన్యాపదేశంగా వివరిస్తుంది. ప్రాచీన వీరగాథల్నుంచి తీసుకున్న ఇతివృత్తాన్ని కాలరిడ్జి ఎంతో సమర్థవంతంగా, ఒళ్లు గగుర్పొడిచే సంఘటనలతో, పదవైచిత్రితో, అద్భుత కథా సంవిధానంతో దీర్ఘకవితగా మలచినాడు.

తమకు దారిచూపి, తమతోపాటు నివసించిన అల్బట్రాస్ పక్షిని చంపడం, కష్టాలపాలై శిక్షగా చచ్చిన పక్షిని మెడలో వేలాడేసుకుని తిరగాల్సిరావడం, ఉన్మత్తత, మృత్యువు, మానవుడు చేసే పాపాలు, వాటి వలన అనుభవించే కష్టాలు, పశ్చాత్తాపంతో విముక్తుడు కావడం ఈ కవితలోని ముఖ్య కథాంశాలుగా చదువరుల్ని మంత్రముగ్ధుల్ని చేస్తాయి.

3. నిరుత్సాహం : గేయకావ్యం

(Dejection : An Ode)

ఆలస్యంగా, నిన్న చాలా ఆలస్యంగా, నేను చూసాను నెలవంకను,
తన చేతుల్లో వృద్ధ చంద్రుడి నిడుకొని,
నాకు భయమేస్తున్నది, నాకు భయమేస్తున్నది, ప్రియమైన యజమానీ!
రాబోతున్నది మనకో భయంకరమైన తుఫాను.

– సర్ పాట్రిక్ స్పెన్స్ – వీరగాథ
(Ballad of Sir Patrick Spence)

I

బాగు బాగు! ఈ కవిగాయకుడు వాతావరణం తెలిసినవాడు
సర్ పాట్రిక్ స్పెన్స్ వీరగాధను రచించినవాడు;
ఈ రాత్రి, ఎంతో ప్రశాంతంగా ఉన్నదిప్పుడు, వెళ్లిపోదు
గాలులతో ప్రేరేపించబడకుండా, తీరికలేని వ్యాపారంతో అవి
మబ్బులను సోమరి మంచు తునకల్లా చేసే వాటికన్నా మెరుగే.
లేదా హుషారు లేని ఏడుపుగొట్టు రాత, ముక్కుతూ మూలుగుతూ
ఎవొలియన్ వీణా తంత్రులపై ధ్వనించే పాటలకన్నానూ!
వీటికన్నా నిశ్శబ్దం మరింత మేలైనది.
అహో! చూడు! శిశిరపు కొత్త చంద్రిక ఎలా ప్రకాశిస్తున్నదో!
మాయా దివ్యకాంతి అధికంగా వ్యాపించగా
(ఈదుతున్న వెండి వెన్నెల బహుళంగా విస్తరించి
వెండి దారంతో వలయంగా అంచు నేర్పరచినది)
నేను చూసాను పాత చంద్రికను ఆమె ఒడిలో, జోస్యం
చెబుతున్నది రాబోయే వర్షాన్ని, పెనుగాలుల ఉధృతాన్ని.
ఓహ్! ఇప్పుడు కూడా పెనుగాలి పెట్రేగుతున్నది.

వాలుగా కురుస్తున్న రాత్రి జల్లు బిగ్గరగా వేగంగా వస్తున్నది
ఆ శబ్దాలు నన్ను తరచుగా ఉత్తేజపరచేవి,
నన్ను ఆశ్చర్యంతో నింపి, నా ఆత్మను పరదేశాలకు పంపేవి.
ఇప్పుడు బహుశా వాటికి అలవాటైన ప్రచోదన ఇస్తాయేమో,
ఈ బాధను ఆశ్చర్యపరచి, జీవాన్నిచ్చి ముందుకు కదిలిస్తాయేమో!

II

ఒక నెప్పిలేని దుఃఖం, శూన్యం, అంధకారం, విషాదభరితం
ఒక బలహీనపు, మగతలో ఉన్న, ఉద్రేక శూన్య దుఃఖం.
దానికి లేవు సహజసిద్ధమైన బాహ్య మార్గాలు, ఉపశమనాలు
మాటల్లో, నిట్టూర్పుల్లో, లేదా కన్నీళ్లలో-
ఓ యువతీ! ఇటువంటి పాలిపోయిన, హృదయం లేని
మానసిక స్థితిలో,
ఇతర ఆలోచనలను ఎలా ఆకర్షిస్తావు
దూరాన ఉన్న థ్రొసిల్-పాటల పిట్టతో.
ఈ దీర్ఘ సాయంకాలం మృదువుగా ప్రశాంతంగా ఉన్నది.
పశ్చిమ ఆకాశం వేపు చూపు నిలిపినప్పుడు
దాని ప్రత్యేకమైన పసుపు ఆకుపచ్చ ఛాయను
నేనింకా చూస్తూనే ఉన్నాను- ఖాళీగా ఉన్న ఈ నేత్రంతో!
ఎగువన ఉన్న పలుచని మేఘాలు, తునకలుగా, అడ్డపు కమ్మీలుగా
తమ కదలికలను తారలకిచ్చినట్లు,
ఆ నక్షత్రాలు వాటికి వెనకో ముందో జారుతున్నట్లు,
ఇప్పుడు మెరుస్తూ, ఇప్పుడు మసకబారుతూ, అయినా
ఎప్పటికీ కనిపిస్తూ
ఓ నెలవంకా, స్థిరంగా ఉండి వృద్ధి చెందుతున్నట్లు
మబ్బులు లేని, నక్షత్రాలు లేని నీ స్వంత నీలి సరస్సులో నీవు.
ఎంతో అందంగా ఉన్న వీటన్నిటినీ చూస్తున్నాను నేను.
స్పృశించకుండానే, నేను చూస్తున్నాను, ఎంత అందంగా ఉన్నాయో అవి!

III

నా ఉల్లాసపు ప్రాణాలు ఉపేక్షించినవి
ఏది వీటిని వినియోగిస్తుంది నన్ను ఉక్కిరి బిక్కిరి చేస్తున్న
హృదయపు భారాన్ని తొలగించేందుకు?
అది ఒక వృధా ప్రయత్నం.
నేను ఇలా శాశ్వతంగా దృష్టి నిలిపి చూస్తున్నాను
పశ్చిమ దిక్కున్న తారాడే ఆ ఆకుపచ్చని కాంతిని
నేను ఆశించబోను, బాహ్యరూపాలు గెలుచుకుంటాయని,
ఉద్వేగాన్ని, నా జీవితాన్ని, వాటి నీటిఊటలు ఉన్నాయి నాలోపలనే!

IV

ఓ యువతీ! మనమేమిస్తామో వాటినే తీసుకుంటాము.
మన జీవితంలోనే ప్రకృతీ జీవిస్తుంది.
మన జీవితమే దాని వివాహ వస్త్రం, దాని పార్థివ దేహంపై కప్పే శ్వేతవస్త్రం
మనం ఉన్నతమైన విలువలకై అపేక్షిస్తాము,
దాని శీతల నిశ్చల ప్రపంచం అనుమతించే దానికన్నా
ప్రేమరహిత నిరుపేద శాశ్వత వ్యాకులపు సమూహానికి;
ఆహ్! ఆత్మనుంచే విడుదల కావాలి,
ఒక వెలుగు, ఒక కీర్తి, ఓ ప్రకాశించే అందమైన మేఘం
ఈ భూమిని చుట్టి ఉండేది–
ఆ ఆత్మ నుంచే పంపబడాలి
మధురమైన శక్తివంతమైన స్వరం, దాని పుట్టుక కూడా,
జీవితపు, మూలము యొక్క అన్ని మధురమైన శబ్దాలు నిండినది.
A sweat and a potent voice, of its own Birth
of all sweet sounds the life and element.

V

ఓ హృదయపు స్వచ్ఛదనమా! నీవు నన్నడగనక్కరలేదు
ఈ ఆత్మలోని గాథ సంగీతమెక్కడిదని!
ఏమిటి, ఎక్కడ దాని ఉనికి అని!
ఈ కాంతి, ఈ కీర్తి, ఈ అందమైన ప్రకాశపు పొగమంచు
ఈ సౌందర్యం, ఈ అందాన్ని తయారుచేసే శక్తి
        ఆనందించు, శీలవతీ! ఎప్పుడూ ఇవ్వని ఆనందాన్ని.
స్వచ్ఛతకై దాచి ఉంచు, వాటి స్వచ్ఛమైన ఘడియలో
జీవితం, జీవితపు బహిఃప్రసరణాకాంతి, మేఘంలా వర్షించనీ
        ఆనందించు యువతీ! ఆనందమే శక్తీ, ప్రాణమూ!
ఏ వివాహాన్నైతే ప్రకృతి మనకు వరకట్నంగా ఇచ్చిందో
        ఆ కొత్త భూమిని, నూతన స్వర్గాన్ని,
గర్విష్ఠులు, ఇంద్రియాసక్తులు స్వప్నించలేని వాటిని!
ఆనందమనేది మధురస్వరం, అది తేజోమయమైన మేఘం.
        మనం మనలో పొందే పారవశ్యం!
అప్పుడు ప్రవహిస్తాయి కనులను, వీనులను ముగ్ధులను చేసే వశీకరణాలు
        అన్ని మధురస్వరాలు ప్రతిధ్వనిస్తాయి ఆ గొంతులో,
ఆ లోపల కాంతి నుంచే ప్రవహిస్తాయి అన్ని రంగులూ బయటకు.

VI

ఒక కాలముండేది, అప్పుడు, నా దారి ఎంతో దుర్గమంగా,
ఈ ఆనందం నాలోనే నిరాశతో నాట్యం చేసేది.
అన్ని దురదృష్టాలూ కట్టకట్టుకుని వచ్చినా
నా ఊహాప్రపంచం నాకు సంతోషపు స్వప్నాలనిచ్చేది.
ఎందుకంటే ఆశ నా చుట్టూ పెరిగినది, చుట్టుకునే తీగెలా,
పళ్లూ, ఆకులూ, నా స్వంతం కానివి, నావిలా అనిపించేవి.
కాని, ఇప్పుడు నన్ను అనేక కష్టాలు నేయ నమస్కరించేట్లు చేసినవి.

అవి నా ఆనందాన్ని దోచుకున్నా నేను లెక్క చేయను, కాని,
కాని, ఓహ్! ప్రతి అధికారిక సందర్భనా
ప్రకృతి నాకు నేను పుట్టినప్పుడు ఇచ్చిన వాటిని
తాత్కాలికంగా ఆపివేస్తుంది–
నా ఊహలకు రూపమిచ్చే ప్రాణశక్తిని,
నాకు కావాల్సినవాటిని నేను స్పృశించాలని ఆలోచించకుండా
అయినా ప్రశాంతంగా, ఓర్పుతో ఉండేట్లు, నేను ఉండగలిగినంతగా
బహుశా ప్రగాఢమైన పరిశోధనతో దొంగిలించేందుకేమో!
నా సహజ ప్రకృతి నుంచే మానవ సహజ గుణాలన్నీ–
అది నా ఏకైక సాధనోపాయం, వనరుల స్థానం– నా ప్రణాళిక.
అప్పటి వరకు ఒక భాగానికి సరిపోయేది మొత్తానికీ వ్యాపిస్తుంది.
అదిప్పుడు నా ఆత్మకు అలవాటుగా మారింది.

VII

ఈ పొడ పాములాంటి ఆలోచనలు, నా మనస్సు
 చుట్టూరా చుట్టుకున్నాయి, వాస్తవపు చీకటి స్వప్నమది.
నీనుంచి వెళ్లిపోయి, నేను ఆ గాలుల్ని వింటాను.
 చాలాకాలం నుంచి పలవరిస్తున్నా పట్టించుకోని వాటిని
ఎటువంటి మానసిక వ్యధ యొక్క ఆర్తనాదమది,
 చిత్రహింసలు పొడిగించబడగా
 ఆ వీణ చేస్తున్నది?
ఓ గాలీ! బయట నీవు ఆక్రమిస్తావు
 నగ్న చరియల్నీ, పర్వతపు వనరుల్నీ, ధ్వంసమైన వృక్షాన్నీ
కట్టెలు కొట్టేవాడు చొరలేని పైన్–శంకు వృక్ష వనాల్ని.
 మంత్రగత్తెల గృహంగా పేరొందిన ఒంటరి గృహాన్ని.
నేను ఆలోచిస్తున్నాను ఇంతకంటే మంచి ఉపకరణాలను నీకు.
ఉన్మత్త వైణికుడా! ఈ వానజల్లుల మాసంలో
ముదురు గోధుమరంగు తోటలు, తొంగిచూసే పుష్పాలు,

శీతాకాలపు పాటకన్నా చెడ్డదైన దయ్యపు కాలాన్ని సృజిస్తాయి,
ఆ పూలగుత్తులు, మొగ్గలు, సంకోచించే ఆకుల మధ్య.
ఓ నటుడా! అన్ని విషాద ధ్వనులతో పరిపూర్ణుడా!
ఓ మహాకవీ! వెర్రి ఆవేశపు ధైర్యం కలవాడా!
ఇవన్నీ నీకేమి చెబుతున్నవి?
పరాజితుడైన ప్రభువు పలాయనపు వేగాన్ని.
What tellest thou now about
It is of the rushing of an host in rout.
తొక్కివేయబడిన మనుషుల మూల్గులు,
బాధపెడ్తున్న గాయాలు, వాళ్లు అరుస్తారు నెప్పితో
గజగజా వణుకుతారు చలితో!
అయితే, నిశ్శబ్దం! అదుగో లోతైన నిశ్శబ్దపు విరామము.
ఆ శబ్దమంతా, ఆ తోసుకువస్తున్న గుంపుదే.
ఘోరమైన మూల్గులు, వణికించే జలదరింపులు–
–అన్నీ అయిపోయాయి– అవి మరో కథను చెబుతాయి.
తక్కువ లోతైనవి, తక్కువ బిగ్గరగా వినిపించేవి.
తక్కువ భయం గొలిపే కథను
ఆనందంతో మిళితం చేయబడిన దానిని
ఆరే వ్యక్తిత్వం ఏర్పరచిన సున్నితమైన శయ్యను
అది ఒక చిన్న శిశువు కోసం
ఒంటరి వనాంతరంలో
ఇంటికి దగ్గర్లోనే, కాని ఆమె దారి తప్పినది.
ఇప్పుడు చిన్నగా మూల్గుతున్నది, తీవ్ర దుఃఖంతో, భయంతో
ఇప్పుడు పెద్దగా అరుస్తున్నది, తన తల్లికి వినబడేట్లు!

VIII

ఇది అర్ధరాత్రి, నిద్ర గురించి నాకున్నాయి చిన్ని ఆలోచనలు
చాలా అరుదుగా, నా స్నేహితురాలు అటువంటి జాగారం చేస్తుంది.
ఆమెను దర్శించు, సౌమ్యమైన నిద్రా! స్వస్థత నిచ్చే రెక్కలతో

ఈ తుఫాను కేవలం పర్వత జననమగును గాక!
ఆమె నివాసంపై తారలన్నీ ప్రకాశవంతంగా వెలుగును గాక!
నిశ్శబ్దంగా నిద్రిస్తున్న భూమికి రక్షణ నిస్తున్నట్లే!
తేలికపడిన హృదయంతో ఆమె నిద్రలేవగా,
ఆనందపు ఊహలు, చిరునవ్వుల నేత్రాలు,
సంతోషమూ, ఆమె ఆత్మను పైకి లేవనెత్తును గాక!
ఆనందము ఆమె సుస్వరమును శృతి చేయునుగాక!
ధృవము నుంచి ధృవము వరకూ, ఆమె కొరకు
అన్నీ జీవించును గాక!
వారి జీవితం ఆమె జీవాత్మతో ప్రవహించును గాక!
ఓ సాధారణ జీవ ప్రవాహమా, నడపబడుతున్నావు పైనుంచీ,
ప్రియమైన యువతీ! నా ఎన్నికలో నీవు అత్యంత శ్రద్ధగల స్నేహానివి.
అలా, నీవు ఎప్పటికీ, మరింతగా ఆనందింతువు గాక!

✧✧✧✧✧

ఏప్రిల్ 4, 1802 నాడు శామ్యూల్ టేలర్ కాలరిడ్జి, తాను ప్రేమించిన సారా హచిన్‌సన్ (Sara Hutchinson) కు తన ప్రేమను వెల్లడిస్తూ వ్రాసిన కవిత ఇది.

తన భార్య నుంచి విడిగా వెళ్లిపోయి మరల మార్చి 1802లో ఇంటికి చేరుకుని, సంబంధాలు పునరుద్ధరించబడగా ఆమె ఒక ఆడపిల్లకు డిసెంబరు 1802లో జన్మనిచ్చింది. ఈ కవిత ఏప్రిల్ 1802 లో వ్రాసి ఆమెకు పంపినాడు. తొలి ప్రతి అనేక మార్పులు చేర్పులకు లోనై, మొదటి 340 పంక్తుల నుంచి కడపటి 139 పంక్తులకు చేరుకున్నది. 4 అక్టోబర్ 1802లో ప్రచురింపబడిన ఈ కవిత (వర్డ్స్‌వర్త్–మేరీ హచిన్‌సన్‌ల పెళ్లిరోజు, కాలరిడ్జి వివాహపు దినమూ అదే). సారాతో తనకున్న ప్రేమను, ఆ తరువాత ఆ సంబంధాన్ని తెగతెంపులు చేసుకొనగా వచ్చిన నిరాశను, తన ఆరోగ్యంలో ఒడిదుడుకులను ప్రతిబింబిస్తూ, మృత్యువు, జీవనంపై కాలరిడ్జి అభిప్రాయాలను ఈ కవిత అద్భుతంగా వివరిస్తుంది.

వర్డ్స్‌వర్త్ వ్రాసిన– Resolution and Independence, Immortality 'Ode' కు సమాధానమీ కవిత అని విమర్శకుల అభిప్రాయం.

(కాలరిడ్జి భార్య పేరు సారా ఫ్రికర్ (Sarah Fricker). వీరికి నలుగురు పిల్లలు. వర్డ్స్‌వర్త్ భార్య మేరీ హచిన్‌సన్ సోదరి సారా హచిన్‌సన్ (Sarah Hutchinson-Coleridge had married in haste and repented at leisure - అనేది వాడుక మాట.)

4. అర్ధరాత్రి మంచు

(Frost at Midnight)

తన రహస్య పరిచర్యను చేస్తున్నది మంచు,
ఏ గాలీ సాయం రాలేదు; పిల్ల గుడ్లగూబ అరుపు
బిగ్గరగా! ఆగు! అటుచూడు! మరలా బిగ్గరగా!
నా కుటీరంలోని సహచరులున్నారు గాఢనిద్రలో
విశ్రాంతి తీసుకుంటూ నన్ను వదిలేసారు ఒంటరితనానికి.
గూఢమైన పరధ్యానానికది అనువైన సమయం.
ముఖ్యంగా నాకు; ఊయలలో నిద్రిస్తున్నాడు నా శిశువు ప్రశాంతంగా!
అంతా ప్రశాంతత, ఎంత ప్రశాంతత అంటే అది
ధ్యానాన్ని చీకాకు పరచి భంగపరుస్తుంది,
తన వింతైన తీవ్ర మౌనంతో.
సముద్రం, కొండలు, అడవులు, జనులు నిండిన ఈ గ్రామం
సముద్రం, కొండలు, అడవులు, వాటి అసంఖ్యాక జీవన విశేషాలు
స్వప్నాల్లా వినబడవు! పలచని నీలి జ్వాల
తగ్గి మండుతున్న అగ్నిపై ఉన్నది, ఏ వణుకూ లేకుండా,
నెగడు ఇనుప కమ్ముల తడకపై పొర ఒక్కటే కాస్త ఊగుతున్నది.

ఇంకా కదుల్తున్నది రెపరెపలాడుతూ, అదొక్కటే కదిలేదక్కడ
నేననుకుంటాను దాని కదలిక ఈ ప్రకృతి నిశ్శబ్దంలో
బతికున్న నాకు తన జాలిని ప్రకటిస్తున్నదని.
అలా అది నాకు సహచరుడి రూపాన్ని దాల్చినది.
దాని చిన్ని రెక్కలు, సోమరి భూతపు రెక్కల్లా వింతగా
దానికిష్టం వచ్చినట్లువి కదుల్తున్నాయి. ప్రతిచోటా
ప్రతి ధ్వని లేక అద్దం తనను తాను వెదుక్కుంటున్నవి,
ఆలోచనను ఆటవస్తువుగా తయారు చేసుకుని.
కాని, ఓహ్! ఎంత తరచుగా

ఎంత తరచుగా, బడి వద్ద, ఎంతో నమ్మకమైన మనసుతో
ముందుగా ఊహించేవాడిని, ఆ కటకటాల తలుపును చూడగానే,
వింతగా రెపరెపలాడే ఆ తడికెను! ఎంత తరచుగా,
మూతబడని కనురెప్పలతో, నేను స్వప్నించే వాడిని
నా ప్రియతమ జన్మస్థలాన్ని, పాత చర్చి శిఖరాన్ని.
దాని గంటలు అవే పేదవాడికి సంగీతం.
మోగేవవి ఉదయం నుండి సాయంకాలం వరకూ,
వెచ్చని సంత-రోజున దినమంతా.
ఎంతో మధురంగా, నాలో ఉప్పొంగుతూ వెంటాడేవి
అదుపులేని ఆనందంతో, నా చెవులలో పడి,
రాబోయే విషయాలను చెబుతున్నట్లుగా!
అలా కళ్లప్పగించి చూస్తూనే ఉండేవాడిని, కలగనేవాడిని,
ఆ మృధువైనవి నన్ను లాలించి నిద్రపుచ్చుతాయని
ఆ నిద్ర నా స్వప్నాలను మరింత అధికం చేస్తుందని.

ఆ ఉదయమల్లా అలా ఆలోచిస్తూనే ఉన్నాను.
-గంభీరంగా ఉన్న నా ఉపాధ్యాయుడి వదనాన్ని చూసి భయంతో
నా కళ్లు ఈతగొట్టే పుస్తకంపై చదువుతున్నట్లు నటించినవి!
తలుపు తెరచుకున్నది సగం, నేను తొందరగా అటు చూసాను
నా హృదయం ఒక్కసారిగా ఎగిరిపడింది.
ఎవరో కొత్త వ్యక్తి వస్తాడని తలపోసిన నాకు.
ఊరి పెద్దమనిషి, అత్త, సోదరి ఎవరో ఒకరు
నన్ను ప్రేమించేవాళ్లు! నా నేస్తమో- ఇద్దరం
ధరించేవాళ్లం దుస్తులు ఒకే రకం!

నా పసిపాపా! నా పక్కనే ఊయలలో
నిదురిస్తున్న చిన్నారి బాలుడా! నీ కోమలమైన
ఊపిరి ధ్వనులు గాఢ నిశ్శబ్దంలో వినవస్తున్నాయి.

అవి ఆలోచనల మధ్యలో కలిసిన ఖాళీలను,
క్షణకాలపు విరామాలను నింపివేస్తున్నవి.
నా అందమైన పసిపాపా! నా హృదయం గాఢమైన
ఆనందంతో నిండుతున్నది, నిన్ను ఇలా వీక్షిస్తున్నపుడు
నీవు ఇటువంటి కథలను, ఇంకా అనేక దృశ్యాలను
నేర్చుకుంటావని తలుచుకున్నపుడు!
నేను పెంచబడినాను ఒక గొప్ప పట్టణంలో
విపరీతమైన రణగొణ ధ్వనుల మధ్య
ఆకాశం, నక్షత్రాలు తప్ప ఏదీ అందంగా కానరాని చోట
కాని నీవు, నా పసిపాపా! నీవు సంచరిస్తావు
చక్కని పిల్లగాలిలా సరస్సుల పక్కన,
ఇసుక తీరాలలో, ఒడిదుడుకు ప్రాచీన పర్వత శిఖరాలపై
మేఘాల దిగువన నీ రూపాన్ని ఆ సరస్సులు
సైకత తీరాలు, పర్వత శిఖరాలు ప్రతిఫలిస్తుండగా
నీవు చూస్తావు, వింటావు అందమైన రూపాలను,
శ్రావ్యమైన ధ్వనులను, విశ్లేషించబడని
శాశ్వత భాష, దేవుడు పలికే భాషను
ఎవరైతే శాశ్వతత్వం నుండి తన గురించి అందరకూ
నేర్పుతాడో, అన్నిటినీ తనలో కలిగి ఉంటాడో
ఆ ఘనుడైన జగద్గురువు! అతడు నీ ప్రాణశక్తిని,
ఆత్మను మలుస్తాడు, ఇవ్వడం ద్వారా అడిగేట్లు చేస్తాడు.

అందుచేత, అన్ని ఋతువులూ నీకు మధురంగా ఉండును గాక!
వేసవి ఈ భూమిని ఆకుపచ్చని వస్త్రంతో కప్పినపుడు
లేదా ఎర్రరొమ్ము రాబిన్ పిట్ట మంచు ముద్దల మధ్య
నాచుపట్టిన ఏపిల్ చెట్టు ఆకులు లేని శాఖలపై కూర్చుని
పాడుతున్నపుడు, ఏ గుడిసె, నివాసమూ సూర్యుని వేడికి

పొగలు కమ్మనపుడు, లేదా చాడీలు చెప్పే ఆకురాలు
కాలం ఉద్ధృతపు మరపుల్లో వింటున్నపుడు
లేదా శీతాకాలపు రహస్య పరిచర్య
వాటిని నిశ్శబ్దపు మంచు దారాలకు వేలాడదీసినపుడు
ప్రశాంత చంద్రికతో అవి ప్రశాంతంగా ప్రకాశిస్తాయి.

If the secret ministry of frost
Shall hang them up in silent icicles
Quietly shining to the quiet moon.

✧✧✧✧✧

తన కుమారుడు Hartley పసిపాపగా ఊయలలో నిద్రిస్తున్నపుడు ఒంటరిగా మెలకువతో ఉన్న కాలరిడ్జి తన బాల్య స్మృతులను, పెరిగిన వాతావరణాన్ని గుర్తు తెచ్చుకుని పిల్లలు గ్రామీణ వాతావరణంలో పెరగాల్సిన ఆవశ్యకతను ప్రబోధిస్తాడు. Conversation Poem గా (సంభాషణా కవిత), Neoplatonism (దేవుడు తర్కానికి అందనివాడు, పారవశ్యపు స్థితిలోనే అతడిని కాంచగలం)ను సమర్థించే కవితగా దీనిని విమర్శకులు పేర్కొంటున్నారు.

ఫిబ్రవరి 1798లో వ్రాయబడిన ఈ కవిత France: An ode and Fears in solitude లో ప్రచురింపబడినది. విచారం, చురుకుదనం, ఆశ, ఆనందం కలబోసుకున్న క్లిష్టమైన సంభాషణా కవితగా దీనిని వర్ణిస్తారు.

5. ఎవొలియన్ వీణ

(The Aeolian Harp)

నా విచారగ్రస్తమైన సారా! నీ మెత్తటి బుగ్గ
నా చేతిపై ఇలా వాలి శయనిస్తున్నపుడు
ఎంతో మధురంగా, నెప్పిని తీసివేస్తున్నట్లుగా ఉన్నదిగా!
మన శయ్య పక్కనే ఇలా కూర్చుని, మన శయ్య
లావైనది తెల్లటి మల్లెపూలతో, విశాలమైన పొన్న ఆకులతో
(ఈ పోలికలు అమాయకత్వాన్ని, ప్రేమను సూచించేవి)
మేఘమాలను చూడడం, ఇప్పుడవి వెలుగుతో ఘనంగా కనిపిస్తున్నాయి.
నెమ్మదిగా విచారపరిచే వలయపు నడక– తొలి తారను
చూపిస్తూ, అది– ప్రశాంతంగా ప్రకాశిస్తున్నది (జ్ఞానంలా)
వ్యతిరేక ప్రకాశం! ఎంత అద్భుతమైన పరిమళాలు!
దూరపు చిక్కుడు తోటల నుంచి వస్తున్న వాటిని లాక్కున్నట్లు!
ఈ ప్రపంచమెంత మౌనంగా ఉంచబడినది!
దూరపు సముద్రపు గుసగుస ఈ నిశ్శబ్దాన్ని తెలియజేస్తున్నది.

అది మామూలు వీణ
పొడుగ్గా పెట్టెలో ఉంచబడినది! హార్క్! ఆలకించు!
ఎలా ఆ నిలకడలేని గాలి వీణను ముద్దాడుతున్నదో
బిడియపడే కన్య తన ప్రియుడికి సగం లొంగిపోతున్నట్లు
అది కురిపిస్తుంది మధుర స్వరాలను కసురుకున్నట్లుగా
అదే తప్పు మరలా చేయాలనిపించేట్లుగా!
ఇప్పుడు దాని తంత్రులు ధైర్యంగా మీటబడినవై
ఇస్తున్నాయి రాగాలను.
తియ్యనైన అలలలో మునిగి తేలడాలు
అటువంటి మృదువైన శబ్దపు మంత్రజాలంలో తేలియాడుతూ
సంధ్యాసమయాన చిన్ని భూతాలు చేసే ధ్వనులు
తొలి యాత్రలో దివ్యలోకానికి తీసుకువెళ్లే ప్రశాంత తరంగాలు

అక్కడ మధురగీతాలు చుట్టి ఉంటాయి మకరందాన్ని
జాలువార్చే పుష్పాల చుట్టూరా
పాదాలు లేక, విచ్చలవిడిగా, స్వర్గలోకపు పక్షులు
ఆగవు, కూర్చోవు, మచ్చికగాని రెక్కలపై ఎగుర్తుంటాయి.

ఓహ్! ఒక్క జీవితం మనలోనిది, పరదేశానిది
చలనంలో కలిసి ఆత్మగా మారుతుంది.
శబ్దంలో కాంతిగా, ధ్వనిలాంటి శక్తిగా కాంతిలో
ఆలోచనలో లయగా, ఎక్కడ చూసినా ఆనందంగా!–

నేననుకుంటాను, అది అసాధ్యమని
ఈ ప్రపంచాన్ని నింపిన విషయాల్ని ప్రేమించకుండా ఉండడం.
ఎక్కడైతే గాలులు గుసగుసలాడ్తాయో, అక్కడ
మూగ నిశ్చల గాలి ఆమె వీణపై నిశ్శబ్ద సంగీతమవుతుంది కాదా!

అలా ప్రియతమా! దూరపు కొండవాలుల మధ్యన
మధ్యాహ్నం పూట నేను నా చేతుల్ని చాస్తాను
సగం మూసుకున్న నా కనులగుండా నేను చూస్తాను
వజ్రపు మణుల్లా సూర్యకిరణాలు నాట్యమాడుతూ మెరవడాన్ని.
ప్రశాంతతలో ప్రశాంతంగా ఆలోచిస్తాను
పిలవనివి, ఆపనివి అనేక ఆలోచనలు,
అనేక సోమరితనపు ఊహాగానాలు.
నా సోమరి, పరాధీన మెదడులోకి చొచ్చుకుపోతాయి
అడ్డూ అదుపూ లేని వివిధ రూపాల పెను అలల్లా
ఉప్పొంగి రెపరెపలాడ్తాయి ఈ గాలుల వీణపై!

మన కదిలే ఈ స్వభావమంతా
రకరకాల వీణలపై నినదించే విధమనుకున్నపుడు
ఆ అనుకంపన ఆలోచనగా మారినది.
వాటిపై వంగని, విశాలమైన, వివేకపు గాలి వీచి
అందరి ఆత్మలను, దివ్యాత్మను ఊడ్చివేస్తుందా?

అయితే, నీ మరింత తీక్షణమైన నేత్రం,
ఈ బాణాలను అడ్డుకుంటుంది చివాట్లు పెడుతూ!
నా ప్రియతమా! అటువంటి ఆలోచనలు మసక
బారి, అపరిశుద్ధమైనవి రావులే నీవు తిరస్కరించకపోయినా!
నన్ను దేవుడితో నడిపించేవిగా ప్రేరేపిస్తాయి.
క్రైస్తవ కుటుంబంలో సాధువైన కూతురా!
ఆ మాటలు, నిందాపూర్వకంగా ఉంటే, అది
ఇంకా వికసించని మనసు నుంచి వచ్చిన రూపమై ఉంటుంది.
గాలి బుడగలు గాలిలో తేలి పగిలి ముక్కలవుతాయి.
వృధా వేదాంతం పిచ్చిమాటలను జిమ్ముతుంది.
అతడి గురించి మాట్లాడడం తప్పు. అది అర్ధమయ్యేది కాదు.

నేను అతడిని భయంతో పొగడడం లేదు. అంతర్లీనంగా ఉన్న
విశ్వాసంతో, అతడి కరుణ నాకు స్వస్థతనిస్తుందని,
నేను పాపిని, అత్యంత దురదృష్టవంతుడిని,
విచ్చలవిడిగా, చీకటిలో తిరిగిన నాకు శాంతిని ప్రసాదించినవాడు
ఈ శయ్యను, నిన్ను నాకిచ్చినవాడతడు ఓ నా హృదయాన్ని
గెలుచుకున్న కన్యా!

✧✧✧✧✧

ఎవొలియన్ గ్రీకుల వాయుదేవుడు. ఎవొలియన్ వీణ - తంత్రీ వాద్య విశేషం. ప్రకృతి శక్తులకు స్పందిస్తుంది కనుక కాలరిడ్జి లాంటి ప్రకృతి కవులు ఈ వాయిద్యాలపై మక్కువ చూపినారనిపిస్తుంది.

ఆగష్టు 1795లో తాను, సారా ఫ్రికర్ కలిసి దర్శించిన కుటీరంలో వాళ్లు తమ వివాహపు తొలి దినాలను గడిపినారు. మొదటిసారి దర్శించినప్పటి అనుభూతుల్ని కాలరిడ్జి 17 పంక్తుల కవితగా 1795లో వ్రాసినాడు. 1796లో దానిని 56 పంక్తులను, 1828 కల్లా 65 పంక్తులకు విస్తరించినాడు. ఆ కుటీరాన్ని 33 ఏళ్ల వ్యవధిలో అనేకసార్లు దర్శించిన కాలరిడ్జి ఈ కవితలో కూడా అనేక మార్పులు చేసినాడు. 1796లో ఇది తొలిసారిగా ప్రచురింపబడింది.

ఈ కవిత ప్రేమ, శృంగారం, వివాహం లాంటి విషయాలను చర్చించినా ఇది ప్రేమ కవిత కాదు. ప్రేమను ఎవొలియన్ వీణతో, కవిత్వానికి చిహ్నంగా వాడినాడు. అనేకమంది విమర్శకులు ఈ కవితను– One of Coleridge's happiest poems గా, A Beautiful Conversational Poem గా కొనియాడినారు.

6. లింబో-1

(Limbo = పితృదేవతల లోకం)

ఆత్మ నిజంగా ప్రత్యేకమైనది - అజ్ఞాతవాసపు 'లింబో' జైలులో.
అది దెయ్యాలను భయపెడ్తుంది, దయ్యాలు మనుషుల్ని భయపెట్టినట్లు-
మెలకువగా పైపైన చూసినందుకు వెక్కిరిస్తుంది
అది 'కారాన్' పడవ దేవుడిని, ప్రయాణభత్యం అడిగినందుకు!

లింబో-2

ఇదొక విచిత్ర ప్రదేశం, ఈ లింబొ- ఇదొక ప్రదేశం కాదు నిజానికి.
అలా పేరు పెట్టబడింది - ఎక్కడైతే కాలం, అలసిన ప్రదేశం
ఎగిరిపోకుండా బంధించబడ్డాయో, పారిపోతున్న భావనను కలిగించే పీడకలలో
కష్టపడుతుంటాయి. వాటి ఆఖరి సంధ్యాసమయపు అర్ధ రూపాలలో

ఇరుకైన స్థలం, కొడవలి లేని కాలం
ఎండిన చేతుల్తో
వంధ్యగా, శబ్దరహితమైన ఇసుక గడియారంలా
వలసపోయిన నీడలు పెట్టలేదే గుర్తులు- అర్థంకానివి
పగటి గడియారపు వదనంపై వెన్నెలలా

అయినా, అందంగానే ఉంటుంది- మనిషి కాలంలా
ఒక వృద్ధుడు మహత్తుగల నిశ్చలమైన దృక్కులతో
మర్త్యకార్యాలను ఆపి నింగివేపు చూస్తున్నాడు
కాని అతడు అంధుడు - విగ్రహానికుంటాయి అటువంటి కళ్లు.

లింబో (Limbo-latin-Edge of Hell - నరకలోకపు అంచు. ఇక్కడ పితృదేవతలుంటారు. పర్గేటరీ (Purgatory - ఆత్మలు పరిశుద్ధ పరచబడే స్థలం; కారాన్-Charon-నరకానికి పడవ నడిపేవాడు.

బహుశా వీలుకుదిరి అతడు చంద్రుడివేపు చూస్తున్నాడు
చంద్రమండలాన్ని తన చంద్రవదనంతో
కొద్దిపాటి తెల్లటి వెంద్రుకలు, నుదుటిపై బట్టతల బాగా
అతడలా చూస్తూనే ఉన్నాడు, కళ్లులేని ముఖమే కళ్లుగా-

దాన్నొక నిశ్శబ్ద కాంతి నిండిన శరీరభాగంగా
అతడి వదనం మొత్తం ఆనందంతో తొణికిసలాడుతున్నది.
పెదాన్ని పెదం అంటుకుని, ఏదీ కదలకుండా, మొండెమూ, కాళ్లూ
అతడు తదేకంగా చూస్తున్నట్లున్నాడు, తనవేపు చూస్తున్న దానివేపు.

అటువంటి మధుర దృశ్యాలేవీ 'లింబో' మాళిగలో దాచబడవు.
చుట్టూ దుర్భేధ్యమైన కోటలు, ఆత్మల జైలుకు కాపలాలు.
ఏమీలేని శూన్యపు భీభత్సమే ఎక్కడ చూసినా
దాని అన్నిదిక్కుల పరివ్యాప్తాన్ని ఆనందిస్తాయా దెయ్యాలు.

ఘోరమైన ఆలోచనకు ఉండదు పెరుగుదల,
అది చురుకులేని శూన్యత.
అయినా, అది పర్గేటరీ - పితృలోకపు శాపం
నరకానికి తెలుసు దానికన్నా చెడ్డదైన భయం
భయం - భవిష్యత్తు అనేది ఖచ్చితంగా లేదనడం
Hell knows a fear far worse
A fear, - a future state - It is positive negation.

✧✧✧✧✧

ఓపియం (Laudanam) తో వచ్చిన అస్వస్థతతో కాలరిడ్జి దాదాపు జీవచ్ఛవమైన స్థితిలో అతడి స్నేహితుడు Josia wade అతడిని డాక్టర్ డేనియల్ సంరక్షణలో కోలుకునేట్లు చేసినాడు. ఆ సమయంలో వ్రాసిన కవితలివి. 'లింబో' అనేది నరకలోకపు అంచు వద్ద ఉండే పితృలోకం, Limbo of Infants - బాప్టిజం కాకమునుపు చనిపోయిన పిల్లల లోకం.

7. నిమ్మచెట్టు పొదరిల్లు, నా జైలు

(The Lime-Tree Bower My Prison)
(addressed to Charles Lamb .O)

అవును, వాళ్లు వెళ్లిపోయారు, నేనిక్కడ ఉండకతప్పదు
ఈ నిమ్మచెట్టు పొదరిల్లు నాకిప్పుడు ఓ జైలు!
నేను పోగొట్టుకున్నాను అందాలను, అనుభూతులను
అవి నా జ్ఞాపకాల్లో మధురాతి మధురంగా ఉండవలసినవి
నా పెరిగిన వయసు నా కళ్లను మసక పరచి నన్ను అంధుడిగా
చేసేంత వరకూ! ఈలోగా అవి,
స్నేహితులారా, మిమ్మల్ని నేనిక కలవబోను
వసంతపు బంజరు భూముల్లో, కొండ శిఖరపు అంచుల్లో
సంతోషంగా సంచరించిన చోట్ల, అలసట తీర్చుకున్న చోట్ల
బహుశా, ఇంకా అక్కడ హోరుగా శబ్దిస్తున్న కనుమల వద్ద
నేను చెప్పిన ఆ కొండల మధ్య కోనలో లెక్కలేనన్ని వృక్షాలతో
ఇరుకుగా, లోతుగా, మధ్యాహ్నపు సూర్యుడేర్పరచిన తళుకు పొడలతో,
ఎక్కడైతే దాని సన్నని కాండం, యాష్ చెట్టుది.
ఈ రాయి నుంచి ఆ రాయికి వంతెనలా వంగి వున్నదో–
ఆ శాఖలు లేని వృక్షం, ఎండ పడక, తడిగా, దానికున్న
కొద్ది ఆకులు పసుపు పచ్చని గాలిలో ఏనాడూ కనిపించలేదు, కాని,
కంపిస్తున్నాయి ఇంకా, జలపాతపు వేగానికి! మిత్రులారా,
అక్కడ నేను చూసాను ఆకుపచ్చని పొడుగాటి సన్నటి పిచ్చిమొక్కల్ని.
అవన్నీ ఒక్కసారే (ఎటువంటి అద్భుతమైన దృశ్యమది)
తలలూపుతూ, నీటి బిందువులను జాలువారుస్తున్నాయి,
ఆ నీలి మట్టిరాయి నీరు కారుస్తున్న అంచు దిగువన.

ఇప్పుడు, నా మిత్రులు బయట పడ్తున్నారు
విశాల విశాలమైన స్వర్గానికి దిగువన – మరల చూస్తున్నారు.

అనేక మెట్లున్న దారి, మనోహరమైన కొండ పొలాలు
మైదానాలూ, సముద్రం, సముద్రంలో పడవలు,
అందమైనవి, ఎగసిన తెరచాపల్తో కొన్ని,
రెండు ద్వీపాల మధ్యనున్న నీలి ఆకాశాన్ని చీలుస్తున్నట్లు
ఊదారంగు నీడలు! అవి అన్నీ ఆనందంగా సంచరిస్తున్నాయి.
కాని, నేననుకుంటున్నాను, అందరికన్నా ఎక్కువ
సంతోషించేది నీవు ఓ సున్నితమైన హృదయమున్న
ఛార్లెస్! నీవు ప్రకృతి కోసం విరహం చెందావు.
ఆకలిగొని ఉన్నావు, ఎన్ని సంవత్సరాలు గానో!
ఆ గొప్ప పట్టణంలో ఉండి నీ బాటను గెలుస్తూ
విచారంగా ఉన్నా ఓర్పుగల ఆత్మతో,
కష్టాలలో, బాధలలో, వింత సంక్షోభాలలో!
ఆహ్! నెమ్మదిగా మునిగిపోతున్నాడు పడమటి
అంచుకిందకు కీర్తికాంతులు గల సూర్యుడు!
మునుగుతున్న కక్ష్యలో ఏటవాలు కిరణాలను పంపుతూ
ఓ ఊదారంగు బంజరు భూమి పుష్పాల్లారా!
మరింత శోభాయమానంగా ప్రకాశించండి, మేఘాల్లారా!
దూరపు వనాల్లారా, జీవించండి పసుపు పచ్చని కాంతిలో!
ఓ నీలిసముద్రమా, కాంతులతో ప్రకాశించుమా!
నా స్నేహితుడు ఈ అపురూప దృశ్యాలను చూసి
తన్మయత్వంతో నిశ్చలంగా నిలబడును గాక,
నేను నిలబడినట్లే నిశ్శబ్దంలో ఈదుతున్న భావనతో,
చుట్టూ ఉన్న సుందర దృశ్యాల్ని కన్నార్పకుండా చూస్తూ
అదంతా దైహికానందాన్ని మించిపోయేంత వరకూ
అటువంటి కాంతులు, పరమాత్మను దాచి ఉంచిన తెరలా ఉన్నా,
అతడు ప్రాణికోటి ఆత్మలకు తన ఉనికిని తెలిసేట్లు చేస్తాడు.

ఒక ఆనందం
అకస్మాత్తుగా ఉప్పొంగింది నా హృదయంలో

నేను చాలా సంతోషించాను నేను కూడా అక్కడే ఉన్నందుకు
ఈ పొదరింటిలో కాదు; ఈ నిమ్మచెట్టు పొదరింటిని
నాకు స్వాంతన నిచ్చిన దానిగా నేను గుర్తించాను.
ప్రకాశవంతమైన రంగుల కింద పాలిపోయి వేలాడుతున్న
పారదర్శకపు ఆకుల గుంపు, నేను గమనించాను
ఒక వెడల్పైన ప్రకాశించే ఆకును, ఇష్టపడినాను
ఆ ఆకు, శాఖల నీడను ఎండలో
వివిధ రంగుల మచ్చలుగా కనిపిస్తున్న దానిని!
ఆ వాల్నట్ వృక్షం చిక్కగా వెలుగులీనుతూ
పక్కనున్న అనాది ఐవీ తీగెపై కాంతులు కురిపిస్తున్నది.
ఆ ఐవీ తీగె, ఎల్మ్ చెట్లనాక్రమించుకుని, ఇప్పుడు,
ఆ నల్లటి చిక్కటి ముద్ద, వాటి శాఖలను నల్లగా
కాస్త వెలుగుతో తళతళ మెరిసేట్లు చేస్తున్నది.
ఆలస్యపు సంధ్యాకాంతుల గుండా గబ్బిలమొకటి
నిశ్శబ్దపు చక్రంలా నిష్క్రమించినది – ఒక్క
స్వాలో పక్షి కూడా కిచకిచలాడలేదు, అయినా
ఒక ఒంటరి తుమ్మెద చిక్కుడు పుష్పం వద్ద గానం చేస్తున్నది.
అలా నాకు తెలిసి వచ్చింది– ప్రకృతి ఎప్పుడూ
స్వచ్ఛమైన వారిని, జ్ఞానిని విడిచి వెళ్లదని.

ఏ అంశమూ ఇరుకైనది కాదు, అక్కడ ప్రకృతి ఉంటే.
ఏదీ నిరుపయోగమైనది కాదు, ఖాళీగా పడి ఉండదు.
ప్రతి ఇంద్రియశక్తినీ ఆనందింపచేస్తుంది.
హృదయాన్ని సౌందర్యానికి, ప్రేమకు మెలకువలో ఉంచుతుంది.
కొన్నిసార్లు వాగ్దానం చేసిన మంచికి విఘాతం కలుగవచ్చు
అప్పుడు మనం మన ఆత్మను, ధ్యానంలోకి
మనం పంచుకోలేని అద్భుత ఆనందాలలోకి నడిపించాలి.

సున్నిత హృదయుడవైన ఛార్లెస్! ఎప్పుడైతే ఆఖరి కాకి
మసకగాలిలో తిన్నగా ప్రయాణిస్తున్నదో ఇంటివేపుగా,

నేను దానిని ఆశీర్వదిస్తాను, దాని నల్లటి రెక్కలు
(ఇప్పుడు చిన్ని చుక్కలా, ఇప్పుడు అదృశ్యమైనది కాంతిలో)
దాటినాయి మహాకక్ష్యపు విస్తృతి చెందిన కీర్తికాంతిని.
నీవింకా కన్నార్పకుండా చూస్తూనే ఉన్నావు, లేదా,
అంతా నిశ్చలంగా ఉన్నపుడు, ఎగిరిపోతుంది
నీ శిరస్సుపైన కీచుమనే చప్పుడుతో, నీకోసం
తెస్తుంది ఓ ఇంద్రజాలాన్ని, నా సున్నిత హృదయపు
ఛార్లెస్! ఎవరికైతే జీవితాన్ని తెలిపే ఏ శబ్దమూ,
అపస్వరం కాదో అటువంటి నీకు!

To whom no sound is dissonant which
tells of life.

✧✧✧✧✧

The Lime Tree Bower- My Prison అనే కవితను 1797లో కాలరిడ్జి వ్రాసినాడు. తాను అస్వస్థతకు లోనై నిమ్మచెట్టుకింద ఉండాల్సి వచ్చినప్పటికీ, తన స్నేహితురాలు చక్కని ప్రకృతిని వీక్షిస్తుండగా ఆ అందాలను అనుభూతులను మనోనేత్రంతో తానుకూడా చూడగలిగినాడు. ఆ నిమ్మచెట్టు ఆనాడతనికి బాహ్య, అంతర్ బంధిఖానాగా తోచినది.

1797 వేసవి కాలంలో, జాన్ ఫెల్వాల్, వర్డ్స్వర్త్, డోరతి, ఛార్లెస్ లాంబ్, థామస్ పూలే, సారా ఫ్రికర్‌తో కలిసి క్వాంటాక్ కొండల చుట్టుపక్కల సేదదీరుతున్న రోజులవి. భార్యతో గొడవలు, సారాకు గర్భ విచ్ఛిత్తి కావడం, తన ఆరోగ్య పరిస్థితి (సారా ప్రమాద వశాత్తూ వేడిపాలను అతడి కాళ్లపై పడవేసింది) అందుకని అతడు వాళ్లతో బయటకు వెళ్లలేకపోయాడు.

నిమ్మచెట్టు ఉన్న ప్రదేశం Nether Stowey లోని థామస్ పూలె ఇంటి ఆవరణలోనిది.

Brilliant series of topographical reflections, Religious musings, ఈ కవితకు ప్రత్యేక శోభను ఇచ్చినాయి.

God is every thing and Every thing is God అన్న Pantheism ఈ కవితలో మనకు గోచరిస్తుంది.

8. ఆశలేని పని

(Work without hope)

ప్రకృతి అంతా ఏదో ఒక పనిలో ఉన్నది, నత్తలు వదిలాయి తమ గూటిని
తుమ్మెదలు ఝుమ్మంటున్నాయి, పక్షులు రెక్కలను విప్పార్చినాయి.
శీతాకాలం బయట గాలిలో నిదురపోతున్నది,
తన చిరునవ్వు ముఖంపై వసంతకాలపు స్వప్నాన్ని ధరించినది.
నేనొక్కడిని మాత్రం పనీ పాట లేకుండా ఉన్నాను.
తేనె లేదు, జంట లేదు, ఏదీ కట్టలేదు, పాటా పాడలేదు.
అయినా వెళ్లాను అమరాంథ్‌లు పెరిగే తీరం వేపు,
మకరంద ప్రవాహాలు ప్రవహించే జలధార కనుగొన్నానక్కడ
విరబూయుమోయీ, ఓ నీవు అమరాంథ్, ఎవరికోసమైనా సరే!
నాకోసం వద్దులే, జారిపో, గొప్ప ప్రవాహాలలో, దూరంగా
ప్రకాశించని పెదవులతో, పూలు లేని కనుబొమలతో, నడుస్తాను నేను.
నా ఆత్మను నిదురపుచ్చే మంత్రం నీ దగ్గరున్నదా?
Works without hope draws nectar in a sieve
And hope without an object cannot live.
ఆశ లేకుండా చేసే పని మకరందాన్ని జల్లెడలో తెస్తుంది
లక్ష్యం లేని ఆశ ఏమీ సాధించకుండానే చస్తుంది.

✧✧✧✧✧

(అమరాంథ్ = గ్రీకు = unfading = వాడిపోని పుష్పాలు
స్వర్గలోక పుష్పాలు = అమరావతిలో దొరికేవి కాబోలు)

కాలరిడ్జ్‌కి యాభై రెండేళ్ల వయసు ఈ సానెట్ ప్రచురించేప్పటికి. నిరాశ తెచ్చే మానసిక దిగులును వర్ణిస్తూ 21 ఫిబ్రవరి 1825 నాడు ఈ కవిత వ్రాసినాడు.

9. అట్టర్ నదికి

(To the river Otter)

ప్రియమైన సహజ నీటిప్రవాహమా! పశ్చిమ వాగు రూపమా!
ఎన్నెన్ని రకాలుగా గతించినాయి గడచిన సంవత్సరాలు!
ఏమేమి సంతోషకరమైన, దుఃఖపూరితమైన, ఘడియలను గడిపాను!
మృదువైన సన్నని రాళ్లను నీ రొమ్ముపైన జల్లెడపట్టి ఎన్నాళ్లయ్యింది?
వాటి కాంతుల గంతులను లెక్కించి! అయినా ఎంతో ముచ్చటపడినాను.
దానిలో మునిగి ఉన్న బాల్యపు మధుర దృశ్యాలు గుర్తుకు వచ్చి,
సూర్యకిరణాల మధ్య కూడా మూయను నా కన్నులను,
అయితే, అన్ని రంగుల ఛాయలతో నీ నీళ్లు నిలువుగా పైకి లేస్తాయి.
బల్లకట్టును దాటి, బూడిదరంగు విల్లో చెట్లతో కలిసిపోతాయి.
వివిధ వర్ణాల అద్దకపు రంగుల గీతలున్న ఇసుక శయ్యలను దాటి,
నీ ప్రకాశవంతమైన పారదర్శకపు తళతళల గుండా నా దారిలో మెరుస్తాయి.
బాల్యపు దర్శనాలు! తరచుగా మీరు మాయ చేస్తున్నారు,
ఒంటరి మగటిమి చింతలను, మేల్కొల్పినారు, మధురమైన నిట్టూర్పులను,
ఆహ్! మరొక్కసారి నేను దేనినీ లెక్కచెయ్యని పసివాడినైనాను.

✧✧✧✧✧

కాలరిడ్జి కవితలలో ఎక్కువగా కనిపించే అంశమిది. బాల్యపు అమాయకత్వం, గడచిన రోజులే మేలైనవనే భావం, ప్రకృతితో మమేకం కావడం ఇవన్నీ ఈ కవితలో (1793) కానవస్తాయి.

10. ఆస్రాకు

(To Asra)

ఎక్కడన్నా రెండు విషయాలున్నాయా, మనుషులు పొందినవి?
రెండూ ఒకే రకంగా ఉండి, సమీపంగా ఉండేవి.
పరస్పర ప్రేమకున్న సంతోషంలా ఉంటాయా అవి?
ప్రియమైన ఆస్రా, మాటలతో వర్ణించలేని స్త్రీవి, ప్రియతమా!

నా హృదయపు బావిలో పెల్లుబుకుతున్న ఈ ప్రేమ
ఇప్పుడది జలధారగా ఉబుకుతున్నది, తగ్గుతున్నది.
ఇప్పుడు నాలోని ప్రతి భాగం నుండి పొంగి పొర్లుతున్నది.
అన్నిటినీ నింపుతున్నది, అన్నిటినీ మార్చుతున్నది.

మంచులో ఉబుకుతున్న వేడి నీటిబుగ్గ జలధారల్లా,
ఈ ప్రేమ గొప్పగా అనిపిస్తున్నది వృద్ధిని మించినదిగా,
అయినా అది ఇంకా, ఇంకా పెరుగుతూనే ఉన్నది.
నేను దీనిని ఒక ఘనమైన వరకట్నంగా మార్చగలనా!

ఆనందకరమైన జీవితంగా రూపు మార్చి నీకిస్తాను మొత్తం
నేననుకుంటాను, నీవే స్వర్గం; నీ వయస్సు శాశ్వతత్వం.

✧✧✧✧✧

ప్రేమను, పారవశ్యంగా, అద్భుతంగా వర్ణించే కవిత ఇది. Thy lot, me thinks, Were Heaven, Thy age Eternity అన్న చివరి వాక్యం చక్కని కవితకు మరింత సొగసునిచ్చినది. living fount, vernal waters లాంటి పదాలతో ఈ కవిత ఎంతో రమణీయంగా ఉంటుంది.

11. నిద్రా బాధలు

(The Pains of Sleep)

ఈ మంచం మీద పడేసాను నా కాళ్లూ చేతులూ
అది నా పద్ధతి కాదు, పెదాలను కదిలించడం,
మోకాళ్లపై కూర్చుని ప్రార్థించడం;
కాని, నిశ్శబ్దంగా కూర్చుని, మెల్లమెల్లగా
నా ఆత్మను ప్రేమతో నింపి
వినమ్రంగా, విశ్వాసంతో కనురెప్పలు మూసుకుని
భక్తితో కూడిన రాజీతో
ఏ కోరికలూ కోరకుండా, ఏ ఆలోచనలూ లేకుండా
దీనంగా వేడుకునే అనుభూతి;
దానిని నా ఆత్మ అంగీకరిస్తుంది,
నేను బలహీనుడనైనా, ఆశీర్వదింపబడినానని,
నాలో, నా చుట్టూరా, ప్రతిచోటా,
శాశ్వత శక్తి, వివేచనా జ్ఞానం ఉన్నాయని.

కాని, నిన్నటి రాత్రి నేను ప్రార్థించాను బిగ్గరగా,
మానసిక వ్యధతో, తీవ్రమైన బాధతో
అక్కడి దయ్యపు గుంపులోంచి మొదలైనాయి
రకరకాల ఆకారాలూ, ఆలోచనలూ
నన్ను చిత్రహింస పెట్టినాయి.
అసహజమైన వెలుగు, తొక్కిసలాడ్తున్న గుంపు

దుస్సహపు దోషమేదో జరిగిన భావన
నేను తిరస్కరించిన వాళ్లు, బలంగా ఉన్నారు వాళ్లే!
ప్రతీకారపు దాహం, శక్తిలేని సంకల్పం
కలవరపెట్టినా, ఇంకా మండుతూనే ఉన్నాయి.
కోరిక అసహ్యంతో వింతగా మిళితమైనవి,
అదుపులేని, ద్వేషపు విషయాలపై లగ్నమైనవి,
అత్యద్భుతమైన ఉద్వేగాలు, ఉన్మత్త తగాదాలు,
అవమానం, భయం ఎక్కడ చూసినా!
దాచకూడని పనులు దాచబడినాయి.
అంత గందరగోళమెందుకో తెలియలేదు నాకు.
నేను బాధపడ్డానా, లేదా, బాధపడ్డాను.
అంతా తప్పుగానే అనిపించింది, పశ్చాత్తాపం, దుఃఖం
నాది లేక ఇతరులది అంతా ఒకటిగానే, ఒకలానే
జీవితాన్ని ఊపిరాడకుండా చేసే భయం.
ఆత్మకు ఊపిరాడకుండా చేసే అవమానం.

రెండు రాత్రుళ్లు గడిచాయి; గడచిన రాత్రి దిగులు,
వచ్చే దినాన్ని విచారంగా, నిస్తబ్దంగా చేసింది.
నిద్ర, గొప్ప ఆశీస్సు, నాకనిపించింది, చిరాకు యొక్క బహు చెడ్డ కష్టమని.
మూడవ రాత్రి, నేను బిగ్గరగా పెట్టిన కేక
నన్ను లేపింది ఆ దయ్యాల కల నుంచీ,
ఆ వింత విపరీత కష్టాల నుంచి బయటపడినట్లై
నేనొక చిన్న పిల్లాడిలా వెక్కివెక్కి ఏడ్చాను.
అలా కన్నీళ్లు తగ్గిపోయినాక
నా మానసిక వ్యధ కాస్త ఉపశమించింది.
అటువంటి శిక్షలు, నేనన్నాను, రావాల్సినవే,

పాపంతో కళంకితమైన స్వభావాలకు,-
మరల కొత్త సంక్షోభంలో చిక్కుకుని
లోతు తెలియని నరకంలో ఇరుక్కుని
వాళ్ల పనుల భీభత్సాన్ని చూడడానికి
తెలుసుకుని, అసహ్యించి, మరల కోరుకుని చేయడం!

అటువంటి దుఃఖాలు, అటువంటి మనుషులకు సరిపోతాయి.
కాబట్టి దేనికోసం, దేనికోసం నామీద పడాలి?
ప్రేమించబడడమేగా నేను కోరుకున్నది.
నేను ప్రేమించేవాళ్లను నేను ప్రేమిస్తాను యదార్ధంగా!

✧✧✧✧✧

1803లో కాలరిడ్జి వ్రాసిన సంభాషణా కవిత్వమిది (Conversational Poem). పెళ్లాడిన సారాఫ్రికర్‌తో సరిపడక, ప్రేమించిన సారా హచిన్‌సన్‌ను పెళ్లాడలేక, తన వ్యాధికి వైద్యులిచ్చిన - కీళ్లనొప్పుల ఉపశమనపు ఓపియం గోలీలకు అలవాటుపడి, ఒక్కోసారి నిద్రపట్టక, దిగులుకు గురై ఆ 'డిప్రెషన్'లో వ్రాసిన అనేక కవితలలో ఇది ఒకటి.

"To be loved is all I need
And whom I love, I love indeed"

అతడు కోరుకున్నదొక్కటే - అదే ప్రేమ.

Dr. LANKA SIVA RAMA PRASAD

M.B.B.S; M.S (General Surgery);
M.Ch (Cardio Thoracic & Vascular Surgery)
FIVS (Fellow in Vascular Surgery)
Post Graduate Diplomate in Human Rights
Post Graduate Diplomate in Television Production
Web Engineer- Web Designer
Fellow of Indo- Asian Poetry Society
Founder of Writer's Corner / Srijana Lokam
Columnist - Andhra Jyothi (Nivedana)
Cell Animation Artist (Heart Animation Acadamy - Hyderabad)
Computer Animation Specialist (Pentafour- Chennai)
Founder of Waves (Warangal Aids Voluntary Educational Society)

డాక్టర్ లంకా శివరామప్రసాద్ రచనలు

కవిత్వం (తెలుగు) **(Poetry) :**

1. ఆల్కెమీ
2. వానమబ్బుల కాంతిఖడ్గం
3. టీకప్పులో తుఫాను
4. తంగేటి జున్ను
5. కర్కాటకం (క్యాన్సరు) (First Poetry Book about Cancer in Telugu)
6. ఒక సరస్సు-అనేక హంసలు (First Poetry Book about Psychiatry in Telugu)
7. మరణ శాసనం - దీర్ఘ కవిత.
8. శ్రీ లలితాసహస్రనామ స్తోత్రం

కవిత్వం (ఇంగ్లీషు) **(Poetry) :**

1. **Shades**
2. **The Twilight Zone**

నవలలు **(Novels) :**

1. **In Search of Truth (English)**
2. సత్యాన్వేషణలో (తెలుగు)
3. జీనోమ్ (తెలుగు) (First Biotechnology Novel in Telugu)

కథలు, వ్యాసాలు **(Stories, Essays) :**

1. కత్తి అంచుపై... (First Noir Stories in Telugu)
2. ఛుప్ కె ఛుప్ కె (రహస్యభాష) (స్త్రీల వ్యాధులు)
3. అక్షరార్చన

ఇతరాలు **(Others) :**

1. దీప నిర్వాణగంధం (About Death)
2. స్వప్నశాస్త్రం (Dreams-1)
3. కలలు-పీడకలలు (Dreams-2)
4. సంఖ్యాశాస్త్రం (Numerology)
5. **How to be Happy**
6. డా. జయదేవ్ కార్టూన్లు
7. **Bouquet of Telugu Songs and Poems**

అనువాదాలు **(English to Telugu) Translations :**

1. ఇలియాడ్ (Homer) - **Iliad**
2. ఒడెస్సీ (Homer) - **Odyssey**
3. ఎపిక్ సైకిల్ (Homer) - **Epic Cycle**
4. మూడు గ్రీకు ట్రాజెడీలు - **Three Greek Tragedies**
5. ఈనీడ్ (Virgil) - **Aenied**
6. తీర్థయాత్రికుని ప్రగతి (John Bunyan) - **Pilgrims Progress**
7. పారడైజ్ లాస్ట్ & రిగైన్డ్ (John Milton) - **Paradise Lost & Paradise Regained**
8. డివైన్ కామెడీ (Dante) - **Divine Comedy**
9. ఫాస్ట్ (Goethe) - **Faust**
10. నామదేవొ ధసాల్ కవిత్వం (NamDeo Dhasal) Poetry
11. ప్రపంచ ప్రసిద్ధ కథలు (World Famous Stories)
12. విలియం బ్లేక్ కవిత్వం (William Blake Poetry)
13. రసధుని (Russian Poetry)
14. జలపాతం (అష్టాదశ ఆంగ్ల కవుల కవిత్వం) (18 English Poets)
15. క్రీస్తు అద్భుతగీతాలు (The Wonderful Poems on Christ)
16. క్రీస్తు నడచిన దారి (The Path of Christ)
17. మస్నవి 1 - 6 (మౌలానా జలాలుద్దీన్ రూమి) - **Masnavi**
18. పక్షుల సభ (ఫరీదుద్దీన్ అత్తర్) - **Conference of Birds**
19. శిలప్పదికారం (తమిళ సాహిత్యం) - **Silappadikaram**
20. మణిమేఖల (తమిళ సాహిత్యం) - **Manimekhala**
21. తమిళ సరస్వతి అందెల రవళి (తమిళ సాహిత్యం) - **Sangam Poetry**
22. డబ్బు-మని-షి - **Money Poetry**
23. శాంతి యుద్ధం - **War-Peace Poetry**

అనువాదాలు (తెలుగు మరియు ఇతర భాషల్నుంచి ఇంగ్లీషులోకి) **Translations :**

1. **Modern Bhagavad Geeta** (Poetry) (Vyasa)
2. **Soundarya Lahari** (Poetry) (Sankaracharya)
3. **Bhagavatam** (Poetry) (Potana)
4. **Samparayam** (Poetry) (Suprasanna)
5. **The Tree of Fire** (Poetry) (Anumandla Bhoomaiah)
6. **The Pool of Blood** (Novel) (Ampasayya Naveen)
7. **The Poems of Kuppam** (Poetry) (Seeta Ram)
8. **The Broken Grammar** (Poetry) (T.W. Sudhakar)
9. **We need a language** (Poetry) (T.W. Sudhakar)
10. **This is No Streaking** (Stories) (K.K. Menon)
11. **The Voice of Telangana** (Poetry) (Madiraju Ranga Rao)
12. **Satarupa** (Poetry) (A.K. Khanna)
13. **Fire & Ice** (Poetry) (Rama Chandramouli)
14. **హిందీ నుంచి తెలుగులోకి – మధుశాల (హరివంశరాయ్ బచ్చన్)**

శతకాలు (Poetry) :

1. **కుయ్యోమొర్రో శతకం**
2. **భైరవ శతకం**
3. **కాయగూర శతకం**
4. **అయ్యబాబోయ్ శతకం**

త్వరలో (Poetry) :

1. **దైవమార్గం (మహమ్మదీయ మతం)** (Poetry)
2. **సెలయేరు** (Master Poems - English to Telugu)
3. **ఎమిలి డికెన్‌సన్ కవిత్వం** (తెలుగులో)
4. **సౌగంధిక** (కవిత్వం)
5. **ఎండా–వానా** (కవిత్వం)
6. **ప్రేమ కురిసిన వేళలో...** (కవిత్వం)
7. **పిల్లనగ్రోవి పిలుపు** (కవిత్వం)

తూర్పు పడమర

ప్రపంచ సాహిత్యం-35

వాళ్లిద్దరూ స్నేహితులు. ఇద్దరూ కలిసి కొన్నాళ్లు తిరిగారు.
కవిత్వం వ్రాసారు, ప్రచురించారు. విమర్శించుకున్నారు, విడిపోయారు.
అయినా ఇద్దరూ ఒక గొప్ప కవిత్వయుగానికి (Romanticism),
కాల్పనిక వాదమైన భావవాద యుగానికి తెరతీసినారు.

ఇద్దరూ ప్రకృతి ప్రేమికులే!
ఒకరి చూపు ఆశవేపు, ఇంకొకరిది నిరాశ చూపు.
వర్డ్సవర్త్ తూర్పు, కాలరిడ్జి పడమర.
ఈ ఇద్దరి కవుల అద్భుత కవితలను కొన్నింటిని అనువదించి
సృజనలోకం తెలుగు సాహితీలోకానికి సవినయంగా సమర్పిస్తున్నది.

డాక్టర్ లంకా శివరామప్రసాద్